www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 13-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 299

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా. 8.22 తదుపరి విదియ; నక్షత్రం: మఖ రా. 9.07 తదుపరి పుబ్బ; వర్జ్యం: ఉ. 8.21-10.03, తె. 5.47 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 10.35-11.20, మ. 3.09-3.55; అమృతఘడియలు: రా. 6.33-8.15; రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.46, సూర్యాస్తమయం: 6.12 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కుంభమేళాకు పోటెత్తిన భక్తులు 2

మాఘ పౌర్ణమిన మధ్యాహ్నానికే 1.6 కోట్ల మంది స్నానాలు

హెలికాప్టర్ నుంచి పూలవర్షం

భక్తుల భద్రత కోసం ఆపరేషన్ చతుర్భుజ్ ప్రారంభం



ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఘాట్ వద్ద లక్షలాదిగా భక్తులు

ఉచితం.. అనుచితం!



"నిరాశ్రయులను ప్రధాన స్రవంతిలో భాగం కానివ్వాలి. వారిని దేశాభివృద్ధికి తోడ్పడేలా మార్చాలి. కానీ... దీనికి బదులు ఇన్నిన్ని ఉచిత సౌకర్యాలు కల్పిస్తున్నారు! ఇలా చేయడం ద్వారా మనం ఒక పరాన్నజీవుల వర్గాన్ని సృష్టించడం లేదంటారా? ఎన్నికలకు ముందు ప్రకటించే లాడ్లీ బెహన్ తదితర ఉచిత పథకాల వల్ల... ప్రజలు పని చేయడానికి ఇష్టపడట్లేదు. ఎలాంటి పనీ చేయకుండానే వారికి ఉచిత రేషన్, డబ్బులు అందుతున్నాయి"

- సుప్రీం కోర్టు

నేనూ వ్యవసాయ కుటుంబం నుంచే వచ్చాను. మహారాష్ట్రలో ఎన్నికలకు ముందు ఉచిత పథకాలను ప్రకటించి అమలు చేయడం వల్ల రైతులకు కూలీలు దొరకడం లేదు. ప్రతి ఒక్కరికీ ఇంటి వద్ద ఉచితంగా రేషన్, డబ్బులు వస్తుంటే వారు పనికి ఎందుకు వస్తారు?

-జస్టిస్ బీఆర్ గవాయ్

పథకాలతో పరాన్నజీవులను సృష్టిస్తున్నామా?



ఏ పనీ చేయకుండానే రేషన్, డబ్బులు

దీంతో పని చేయడానికి ఇష్టపడట్లేదు

మహారాష్ట్రలో ఎన్నికలముందు పథకాలతో రైతులకు కూలీలు దొరకడంలేదు

నిరాశ్రయులను ప్రధాన స్రవంతిలోకి తేవాలి

దేశాభివృద్ధికి వారూ తోడ్పడేలా చేయాలి

సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పలు రాజకీయ పార్టీలు పోటీలు పడి ప్రకటిస్తున్న 'ఉచిత' పథకాలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఎన్నికలకు ముందు అలా ఉచితాలను పంపిణీ చేసే పద్ధతి సరైంది కాదని.. ఉచిత పథకాల మూలంగా ప్రజలు పనిచేయడం మానేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఉచితాలు ఇవ్వడం ద్వారా మనం పరాన్నజీవుల వర్గాన్ని సృష్టిస్తున్నామా? అని ప్రశ్నించింది. ఢిల్లీలో ఇల్లులేని వారికి ఆశ్రయం కల్పించాలంటూ సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ సందర్భంగా.. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం పలు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఎన్నికలకు ముందు మహారాష్ట్రవంటి రాష్ట్రాల్లో లాడ్లీ బెహన్ వంటి పథకాలను ప్రవేశపెట్టడంతో ప్రజలు ఉచితాలపైనే ఆధారపడుతున్నారని, పనిచేయడానికి ఇష్టపడడం లేదని.. పనిచేయకుండా ఉచిత రేషన్ పొందుతున్నారని

మిగతా 2వ పేజీలో...

కూలీలు దొరకడం లేదు

ప్రభుత్వ పథకాలు అందుతుండటంతో ఉన్నచోటు వదిలి రావడానికి ఇష్టపడటం లేదు

దీంతో భవన నిర్మాణ కూలీలకు తీవ్ర కొరత

ఎల్ అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణియన్ వ్యాఖ్యలు



రాష్ట్ర బడ్జెట్ కూర్పుపై ఆర్థిక శాఖ అధికారులతో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్

సంక్షేమం-అభివృద్ధికి సమ ప్రాధాన్యం

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ఈ ఏడాది నుంచే అమల్లోకి..

2025-26 బడ్జెట్ కసరత్తుపై సీఎం సమీక్ష

28న అసెంబ్లీలో వార్షిక బడ్జెట్ సమర్పణ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): 2025-26 బడ్జెట్‌ను అభివృద్ధి - సంక్షేమం సమతూకంతో రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బడ్జెట్ కసరత్తుపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సమీక్షించారు. ఈ సమావేశానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ అధికారులు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. 2024-25 ఆర్థిక

మిగతా 13వ పేజీలో...

నియోజకవర్గానికో స్పెషాలిటీ ఆస్పత్రి

300 పడకలతో ఏర్పాటుకు కృషి చేస్తా

ఎక్కడ ఉన్నా గంటలోనే ఆస్పత్రికి..

ఆ స్థాయిలో వైద్యసేవల విస్తరణ

సంపూర్ణ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఉగాది నుంచి పీ-4 విధానం అమలు

త్వరలో 'మన మిత్ర'లో ప్రైవేటు సేవలూ

ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి



13

బంధం బలోపేతం



భారత కాన్సులేట్ వద్ద ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, ప్రధాని మోదీ అభివాదం

వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు పెంచుకోవాలి

అంతర్జాతీయ వేదికపై మన భాగస్వామ్యం పెరగాలి

ద్వైపాక్షిక చర్చల్లో మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్

అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై సుదీర్ఘ చర్చలు

ఫ్రాన్స్‌లో కొత్త కాన్సులేట్‌ను ప్రారంభించిన మోదీ

పారిస్, ఫిబ్రవరి 12: ఇరు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను పెంపొందించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ పిలుపునిచ్చారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సంబంధాలను, వివిధ అంతర్జాతీయ వేదికల్లో తమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న మోదీ.. మంగళవారం సాయంత్రం ఫ్రాన్స్ అధ్యక్ష విమానంలో పారిస్ నుంచి మార్సెలీకి వెళ్లారు. అక్కడ మేక్రాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలు, కీలక అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. విస్తృత చర్చల అనంతరం వారిద్దరూ మాట్లాడుతూ..

మిగతా 2వ పేజీలో...



భుజాలపై కుమారుడితో ఎలాన్ మస్క్.. ఆయన మాటలను వింటున్న ట్రంప్

వైట్‌హౌస్‌లోకి తనయుడితో మస్క్

ట్రంప్ ప్రెసిడెంట్ అయ్యాక తొలిసారి అధ్యక్ష భవనంలోకి..

తండ్రి భుజాలనెక్కి కూర్చున్న నాలుగేళ్ల కొడుకు

మస్క్ నేతృత్వం వహిస్తున్న విభాగానికి మరిన్ని అధికారాలు కట్టబెడుతూ ట్రంప్ ఆదేశాల జారీ 2

పుతిన్‌కు ట్రంప్ ఫోన్

గంటన్నరపాటు మాట్లాడుకున్న అగ్రనేతలు

ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణపై తక్షణం అమెరికాతో చర్చకు పుతిన్ అంగీకారం

యుద్ధాన్ని ఆపడంపైనే చర్చించానన్న ట్రంప్

ట్రంప్ సుంకాలతో ఆటోమొబైల్స్‌లో గందరగోళం

ఉత్పత్తి వ్యయాలు పెరుగుతాయి: ఫోర్డ్ సీఈవో



ఆర్బీఐ కొత్త గవర్నర్ సంతకంతో రూ.50 నోట్లు!

త్వరలోనే మార్కెట్‌లోకి..

పాత నోట్లు యథావిధిగా చెల్లుబాటు అవుతాయి: ఆర్బీఐ

'కోటక్ మహీంద్రా'పై ఆంక్షల ఎత్తివేత.. కొత్త క్రెడిట్ కార్డులు ఇచ్చేందుకూ ఆర్బీఐ అనుమతి

ముంబై, ఫిబ్రవరి 12: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కొత్త గవర్నర్ సంతకంతో కూడిన రూ.50 నోట్లు త్వరలోనే మార్కెట్‌లోకి రానున్నాయి. ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ మల్హోత్రా సంతకం చేసిన రూ.50 నోట్లను విడుదల చేయనున్నట్లు ఆర్బీఐ బుధవారం వెల్లడించింది. ఇప్పటికే మార్కెట్లో ఉన్న రూ.50 నోట్లు యథావిధిగా చెల్లుబాటు

మిగతా 2వ పేజీలో...

అర్థమవుతోందా.. సీఎం సార్!?



ఐఏఎస్‌లకే అర్థంకాని పదజాలం

విద్యాసంస్థల్లో చర్చలు జరపాలన్న సీఎం

మాకే తలకెక్కలేదు.. జనానికి ఏం చెబుతాం!?

తలలు పట్టుకుంటున్న అధికారులు

ఇలాగైతే ప్రభుత్వ లక్ష్యం ప్రజలకు చేరేదెలా?

జనంలోకి వెళ్లని 'స్వర్ణాంధ్ర-2047' పత్రం.. ప్రపంచస్థాయి ఇంగ్లిష్‌తో తంటాలు

పాలనా వ్యవహారాలు సామాన్యులకు కూడా అర్థం కావాలంటూ జీవోలను తెలుగులో ఇస్తున్నారు. మరి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'స్వర్ణాంధ్ర-2047' విజన్ డాక్యుమెంటును సామాన్యుల భాషలో ఎందుకు రూపొందించలేదు? తెలుగులో ఎందుకు అందుబాటులోకి తేలేదు?

ఇటీవలి కాలంలో సీఎం చంద్రబాబు ప్రెస్‌మీట్ పెట్టిన ప్రతిసారీ స్వర్ణాంధ్ర-2047 గురించి మాట్లాడుతున్నారు. కానీ.. అందులో ఏం ఉందో డాక్యుమెంట్ తయారు చేసిన కన్సల్టెన్సీకి, ఆ బాధ్యత చూసుకుంటున్న అధికారులకు తప్ప మరెవ్వరికీ అర్థం కావడం లేదు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ స్థాయి ఇంగ్లిషు... పక్కా కన్సల్టెంట్ పదజాలం... పీహెచ్‌డీ థీసిస్ తరహా వాక్యాలు! గులకరాళ్ల లాంటి కఠినమైన భాష! ఇదీ... 'స్వర్ణాంధ్ర-2047' డాక్యుమెంట్ తీరు! 'వికసిత్ భారత్' లక్ష్యానికి సమాంతరంగా రాష్ట్రాన్నీ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'స్వర్ణాంధ్ర 2047' పేరుతో ఒక విజన్ బుక్ తయారు చేయించారు. మంచిదే... లక్ష్యాలు ఉన్నతమైనవే! కానీ... ప్రభుత్వ ఉద్దేశాలు ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడంలో మాత్రం విఫలమయ్యారు. ఈ డాక్యుమెంట్‌పై జిల్లా, మండల స్థాయిలో చర్చ జరగాలని...

మిగతా 14వ పేజీలో...

శ్రీకాకుళంలో జీబీఎస్ కలకలం!

బాలుడు మృతి చెందినట్టు అనుమానం

గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో

నిర్ధారణ కావాల్సి ఉందని వెల్లడి 14

విద్యార్థులు, గ్రామస్థులకు పరీక్షలు

కర్నూలులో 37.8 డిగ్రీలు 2

బాబోయ్ చికెన్ వద్దు!

బర్డ్ ఫ్లూతో తగ్గిన కోడి మాంసం ధరలు

కొనుగోలుకు వెనుకంజ వేస్తున్న జనం

పశ్చిమలో పలుచోట్ల దుకాణాల మూసివేత

ఇతర ప్రాంతాలపైనా ప్రభావం

పతనమైన గుడ్డు, ఫారం కోడి ధరలు

చికెన్, గుడ్లు బాగా ఉడికించి తినొచ్చు

పరిశుభ్రత పాటించాలి: పశుసంవర్ధక శాఖ



తణుకులో మూతపడిన చికెన్ దుకాణం

భీమవరం/తణుకు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ ప్రభావం చికెన్ వినియోగదారులు, రైతులు, వ్యాపారులపై పడింది. చికెన్ పేరెత్తితేనే జనం బెంబేలెత్తుతున్నారు. ఫలితంగా చికెన్ ధరలు పతనమయ్యాయి. వారం రోజులుగా కేజీ చికెన్ ధర 220 నుంచి 240 రూపాయలు ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పౌల్ట్రీల్లో బర్డ్ ఫ్లూ నిర్ధారణ కావడంతో జనంలో భయం నెలకొంది. ఫలితంగా కేజీకి 40 రూపాయల వరకు తగ్గించి

మిగతా 14వ పేజీలో...



హిందుస్థాన్ కోకాకోలా సీఈవో పాబ్లో రోడ్రిగ్జ్‌కు జ్ఞాపికను అందిస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో మంత్రి టీజీ భరత్ తదితరులు

పెట్టుబడులకు పూర్వవైభవం

కోకాకోలా పెట్టుబడుల కొనసాగింపే నిదర్శనం.. మంత్రి నారా లోకేశ్ వెల్లడి

హెచ్‌సీసీబీ బృందంతో భేటీ.. సిఫీ సీఎండీతోనూ లోకేశ్ చర్చలు

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానం.. సంసిద్ధత వ్యక్తంచేసిన రాజు వేగేశ్న

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ (హెచ్‌సీసీబీ) ఆసక్తి చూపింది. ఉండవల్లి నివాసంలో బుధవారం ఆ సంస్థ సీఈవో జువాన్ పాబ్లో రోడ్రిగ్జ్ బృందం మంత్రి నారా లోకేశ్‌ను కలిసింది. కోకాకోలా బృందాన్ని కలవడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా

మిగతా 13వ పేజీలో...

దక్షిణాది ఆలయ యాత్రకు పవన్

కేరళ అగస్త్య మహర్షి ఆలయంలో పూజలు

కుమారుడితో కలిసి మొక్కు సమర్పణ.. అక్కడి మహర్షి ఆశ్రమ సందర్శన

నడుంనొప్పితో బాధపడుతున్న పవన్.. ఆశ్రమంలో మూలికా వైద్యంపై ఆరా

దక్షిణాది యాత్ర నా వ్యక్తిగతం.. తమిళనాడులోని గుళ్లనూ సందర్శిస్తా: పవన్



కేరళలోని కొచ్చి సమీపంలో ఉన్న శ్రీఅగస్త్య మహర్షి ఆలయంలోకి తన కుమారుడు అకిరానందన్‌తో కలిసి వెళుతున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 3

వారంలో తిరుపతికి సీబీఐ చీఫ్!

టీటీడీ పూర్వ పాలకవర్గాన్ని ప్రశ్నించే వీలు.. నాటి కీలక అధికారులపైనా విచారణ

అంత తక్కువకు నెయ్యి ఎలా కొన్నారు?.. అందులో నాణ్యత ఎలా సాధ్యం? 13

కమీషన్లు, పర్సెంటేజీలకు ఆశ పడ్డారా?.. నాటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి లొంగారా?

లోతుగా ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్న సిట్.. నెయ్యి పరిమాణంలోనూ తేడాలు



విదేశీ ఇంజన్లు రాకనే ఆలస్యం

హెచ్ఏఎల్‌కు సామర్థ్యం లేక కాదు.. అర్థం చేసుకోవాలి

తేజస్ ఎంకే1ఏ విమానాల తయారీలో జాప్యంపై తేజస్ ఎంకే2 ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.మధుసూదనరావు

'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ 2

రాజ్యసభకు కమల్‌హాసన్!



గత ఎన్నికల్లో డీఎంకేకు కమల్ మద్దతు.. అప్పుడే స్టాలిన్ హామీ

జూలై 24న తమిళనాడులో ఖాళీ కానున్న 6 రాజ్యసభ సీట్లు

కమల్‌తో రాష్ట్ర మంత్రి చర్చలు 2



ప్రయాగ్‌రాజ్ వెళ్లే రైల్లో కిక్కిరిసిన భక్తులు



కుంభమేళాకు పోటెత్తిన భక్తులు

ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 12: మాఘ పౌర్ణమి సందర్భంగా మహా కుంభమేళాకు జనం భారీగా తరలివచ్చారు. ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఘాట్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకే దాదాపు 1.60 కోట్ల మంది పుణ్యస్నానాలు చేశారని యూపీ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. త్రివేణీ సంగమం, ఇతర ఘాట్‌లలో 1.59 కోట్ల మంది స్నానాలు చేసినట్టు పేర్కొంది. కాగా, నెలరోజులుగా కొనసాగిన కల్పవాస్ కార్యక్రమం మాఘ పౌర్ణమి స్నానంతో ముగిసింది. సుమారు 10 లక్షల మంది కల్పవాసీలు మహాకుంభమేళా ప్రాంతం నుంచి తరలిపోవడం ప్రారంభమైంది. హెలికాప్టర్ నుంచి భక్తులపై పూల వర్షం కురిపించారు. మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే, భార్య చైత్న రాంతీర్థతో కలిసి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం చేశారు. మాఘ పౌర్ణమి రద్దీని దృష్టిలో ఉంచుకొని వీఐపీ ప్రొటోకాల్స్‌ను రద్దు చేశారు. భక్తుల భద్రత కోసం 'ఆపరేషన్ చతుర్భుజ్' చేపట్టామని యూపీ ప్రభుత్వం తెలిపింది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం(ఐసీసీసీ) నుంచి 2,750 హైటెక్ కెమేరాలు, యాంటీ డ్రోన్ వ్యవస్థ ద్వారా 24 గంటలూ పర్యవేక్షిస్తున్నట్టు పేర్కొంది. పొరుగు జిల్లాల నుంచి ఎన్ని వాహనాలు వస్తున్నాయో ఎప్పటికప్పుడు టోల్ ప్లాజాల నుంచి సమాచారం సేకరించి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రయాగ్‌రాజ్ ఏడీజీ భాను భాస్కర్ తెలిపారు. భక్తులకు ప్రతి 10 నిమిషాలకు అందుబాటులో ఉండేలా రవాణాశాఖ అదనంగా 1200 షటిల్ బస్సులు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 26న నిర్వహించే 'అమృత స్నానం'తో మహాకుంభమేళా ముగియనుంది.

లోకం తీరు



వైట్‌హౌస్‌లోకి తనయుడితో మస్క్



వాషింగ్టన్, ఫిబ్రవరి 12: ఎలాన్ మస్క్ నేతృత్వం వహిస్తున్న డోజ్ విభాగానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరిన్ని అధికారాలు కట్టబెట్టారు. డోజ్ విభాగం సూచిస్తే ఆ మేరకు సిబ్బందిలో కోత విధించాలని, డోజ్‌ను సంప్రదించిన తర్వాతే కొత్త నియామకాలు చేపట్టాలని అమెరికాలోని ఫెడరల్ ఏజెన్సీలను ఆదేశిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేశారు. అవసరమైన మేరకే సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ఆ సమయంలో ఎలాన్ మస్క్ ట్రంప్ పక్కనే ఉన్నారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక మస్క్ తొలిసారి మంగళవారం వైట్‌హౌస్‌కు వచ్చారు. వెంట తన నాలుగేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. వైట్‌హౌస్‌లో అధ్యక్షుడి పక్కన మస్క్ తన కొడుకును భుజాలపై ఎత్తుకున్న ఫొటో,సరదాగాఉన్న వీడియోవైరల్ అవుతున్నాయి.

ట్రంప్ సుంకాలతో 'ఆటోమొబైల్'లో గందరగోళం

- ఉత్పత్తి వ్యయాలు పెరుగుతాయి: ఫోర్డ్ సీఈవో ఫర్లీ

వాషింగ్టన్, ఫిబ్రవరి 12: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదిత, విధిస్తున్న సుంకాల కారణంగా ఆటోమొబైల్ పరిశ్రమలో గందరగోళం ఏర్పడుతోందని ప్రముఖ ఆటోమొబైల్ ఉత్పత్తుల సంస్థ ఫోర్డ్ సీఈవో జిమ్ ఫర్లీ అన్నారు. ట్రంప్ సర్కారు సుంకాల బెదిరింపులు, ఎలక్ట్రిక్ వాహనాలపై ద్వేషం వల్ల ఉత్పత్తి వ్యయాలు కూడా చాలా పెరిగే అవకాశముందని ఓ ఆర్థిక సమావేశంలో ఫర్లీ వ్యాఖ్యానించారు

యూట్యూబర్ రణ్‌వీర్‌కు 1.4 లక్షల మంది అభిమానులు దూరం

తల్లిదండ్రులపై అసభ్యకర వ్యాఖ్యల ఫలితం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: వావివరుసలు, ఇంగితం లేకుండా తల్లిదండ్రుల గురించి అసభ్యకరమైన (ప్రచురించటానికి వీలు లేని) భాషలో మాట్లాడిన రణ్‌వీర్ అలహాబాదియా.. తన సోషల్ మీడియా అకౌంట్లలో వేల సంఖ్యలో ఫాలోవర్లను కోల్పోతున్నాడు. గడిచిన కొన్ని రోజుల్లోనే దాదాపు 1,42,000 మంది రణ్‌వీర్‌ను అన్‌సబ్‌స్క్రైబ్ చేసుకున్నారని వెల్లడైంది. ఇప్పటి వరకూ రణ్‌వీర్ ఫాలోవర్లుగా ఉన్న అనేక మంది అతడి మాటలను ఈసడించుకుంటూ, తీవ్రమైన కామెంట్లు పెడుతూ.. అతడి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ చానళ్ల నుంచి వైదొలుగుతున్నారు.

పుతిన్‌కు ట్రంప్ ఫోన్

- ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణపై తక్షణం అమెరికాతో చర్చలకు పుతిన్ అంగీకారం

వాషింగ్టన్, ఫిబ్రవరి 12: ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించే దిశగా రష్యాను ఒప్పించేలా అమెరికా చర్యలు ప్రారంభించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేశారు. ఇద్దరు నేతలు గంటన్నరపాటు మాట్లాడుకున్నారు. ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ అంశమ్మీద అమెరికాతో తక్షణం చర్చించేందుకు పుతిన్ అంగీకరించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయమ్మీద తాను పుతిన్‌తో చర్చించినట్లు సామాజిక మాధ్యమాల ద్వారా ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు తమ ప్రత్యేక బృందం రష్యాతో వెంటనే సంప్రదింపులు చేయనుందని, త్వరలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ మాట్లాడతానని ట్రంప్ చెప్పారు. యుద్ధం వల్ల సంభవిస్తున్న మరణాలను ఆపాలనేదానిపై పుతిన్, తాను అంగీకారానికి వచ్చినట్లు ట్రంప్ పేర్కొన్నారు.

ఆర్బీఐ కొత్త గవర్నర్ సంతకంతో 50 నోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అవుతాయని స్పష్టం చేసింది. ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా సంతకంతో నోట్లు జారీ కావడం ఇదే తొలిసారి. గత ఏడాది డిసెంబరులో ఆయన ఆర్బీఐ పగ్గాలు చేపట్టారు. మహాత్మాగాంధీ సిరీస్‌లో కొత్త గవర్నర్ సంతకంతో రూ.50 నోట్లను విడుదల చేయనున్నట్లు ఆర్బీఐ తెలిపింది. ప్రస్తుతం చాలా వరకు పాత గవర్నర్ శక్తికాంత దాస్ సంతకం చేసిన నోట్లే చలామణీలో ఉన్నాయి. మరోవైపు, ప్రైవేట్ రంగానికి చెందిన కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు భారీ ఊరట లభించింది. 9 నెలల క్రితం (2024 ఏప్రిల్) ఈ బ్యాంక్‌పై విధించిన ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ఆర్బీఐ బుధవారం ప్రకటించింది. గతంలో గుర్తించిన లోపాలపై బ్యాంక్ తగిన చర్యలు చేపట్టిన నేపథ్యంలో రిజర్వ్ బ్యాంకు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో కోటక్ బ్యాంక్ మళ్లీ ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ చానళ్ల ద్వారా కొత్త వినియోగదారులను చేర్చుకునేందుకు వీలు కలగనుంది. అలాగే, కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేసేందుకూ ఈ బ్యాంక్‌కు అనుమతిచ్చింది.

ఉచితం.. అనుచితం!

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా.. "పని ఉన్నప్పుడు చేయకూడదని ఎవరనుకుంటారు? చాలా మంది గ్రామాల నుంచి పట్టణాలకు వస్తున్నది సరైన పని దొరక్కపోవడం వల్లనే కదా?" అని ప్రశాంత్ భూషణ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. "మీకు ఒక కోణం మాత్రమే తెలిసినట్లున్నది. నేను వ్యవసాయ కుటుంబం నుంచే వచ్చాను. మహారాష్ట్రలో ఎన్నికలకు ముందు ఉచితాలను ప్రకటించడం వల్ల రైతులకు కూలీలు దొరకడం లేదు. ప్రతి ఒక్కరికీ ఇంటి వద్ద ఉచితంగా రేషన్ లభిస్తుంటే వారు పనికి ఎందుకు వస్తారు?" అని ప్రశ్నించారు. ఏదేమైనా ఈ అంశంపై తాము చర్చలోకి వెళ్లాలని భావించట్లేదని పేర్కొన్నారు. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సహా అందరూ అంటారని పేర్కొన్న ధర్మాసనం.. అదే సమయంలో (ఉచితాలకు, పని కల్పించడానికి మధ్య) సమతౌల్యం పాటించాల్సిన అవసరం లేదా అని అభిప్రాయపడింది. ఢిల్లీలో ప్రస్తుత షెల్టర్లలో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని ప్రశాంత్ భూషణ్ చేసిన వ్యాఖ్యలకు.. "రోడ్డుపై పడుకోవడం, నివాసయోగ్యం కాని షెల్టర్ హోమ్‌లో ఉండడం.. ఈ రెండింటిలో ఏది మెరుగు?" అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు.

సమాచారాన్ని సేకరిస్తున్నాం..

పట్టణాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించేందుకు కేంద్రం 'పట్టణ పేదరిక నిర్మూలన' పథకాన్ని ఖరారు చేస్తోందని అటార్నీ జనరల్ ధర్మాసనానికి వెల్లడించారు. అది ఎప్పటిలోగా పూర్తవుతుందని న్యాయమూర్తులు ప్రశ్నించగా.. రాష్ట్రాల నుంచి సమాచారం సేకరిస్తున్నామని, దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తామని ఆయన చెప్పారు. కాగా.. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయుల సంఖ్య పెరగడానికి మూలకారణాలపై ఎవరూ దృష్టిసారించకపోవడం దురదృష్టకరమని విచారణ సందర్భంగా ఒక పిటిషనర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ధనికులను మాత్రమే పట్టించుకుంటోందని, పేదలను విస్మరిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. దీనికి జస్టిస్ గవాయ్.. కోర్టులో రాజకీయ ఉపన్యాసాలు చేయొద్దని, అనవసర ఆరోపణలు చేయొద్దని సూచించారు. కోర్టు గదులను రాజకీయ పోరుకు వేదిక కానివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. "ప్రభుత్వం ధనికులను మాత్రమే పట్టించుకుంటోందని మీరెలా చెప్పగలరు?" అని సదరు పిటిషనర్‌ను నిలదీశారు.



ఆ లెక్కలు సరైనవేనా?

అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం 2024 డిసెంబరు 4 నాటికి దేశవ్యాప్తంగా కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాలు మంజూరు చేసిన 2557 షెల్టర్లకుగాను.. 1995 షెల్టర్లు పనిచేస్తున్నాయని, వాటిలో 1.16 లక్షల పడకలున్నాయని ధర్మాసనానికి అటార్నీ జనరల్ వివరించారు. దీనికి ప్రశాంత్ భూషణ్.. ఒక్క ఢిల్లీలోనే 3 లక్షల మందికిపైగా నిరాశ్రయులు ఉన్నట్టు ఒక సర్వేలో వెల్లడైందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కానీ, ఢిల్లీ అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు గణాంకాల ప్రకారమే ఢిల్లీలోని షెల్టర్ల సామర్థ్యం 17 వేలు (అంత మంది తలదాచుకునేటన్ని షెల్టర్లు) అని.. వాటిలోనూ కేవలం 5,900 పడకలు మాత్రమే ఉన్నాయని.. సమస్య ఎంత పెద్దదో ఈ అంకెలే చెబుతున్నాయని ఆయన వివరించారు. కాగా.. పిటిషనర్లలో ఒకరైన ఈఆర్ కుమార్.. రాష్ట్రాలవారీగా నిరాశ్రయుల సంఖ్య, షెల్టర్లు, వాటి సామర్థ్యానికి సంబంధించిన వివరాలను కోర్టుకు సమర్పించారు. దీనికి ధర్మాసనం.. ఆ అంకెలు సరైనవో కావో సంబంధిత మంత్రిత్వ శాఖను అడిగి చెప్పాల్సిందిగా అటార్నీ జనరల్‌ను ఆదేశించి, కేసు తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

కూలీలు దొరకడం లేదు

ప్రభుత్వ పథకాలు అందుతుండటంతో ఉన్నచోటు వదిలి రావడానికి ఇష్టపడటం లేదు

ఎల్‌అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణియన్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: వారానికి 90 గంటలు పనిచేయాలంటూ ఇటీవల ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన ఎల్‌అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణియన్, తాజాగా మరోసారి చర్చలోకి వచ్చారు. ప్రభుత్వాలు అందిస్తున్న ఉచిత సంక్షేమ పథకాల కారణంగా భవన నిర్మాణ కార్మికులు తాము ఉన్న ప్రాంతం వదిలి పనుల కోసం వలసలు పోవడానికి ఇష్టపడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. దీనివల్ల కూలీలను సమకూర్చుకోవడం కష్టంగా మారిందన్నారు. మంగళవారం మైసూరులో జరిగిన సీఐఐ సదస్సులో సుబ్రహ్మణియన్ ఈ వ్యాఖ్యలు చేశారు. కూలీల వలసలకు ఉపాధి హామీ పథకం, జన్‌ధన్ వంటి పథకాలు అడ్డుగా ఉన్నాయని సుబ్రహ్మణియన్ అన్నారు. "కొత్త అవకాశాల దిశగా అడుగులు వేసేందుకు భవన నిర్మాణ కార్మికులు సిద్ధపడటం లేదు. బహుశా స్థానికంగా వారి ఆర్థిక పరిస్థితి బాగుండటం, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు దీనికి కారణం కావచ్చు" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థిక మంద్యాన్ని దృష్టిలో ఉంచుకుని కూలి భత్యాలను సవరించాలన్న ఆయన.. ఇక్కడ కంటే మూడు నుంచి మూడున్నర రెట్లు ఎక్కువ భత్యం ఇచ్చి పశ్చిమాసియా దేశాలు మన కార్మిక శక్తిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు.

సిక్కు అల్లర్ల కేసులో సజ్జన్ కుమార్ దోషిగా ఖరారు

- ఈ నెల 18న శిక్ష ఖరారు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: సిక్కు అల్లర్ల కేసులో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌ను ఢిల్లీ న్యాయస్థానం దోషిగా ఖరారు చేసింది. ఈ నెల 18న ఆయనకు శిక్షను ఖరారు చేస్తామని ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం 1984 నవంబర్ ఒకటిన ఢిల్లీలోని సరస్వతి విహార్ ప్రాంతంలో ఉన్న సిక్కుల నివాసాలపై అల్లరి మూకలు మారణాయుధాలతో విరుచుకుపడ్డాయి. ఈ కేసులో 2021 డిసెంబర్ 16న సజ్జన్‌కుమార్‌పై అభియోగాలు నమోదయ్యాయి. విచారణలో భాగంగా కోర్టు ఆయన్ను దోషిగా గుర్తించింది.

విద్యలో వివక్ష తగదు: సుప్రీం

విద్య విషయంలో ఏ విద్యార్థీ వివక్షకు గురికారాదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. రోహింగ్యాలకు ప్రభుత్వబడుల్లోవిద్య, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స విషయంలో వివక్ష చూపరాదని కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలను ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

కర్నూలులో 37.8 డిగ్రీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కోస్తాలోని పలు ప్రాంతాల్లో బుధవారం పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం ఎనిమిది గంటల వరకూ మంచు కురవడంతో వాహనాల రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. అయితే మధ్యాహ్నం ఎండ దారెత్తించింది. రాయలసీమ, కోస్తాలోని పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. బుధవారం దేశంలోనే అత్యధికంగా కర్నూలులో 37.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

రాజ్యసభకు కమల్ హాసన్..!



చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు, 'మక్కల్ నీదిమయ్యం' (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లడం ఖాయమైనట్లు తెలిసింది. డీఎంకే సీనియర్ నేత, తమిళనాడు మంత్రి పీకే శేఖర్‌బాబు మంగళవారం రాత్రి కమల్‌తో స్థానిక ఆళ్వారుపేటలోని ఎంఎన్ఎం పార్టీ కార్యాలయంలో అరగంటపాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు రాజ్యసభ ఎన్నికపైనే చర్చించినట్లు సమాచారం. జూలై 24న తమిళనాట ఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి డీఎంకే కూటమికి 4, అన్నాడీఎంకే కూటమికి 2 స్థానాలు రావడం ఖాయంగా కనిపిస్తోంది. ఆ ఎన్నికలో తమ కూటమి తరపున కమల్‌ను రాజ్యసభకు పంపించాలని స్టాలిన్ నిర్ణయించినట్లు తెలిసింది. నిజానికి గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కమల్ డీఎంకేకు మద్దతు ప్రకటించడంతో పాటు పలు చోట్ల ప్రచారం కూడా చేశారు. ఆ ఎన్నికల్లో కమల్ పార్టీ నుంచి ఎవ్వరూ పోటీ చేయలేదు. తమ పార్టీకి బేషరతుగా మద్దతు ఇచ్చిన కమల్‌ను రాజ్యసభకు పంపిస్తామని స్టాలిన్ అప్పట్లోనే హామీనిచ్చారు. ఇప్పుడది కార్యరూపం దాల్చనుంది.

బంధం బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)



మొదటి ప్రపంచయుద్ధంలో అమరులైన భారత సైనికుల సమాధుల వద్ద ప్రధాని మోదీ, మేక్రాన్ నివాళి

ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రపంచ కృత్రిమ మేధ.. సామాజిక, ఆర్థిక, పర్యావరణానికి ఉపయోగపడే ఫలితాలను అందించగలిగేలా నిర్దిష్ట చర్యలు తీసుకునేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలతో పాటు కీలకమైన అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపైనా తాము చర్చించినట్టు సంయుక్తంగా ప్రకటించారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో తక్షణమే సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని వారు నొక్కిచెప్పారు. భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వానికి ఫ్రాన్స్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఈ సందర్భంగా మేక్రాన్ మరోసారి స్పష్టం చేశారు.

భారత్‌కు రావాలని మేక్రాన్‌కు ఆహ్వానం

రక్షణ, సివిల్ న్యూక్లియర్ ఎనర్జీ, అంతరిక్షం వంటి వ్యూహాత్మక రంగాల్లో సహకారంపై మోదీ, మేక్రాన్ సమీక్షించారు. క్షిపణులు, హెలికాప్టర్ ఇంజన్లు, జెట్ ఇంజన్లపై జరుగుతున్న చర్చలను ఇరువురూ స్వాగతించారు. భారత్ రూపొందించిన పినాకా రాకెట్ లాంచర్ వ్యవస్థను పరిశీలించాలని ఫ్రాన్స్‌ను మోదీ కోరారు. ఈ వ్యవస్థను కొనుగోలు చేస్తే ఇండో-ఫ్రాన్స్ రక్షణ సంబంధాల్లో మరో మైలురాయి అవుతుందన్నారు. 2024లో పారిస్ ఒలింపిక్స్, పారాలింపిక్స్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు మేక్రాన్‌ను మోదీ అభినందించారు. 2036లో ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఫ్రాన్స్ అనుభవాన్ని, నైపుణ్యాన్ని పంచుకోవడానికి సుముఖత వ్యక్తం చేసిన మేక్రాన్‌కు ధన్యవాదాలు తెలిపారు. మార్సెల్లీ సమీపంలోని తీరప్రాంత పట్టణం కాసిస్‌లో ప్రధాని మోదీకి.. మేక్రాన్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారత్‌లో పర్యటించాల్సిందిగా.. మేక్రాన్‌ను మోదీ ఆహ్వానించారు. మేక్రాన్‌తో కలిసి మార్సెల్లీ నగరంలో భారత నూతన దౌత్య కార్యాలయాన్ని మోదీ ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ కార్యాలయం ఏర్పాటు ద్వారా ఇరు దేశాల మధ్య బంధం మరింత బలోపేతమవుతుందని చెప్పారు. అనంతరం మజార్గెస్ మిలటరీ శ్మశాన వాటికను వారు సందర్శించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో అమరులైన భారతీయ సైనికుల సమాధుల వద్ద మోదీ, మేక్రాన్ పుష్పగుచ్ఛాలు ఉంచి ఘన నివాళి అర్పించారు. ఫ్రాన్స్‌లోనే ప్రధాని మోదీ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుమారుడు వివేక్ పుట్టినరోజు వేడుకకు హాజరయ్యారు. ఆ చిన్నారికి బర్త్‌డే గిఫ్ట్ కూడా ఇచ్చారు. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో కూడా మోదీ భేటీ అయ్యారు. కృత్రిమ మేధ భారత్‌లో తీసుకురానున్న అద్భుతమైన అవకాశాలపై చర్చించారు. 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' కోసం గూగుల్, భారత్ కలిసి ఎలా పనిచేయవచ్చో మాట్లాడారు. పారిస్‌లో మంగళవారం జరిగిన ఏఐ సదస్సు సందర్భంగా మోదీని కలిసినట్టు సుందర్ పిచాయ్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

12 మంది గ్యాంగ్‌స్టర్ల జాబితా సిద్ధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: మోదీ అమెరికా పర్యటనలో భాగంగా గురువారం ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవనున్నారు. ఈ క్రమంలో భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాలో నక్కి భారత్‌లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న 12 మంది గ్యాంగ్‌స్టర్ల జాబితాను సిద్ధం చేసి దాన్ని అమెరికాకు ఇవ్వనుంది. ఆ గ్యాంగ్‌స్టర్లను అప్పగించాలని కోరనున్నట్టు తెలిసింది. ఈ జాబితాలో.. దర్మన్‌జోత్ సింగ్, అమృత్ పాల్ సింగ్, హర్‌జోత్ సింగ్, హర్పీర్ సింగ్, నవ రూప్ సింగ్, స్వరణ్ సింగ్, సాహిల్ కైలాష్ రిటోలి, యోగేశ్, భాను ప్రతాప్ సంబ్లీ, అమన్ సాంబి పేర్లు ఉన్నాయి.

విదేశీ ఇంజన్లు రాకనే ఆలస్యం

- హెచ్‌ఏఎల్‌కు సామర్థ్యం లేక కాదు.. అర్థం చేసుకోవాలి
- తేజస్ ఎంకే1ఏ విమానాల తయారీలో జాప్యంపై తేజస్ ఏంకే2 ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.మధుసూదనరావు
- 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి-ఏబీఎన్): తేజస్ ఎంకే1ఏ విమానాలకు సంబంధించి కీలక పరిజ్ఞానాల విషయంలో మనం విదేశాల మీద ఆధారపడి ఉన్నామని.. ఇంజన్లు రాకపోవడం వల్లనే వాటి తయారీ ఆలస్యమవుతోంది తప్ప హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు సామర్థ్యం లేకపోవడంవల్ల కాదని తేజస్ ఎంకే2 ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ వి.మధుసూదనరావు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అర్థం చేసుకుని ఓపిక పట్టాలని ఆయన పేర్కొన్నారు. తేజస్ ఎంకే1ఏల తయారీలో నెలకొన్న జాప్యం నేపథ్యంలో.. హెచ్ఏఎల్ మీద తనకు నమ్మకం లేదంటూ ఎయిర్‌చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ మధుసూదనరావు ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం బెంగళూరులో జరుగుతున్న 'ఏరో ఇండియా షో'కు హాజరైన ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ముఖ్యాంశాలు..

తేజస్ ఎంకే1ఏ తయారీలో భారత్ వెనకబడి ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి కదా.. దీనిపై మీ అభిప్రాయమేమిటి?

మన దేశం వెనకబడడం కాదు. దాని తయారీకి సంబంధించిన కీలక పరిజ్ఞానాల విషయంలో మనం విదేశాల మీద ఆధారపడి ఉన్నాం. ఉదాహరణకు.. ఇంజన్, ఎజెక్షన్ సీటు వంటివి. మనకు ఆ టెక్నాలజీ ఇంకా లేదు. అభివృద్ధి చేస్తున్నాం. త్వరలోనే ఆ పరిజ్ఞానాన్ని కూడా మనం కలిగి ఉంటాం. ఇప్పుడు ఇంజన్లు సమయానికి రాకపోవడం వల్ల హెచ్ఏఎల్ ఉత్పత్తి కొంత ఆలస్యమైంది. అంతే తప్ప ఆ సంస్థ సామర్థ్యంలో ఎలాంటి లోపమూ లేదు. వారికి సామర్థ్యం ఉంది. కానీ, సప్లై చైన్‌లో సమస్యల వల్ల ఉత్పత్తి రేటు తగ్గుతుంది. ఇప్పుడు జనరల్ ఎలక్ట్రిక్ ఏరోస్పేస్ కూడా ముందుకొచ్చి వాటిని సరఫరా చేస్తామని చెప్పింది. ఇది మన దేశ రక్షణ రంగ సంస్థ తప్పు కాదు.. వేరే దేశానికి చెందిన సంస్థ సమస్య. మన హెచ్ఏఎల్ మాత్రం సమయానికి వాయుసేనకు సరఫరా చేయగలదు.

తేజస్ ఎంకే 2 ఎప్పటికి సిద్ధమవుతుంది?

ఈ విమానం 4.5+ జనరేషన్ టెక్నాలజీతో అభివృద్ధి చేస్తున్నాం. ఎంకే 1 (4+ జనరేషన్)తో పోలిస్తే చాలా అధునాతనమైనది. వచ్చే ఏడాది మార్చిలోగా ఫస్ట్ ఫ్లయిట్‌కు సిద్ధమవుతుంది. దీంట్లో వాడే పరిజ్ఞానాలు అత్యంత అధునాతనమైనవి. ఉదాహరణకు ఐఆర్‌ఎస్‌టీ (ఇన్‌ఫ్రారెడ్ సెర్చ్ అండ్ ట్రాక్) టెక్నాలజీ.. ఇది యాక్టివ్ రేడార్‌కు సమానమైనది. కానీ పాసివ్ రేడార్. రెండోది.. మిస్సైల్ అప్రోచ్ వార్నింగ్ సిస్టమ్. ఏదైనా క్షిపణి మన ఎయిర్‌క్రాఫ్ట్ దగ్గరకు వస్తుంటే దాన్ని గుర్తించి, పైలట్‌కు దాని వివరాలు తెలియజేస్తుంది. దాన్ని తప్పించుకోవాలా? లేక కౌంటర్ మెజర్స్ తీసుకోవాలా? సూచనలిస్తుంది. అయితే, ఈ విమానాల అభివృద్ధికి కావాల్సిన మెటీరియల్ లభ్యత కష్టంగా ఉంది. ఎందుకంటే మార్క్2 ఎయిర్‌క్రాఫ్ట్.. మార్క్1 కంటే పెద్దది. అందుకే మేం దగ్గరుండి మిధాని, ఓఎఫ్‌ఏజేలో మెటీరియల్స్ తయారుచేయించి, ఎయిర్‌క్రాఫ్ట్‌ను అభివృద్ధి చేస్తున్నాం. విమానం డిజైన్ పూర్తయ్యింది. డిజైనింగ్‌లో సీడీఆర్, పీడీఆర్ అనే దశలుంటాయి. అవి రెండూ పూర్తయ్యాయి. డ్రాయింగ్ రిలీజ్ ప్రాసెస్ కూడా పూర్తయింది. కాంపొనెంట్ల తయారీ మొదలుపెట్టాం. ఈ మాక్-2 డిజైన్.. మాడ్యూలార్ తరహాలో చేశాం. అంటే చిన్న చిన్న భాగాలుగా తయారు చేశాం. వాటిని అసెంబుల్ చేస్తాం. ఇలా మాడ్యూల్ తరహాలో చేయడం వల్ల వాటన్నింటినీ కలిపి.. విమానాన్ని వేగంగా ఉత్పత్తి చేసి, ఎగిరేలా చేయొచ్చు. ఎంకే1కు మాడ్యులారిటీ లేదు కాబట్టే.. దాని ఉత్పత్తి రేటు తక్కువగా ఉంది. కానీ, ఇప్పుడీ మాడ్యులారిటీ విధానం వల్ల ఏడాదికి 24 ఎంకే2 విమానాలు తయారుచేయొచ్చు. వాటి నిర్వహణ కూడా సులువుగా ఉంటుంది. ఏ మాడ్యూల్‌లో సమస్య ఉంటే ఆ మాడ్యూల్‌ను మార్చేస్తే సరిపోతుంది. అది లేకపోవడం వల్లే మాక్1 విమానాల నిర్వహణ కష్టం.

తేజస్ ఎంకే 2 ఐదో తరం విమానాలతో సమానంగా ఉండే అవకాశం ఉందా?

తేజస్ మార్క్2 అనేది ఎయిర్ సుపీరియారిటీ తరహా విమానం. ఎంకే1 ఎయిర్‌క్రాఫ్ట్.. 'ఎయిర్ డిఫెన్స్' కేటగిరీకి చెందినది. ఎయిర్ సుపీరియారిటీ కేటగిరీ విమానాల్లో పెద్ద సంఖ్యలో ఆయుధాలను మోసుకెళ్లగలదు. మన డీఆర్‌డీవో దేశీయంగా అభివృద్ధి చేస్తున్న అన్ని రకాల ఆయుధాలనూ దీన్నుంచి ప్రయోగించవచ్చు. పరిస్థితులను బట్టి 45 రకాల కాన్ఫిగరేషన్లతో ఎగరగలదు. మార్క్-1 విమానాలు 1500 కిలోమీటర్లు ప్రయాణించగలిగితే.. ఇవి 3000 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలవు. మార్క్1 విమానాల విషన్ ఎండ్యూరెన్స్ 51 సెకన్లుగా ఉంటే.. మార్క్2లో అది 126 సెకన్లుగా ఉంటుంది. దీని నిర్మాణంలో అత్యంత ఆధునిక సెన్సర్లు.. ఆయుధాలను ఇంటిగ్రేట్ చేశాం. ఈ విమానంలో కాక్‌పిట్ కూడా అత్యంత అధునాతనమైనది. ఎఫ్-35తో సమానమైన కాక్‌పిట్ ఎంకే2లో ఉంది. వీటన్నింటివల్ల.. పైలట్లు ఈ యుద్ధవిమానాన్ని ఎంతగానో ఇష్టపడతారు.

ఐదో తరం యుద్ధవిమానాల తయారీలో భారత్ వెనకబడిందని రక్షణ రంగ విశ్లేషకుల అభిప్రాయం.. దీనికి మీరేమంటారు?

అది అంత నిజం కాదు. మనం ఐదో తరం యుద్ధవిమానం ఆమ్కా (ఏఎంసీఏ) డిజైన్‌ను ఇప్పటికే పూర్తిచేశాం. మార్క్2లో సైతం ఐదో తరం పరిజ్ఞానాలను పొందుపరచాం. ఆమ్కా ఐదో తరం ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ అయినా.. అందులో పొందుపరుస్తున్న సాఫ్ట్‌వేర్, ఇతర పరిజ్ఞానాలను బట్టి చూస్తే అది 5.5 లేదా 6వ తరం విమానాలతో సమానం.

ఆమ్కా ఎప్పట్నుంచీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది?

ఆమ్కా డిజైన్ పూర్తయింది. అదో స్టెల్త్ విమానం. దాని తయారీలో పలు రకాల స్టెల్త్ పరిజ్ఞానాలను వినియోగించాం. ఈ విమానాల ప్రోటోటైప్‌లు రెండేళ్లలో సిద్ధమవుతాయి. ఆ తర్వాత మరో మూడు, మూడున్నరేళ్లలో ఫస్ట్ ఫ్లయిట్ జరుగుతుంది.

ప్రైవేటు సంస్థలను రంగంలోకి దింపడం వల్ల ఈ విమానాల తయారీ వేగవంతమవుతుందా?

కచ్చితంగా ఉంటుందని చెప్పొచ్చు. ఎందుకంటే.. ఈ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీలో మన ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీకి ప్రధాన భాగస్వామి హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్. ఆ దిశగా హెచ్ఏఎల్ ఎంతగానో శ్రమిస్తోంది. అయినప్పటికీ వారికి ఇతరత్రా చాలా బాధ్యతలున్నాయి. వారికి ఇది కాకుండా వేరే ప్రోగ్రాములు కూడా ఉన్నాయి. కాబట్టి, ప్రైవేటు సంస్థలను కూడా భాగస్వాములను చేస్తే.. అవి తయారుచేసే 90 శాతం పరికరాలను హెచ్ఏఎల్ ఇంటిగ్రేట్ చేస్తే ఉత్పత్తి రేటు పెరుగుతుంది. లేదా మన వైమానిక దళానికి ఏం కావాలో వాటిని హెచ్ఏఎల్ ఉత్పత్తి చేసి, ఎగుమతి చేయాల్సిన వాటిని ప్రైవేటు సంస్థల ద్వారా తయారు చేయిస్తే సరిపోతుంది.

నౌకాదళం కోసం ప్రత్యేకంగా ఎలాంటి విమానాలను అభివృద్ధి చేస్తున్నారు?

నేవీ కోసం విమానవాహక యుద్ధనౌకల మీద ల్యాండ్, టేకాఫ్ అయ్యే ఎయిర్‌క్రాఫ్ట్‌ను మనం ఇప్పటికే అభివృద్ధి చేశాం. 2003లో ఆ ప్రాజెక్టు మనకు మంజూరైంది. దాన్ని అభివృద్ధి చేసి.. 2009లో టేకాఫ్, ల్యాండింగ్ చేయగలిగాం. ప్రపంచంలోనే ఆ టెక్నాలజీ ఉన్న ఐదో దేశంగా నిలిచాం. ఆ టెక్నాలజీని ఉపయోగించుకుని నేవీ కోసం అడ్వాన్స్‌డ్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ 'టెడ్‌బీఎఫ్ (ట్విన్ ఇంజన్ డెక్ బేస్డ్ ఫైటర్)'ను అభివృద్ధి చేస్తున్నాం. డిజైన్ ఫైనలైజ్ అయ్యింది. ప్రభుత్వ మంజూరు కోసం ఎదురుచూస్తున్నాం. అదెప్పుడైనా రావచ్చు. వస్తే దాన్ని కూడా వేగంగా అభివృద్ధి చేసి ఇవ్వగలం.



నిడదవోలులో జరిగిన మనవడు విష్ణు వివాహ రిసెప్షన్‌లో బంధువులతో వెంకయ్య నాయుడు

ఘనంగా వెంకయ్య మనవడి వివాహ రిసెప్షన్

నిడదవోలు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు మనవడు యిమ్మణ్ణి విష్ణు వివాహ రిసెప్షన్ బుధవారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు హాజరై వధూవరులను దీవించారు. ఈ సందర్భంగా ఆయన్ను మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు బూరుగుపల్లి శేషారావు, జి.శ్రీనివాస్ నాయుడు, పలువురు జిల్లా ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

అప్పన్న సేవలో జస్టిస్ శ్యామ్‌ప్రసాద్



సింహాచలంలో కప్ప స్తంభం వద్ద జస్టిస్ శ్యామ్‌ప్రసాద్

సింహాచలం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.శ్యామ్‌ప్రసాద్, సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్ బుధవారం దర్శించుకున్నారు. కప్పస్తంభ ఆలింగనం చేసుకున్న అనంతరం అంతరాలయంలో, గోదాదేవి సన్నిధిలో పూజలు నిర్వహించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రశాంత్ కిషోర్



రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ బుధవారం వేకువజామున తిరుమల ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఏపీ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ప్రకాశ్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

– ఆంధ్రజ్యోతి, తిరుమల

ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యమివ్వాలి

- తద్వారా గ్రామాల్లో సుపరిపాలన
- పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల అభిప్రాయాలను, సూచనలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా గ్రామాలకు సుపరిపాలన అందించవచ్చని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థ కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ బుధవారం ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడం ద్వారా ప్రజలకు ఏమి అవసరమో తెలుస్తుందన్నారు. గ్రామ పాలన అందించే స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల సామర్థ్యం పెంచేందుకు కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు మండలాలకు చెందిన 15 పంచాయతీలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వికసిత్ పంచాయత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల సామర్థ్యం పెంపొందించేందుకు ఒక కార్యక్రమాన్ని రూపొందించాలని నిర్ణయించింది. అందుకు వ్యూహాత్మక కార్యాచరణ కోసం ఆంధ్రప్రదేశ్, అసోం, గుజరాత్, ఒడిసా రాష్ట్రాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. వర్క్‌షాపులో అడిషనల్ కమిషనర్ సుధాకర్‌రావు, అల్లూరి జిల్లా జడ్పీ సీఈవో, జడ్పీపీపీ, డీపీవో, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈ నెల 24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న క్రమంలో 23న జనసేన పార్టీ శాసన సభాపక్ష సమావేశాన్ని నిర్వహించాలని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ సమావేశం జరగనుంది.

లక్ష్యం.. మూడేళ్లు

రాజధాని పనులకు సీఆర్‌డీఏ టైమ్ టేబుల్

- క్షేత్రస్థాయి పనులకు కార్యాచరణ ప్రణాళిక
- మార్చి 8న ముగియనున్న ఎమ్మెల్సీ కోడ్
- ఆరోజే ఎల్‌ఓఏలు.. మార్చి 15న టెండర్లు ఖరారు
- ఉగాదికి సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం సిద్ధం
- రెండున్నరేళ్లలో ఐకానిక్ భవనాలు పూర్తి చేయాలని లక్ష్యం
- కోడ్ ముగియగానే కేంద్ర సంస్థలకు భూ కేటాయింపులు
- ఇన్నర్ రింగ్ రోడ్డుపై ప్రత్యామ్నాయ ఆలోచనలు



హెల్త్‌సిటీలో ప్రముఖ ఆస్పత్రులు

నవ నగరాల్లో భాగంగా రాజధానిలో నిర్మించే హెల్త్‌సిటీలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ ఆస్పత్రులకు భూములు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, ఎల్‌వీ ప్రసాద్, మేదాంత, వోక్‌హార్డ్ ఆస్పత్రులకు అనుమతులు ఇచ్చారు. కాగా, రాజధానిలోని అన్ని గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను సీఆర్‌డీఏ రూపొందిస్తోంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వం.. ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ.. చకచకా కదులుతున్న ఫైళ్లు.. సిద్ధంగా ఉన్న నిధులు.. వరుసగా మొదలవుతున్న పనులు.. ఐదేళ్ల పాటు విధ్వంసాన్ని తట్టుకున్న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మూడేళ్లలో సిద్ధం కానుంది. ఈ మేరకు రాజధాని నిర్మాణ పనులు పూర్తిచేయడానికి సీఆర్‌డీఏ ఒక టైమ్ టేబుల్‌ను రూపొందించుకుంది. ప్రస్తుతం టెండర్లు పిలుస్తున్న పనులన్నింటినీ గరిష్ఠంగా మూడేళ్లలో పూర్తి చేయాలని, రాజధానికి ఒక రూపు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. క్షేత్ర స్థాయిలో ఏ ప్రాజెక్టు ఎంత సమయంలో పూర్తి చేయాలన్న కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఇప్పటికే పిలిచిన రూ. 20 వేల కోట్ల విలువైన టెండర్లను ఖరారు చేయలేని పరిస్థితి నెలకొంది. ఎన్నికల కోడ్ ముగిసే మార్చి 8న లెటర్ ఆఫ్ అగ్రిమెంట్స్ (ఎల్‌ఓఏ) ఇచ్చి మార్చి 15 లోపు ఆ టెండర్లను ఖరారు చేయాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. ఉగాది నాటికి అమరావతిలో సీఆర్‌డీఏ కాంప్లెక్స్‌లో పలు సంస్థలు విధులు నిర్వహించేలా పనులు పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏ తొలి లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇక్కడే సీఆర్‌డీఏ, ఏడీసీతో పాటు మునిసిపల్ పట్టణాభివృద్ధి సంస్థ, కమిషనర్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, టౌన్ అండ్ కంట్రీ ప్లాన్, మునిసిపల్ మంత్రి కార్యాలయం ఇతర మునిసిపల్ సంబంధిత కార్యాలయాలన్నీ కొలువుతీరతాయి. ఆ తర్వాత గరిష్ఠంగా ఏడాదిన్నరలోపు అఖిలభారత సర్వీసు (ఏఐఎస్), ఎన్‌జీఓ, గెజిటెడ్ ఆఫీసర్స్ టవర్స్ ప్రిన్సిపల్ సెక్రటరీల భవన నిర్మాణ పనులను పూర్తి చేయనుంది. రాజధానిలో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగంగా నిర్మించే రోడ్లను ఏడాదిన్నరలో పూర్తి చేసేందుకు లక్ష్యం నిర్దేశించుకుంది. రాజధానిలో ఎల్‌పీఎస్ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనను కూడా గరిష్ఠంగా ఏడాదిన్నరలోపు పూర్తి చేయనున్నారు. ఇక అమరావతి రాజధానిలో అత్యంత ప్రధానమైన సచివాలయం జీఏడీ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలకు సంబంధించి ఇంకా టెండర్లు పిలవాల్సి ఉంది. ఈ ఐకానిక్ బిల్డింగ్‌లను గరిష్ఠంగా రెండున్నరేళ్లలో నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు. ఇక ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే.. అమరావతిలో కేంద్ర సంస్థలకు భూ కేటాయింపుల ప్రక్రియను పూర్తి చేసి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. కేంద్ర సంస్థలకు మొత్తంగా 1,278 ఎకరాలను కేటాయించారు. త్వరలో క్యాబినెట్ ముందుకు తీసుకువెళ్లి ఈ కేటాయింపులకు ఆమోదం పొందనున్నారు.

రైతుల ప్లాట్లలో మౌలిక సదుపాయాలకు టెండర్లు

రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ప్యాకేజీ ప్రకారం ఇచ్చే ప్లాట్లను అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. ఈ టెండర్లలో ఎన్‌సీసీ, ఎల్‌అండ్‌టీ, మేగా వంటి సంస్థలు తమ బిడ్లను దాఖలు చేసినట్టుగా తెలుస్తోంది. మార్చి 15వ తేదీ లోపు టెండర్లను ఖరారు చేస్తారు. ఇక ఇన్నర్ రింగ్ రోడ్డు విషయంలో సీఆర్‌డీఏ అధికారులు ప్రత్యామ్నాయ ప్రణాళికలను అమలు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. అలాగే అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు కొన్ని సూచనలను కన్సల్టెంట్‌కు సూచించారు. దీని ప్రకారం డిజైన్ వచ్చాక.. అన్ని జాతీయ రహదారులను కనెక్ట్ చేసేలా సీఆర్‌డీఏ చర్యలు తీసుకోనుంది.

రుణ ప్రయత్నాలన్నీ కొలిక్కి

అమరావతి రాజధాని నిర్మాణ పనులకు ఇప్పటి వరకు రూ. 31 వేల కోట్లను రుణంగా తీసుకోవాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రూ. 15 వేల కోట్ల రుణం ఖరారు కాగా, హడ్కో నుంచి రూ.11 వేల కోట్ల రుణం మంజూరైంది. వీటితో పాటు కేఎఫ్‌డబ్ల్యూ నుంచి మరో రూ. 5 వేల కోట్ల రుణ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి వరకైతే రూ. 26 వేల కోట్ల రుణానికి లైన్ క్లియర్ అయింది. దీంతో పాటు హడ్కో మరో రూ. 5 వేల కోట్ల రుణాన్ని ఇవ్వటానికి ఆసక్తి చూపిస్తోంది.

పార్ట్ టైమ్ ల్యాబ్ అటెండర్లకూ

'60 ఏళ్లు' అమలు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ ల్యాబ్ అటెండర్లు 60 ఏళ్ల వరకూ కొనసాగేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం 58 ఏళ్లతో వారి సేవలను నిలిపివేస్తున్నారు. కాంట్రాక్టు, పార్ట్ టైమ్ లెక్చరర్ల తరహాలో 60 ఏళ్ల విధానం వీరికీ వర్తిస్తుందన్నారు.

'యాక్సిస్' నుంచి విద్యుత్తు కొనుగోలు వద్దు

- ప్రజలపై భారం మోపితే ఉద్యమం: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి అధిక ధరలకు విద్యుత్తు కొనుగోలు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. 'యాక్సిస్' సంస్థతో విద్యుత్తు కొనుగోలు ఒప్పందం వల్ల రానున్న 25 ఏళ్లలో వినియోగదారులపై రూ.14,186.92 కోట్ల మేర భారం పడుతుందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ సహా దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో దాదాపు రూ.2,100 కోట్లు లంచాలుగా ముట్టజెప్పి సౌర విద్యుత్తు ఒప్పందాలు చేసుకున్న అదానీ అవినీతి కార్యకలాపాలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

గ్రూప్-2 మెయిన్స్ హాల్ టిక్కెట్లు విడుదల

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల హాల్ టిక్కెట్లను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. గురువారం నుంచి అభ్యర్థులు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. ఈ నెల 23న ఉదయం, మధ్యాహ్నం గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాలకు హాల్ టిక్కెట్లు మాత్రమే తీసుకురావాలని ఏపీపీఎస్సీ స్పష్టంచేసింది.

దక్షిణాది ఆలయ యాత్రకు పవన్

- కేరళ అగస్త్య మహర్షి ఆలయంలో పూజలు



కేరళ రాష్ట్రంలోని కొచ్చి సమీపంలో ఉన్న శ్రీఅగస్త్య మహర్షి ఆలయం వద్ద తన కుమారుడు అకిరానందన్‌తో కలిసి పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ భారతదేశ ఆలయాల యాత్రకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. బుధవారం కేరళలోని చొట్టనిక్కర ప్రాంతంలోని అగస్త్య మహర్షి ఆలయాన్ని కుమారుడు అకిరానందన్‌తో కలిసి ఆయన సందర్శించారు. టీటీడీ బోర్డు సభ్యుడు ఆనంద్‌సాయి వెంట ఉన్నారు. అగస్త్య ఆలయ ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు యోగిదాస్, ఇతర సభ్యులు... పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలికారు. కేరళ సంప్రదాయాలతో ఆలయ పండితులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయనతో ఆలయంలో ప్రదక్షిణ చేశారు. అగస్త్య మహర్షికి సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో ఉన్న ఇతర మహా రుషుల ఆలయాలను కూడా పవన్ దర్శించుకున్నారు. ఆలయ ఆకృతిని, కట్టడాలను ఆసక్తిగా పరీక్షించారు. ప్రత్యేక పూజల అనంతరం అగస్త్య ఆశ్రమంలో కొద్దిసేపు గడిపారు. ఆయుర్వేద వైద్యంలో ఉపయోగించే మూలికలు, మొక్కల గురించి ఆశ్రమ వైద్యులు విష్ణుయోగి, మణియోగి...... ఆయనకు వివరించారు. అగస్త్య మహర్షి పురాణాల్లో, వేదాల్లో చెప్పినట్లుగా ముఖ్యమైన చికిత్సలకు మూలికలు ఎలా ఉపయోగపడతాయనేది ఆయన అడిగి తెలుసుకున్నారు. కలరి యుద్ధకళ గొప్పదనం గురించి, ఆశ్రమం ఆవరణలోని శివలింగం విశిష్ఠత గురించి పవన్ తెలుసుకున్నారు. సుదీర్ఘంగా నడుం నొప్పి, స్పాండిలైటిస్ సమస్యలతో పవన్ కల్యాణ్ బాధపడుతున్నారు. వీటికి సంబంధించిన చికిత్స విధానాలను గురించి అగస్త్య ఆశ్రమ వైద్యులను పవన్ కల్యాణ్ అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో ప్రత్యేకంగా అందించే చికిత్సాలయాన్ని సందర్శించారు. అగస్త్య ఆశ్రమానికి సుదూర ప్రాంతాల నుంచి చికిత్స నిమిత్తం ప్రతి రోజు 200 మందికి పైగా వస్తుంటారని అక్కడ సిబ్బంది చెప్పారు. ఆయుర్వేదం మనిషిపై ప్రభావం చూపడానికి కాస్త సమయం పట్టినా, దీర్ఘకాలంలో ఆరోగ్యానికి మంచిదని వైద్యులు వివరించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అగస్త్య మహర్షి వేదాల్లో వివరించిన చికిత్స పద్ధతులు, సంప్రదాయాల గురించి ఆయనకు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "దక్షిణాది రాష్ట్రాల ఆలయాల సందర్శన అనేది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. రాజకీయాలకు సంబంధం లేదు. సుమారు నాలుగున్నర సంవత్సరాల క్రితం చెల్లించుకోవలసిన మొక్కుల నిమిత్తం, నా ఆరోగ్యం అంతగా సహకరించకున్నా రావాల్సి వచ్చింది. కేరళతోపాటు తమిళనాడులో ఉన్న ఆలయాలను కూడా దర్శించుకుంటాను." అని పవన్ తెలిపారు. ఎర్రచందనం అమ్మకాల విషయంలో నూతన విధానం తీసుకురావాలని కేంద్రాన్ని కోరామని డిప్యూటీ సీఎం అన్నారు.

తిరుమల భక్తుల మనోభావాలు కాపాడాలి

తిరుమలకు వచ్చే భక్తుల మనోభావాలను కాపాడటం అందరి బాధ్యత అని పవన్ కల్యాణ్ అన్నారు. తిరుమల లడ్డూలో వాడిన నెయ్యి కల్తీ అయినట్టు సీబీఐ దర్యాప్తులో తేలడం దురదృష్టకరమని, ఇలాంటి ఘటనలు మళ్లీ భవిష్యత్తులో జరగకుండా టీటీడీ పాలకవర్గం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నెయ్యి కల్తీ వ్యవహారంపై దర్యాప్తులో మంచి పురోగతి ఉండటం, దోషులను అరెస్టు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆస్పత్రుల్లో పరిశుభ్రత పెంచాలి

- సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలి
- ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, అధికారులతో స్పెషల్ సీఎస్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రత మెరుగుపరచాలి. రాష్ట్రంలో ముఖ్యమంత్రి స్థాయిలో ప్రభుత్వాసుపత్రుల పనితీరుపై నిరంతరం సమీక్ష జరుగుతోంది' అని ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు అన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో 256 ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రుల సేవల పట్ల రెండు విడతల్లో ఐవీఆర్ఎస్ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయ వివరాల్ని ఆయన వారికి తెలిపారు. 'ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్న అంశాల్లో అనతి కాలంలో సానుకూలత సాధించాలి. లేకుంటే ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, అడ్మినిస్ట్రేటర్లపై కఠిన చర్యలు ఉంటాయి. మొదటి దఫా అభిప్రాయ సేకరణ జనవరి 27న జరగ్గా, రెండవ అభిప్రాయ సేకరణ ఈ నెల 7న జరిగింది. మొత్తం ఆరు అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ జరగ్గా, 5 అంశాలకు సంబంధించి ప్రజల్లో సానుకూలత మెరుగయ్యింది. పరిశుభ్రత బాగాలేదన్న వారి సంఖ్య మొదటి సర్వేలో 33 శాతం, రెండో సర్వేలో 59 శాతం వచ్చింది. ఈ ఐవీఆర్ఎస్ సర్వేపై చంద్రబాబు సమీక్షించి ఆస్పత్రుల్లో పరిశుభ్రత మెరుగుపరచాలని చెప్పారు. ప్రభుత్వాసుపత్రులను సీఎం స్వయంగా సందర్శించి వాస్తవాల్ని గమనించి రోగుల అభిప్రాయాల్ని తెలుసుకోనున్నారు. తదుపరి సర్వే సమయానికి ఆసుపత్రుల్లో పరిశుభ్రత పెంచాలి. సానుకూల ఫలితాలు సాధించే దిశగా సూపరింటెండెంట్లు సమర్థ నాయకత్వాన్ని ప్రదర్శించాలి. రెవెన్యూ విభాగాల్లో దీర్ఘకాల అనుభవం ఉన్న అడ్మినిస్ట్రేటర్లు వారి సామర్థ్యాన్ని చూపాలి' అని కృష్ణబాబు సూచించారు.

సీఎంఏలో మాస్టర్ మైండ్స్

విద్యార్థికి మొదటి ర్యాంకు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రభంజనం సృష్టించారని అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని మెయిన్ క్యాంపస్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎంఏ ఫైనల్‌లో తమ విద్యార్థులు రిషబ్ ఓత్సాల్ మొదటి ర్యాంకు, ఎల్.వాగ్దేవి 2, ఎం.మోహన్ కృష్ణ 5వ ర్యాంకులు సాధించారని తెలిపారు. 50 లోపు 14 మంది ర్యాంకులు సాధించారన్నారు. సీఎంఏ ఇంటర్‌లో జి.తనూషారెడ్డి 4వ ర్యాంకు, బి.ఉజ్జిన్నప్ప 10వ ర్యాంకు సాధించారని, 50 లోపు మరో 16 మంది ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులను మాస్టర్‌మైండ్స్ డైరెక్టర్లు అభినందించారు.

ఎవరినీ వదిలిపెట్టేది లేదు

- గుంటూరు జిల్లా నేతలతో వైసీపీ అధ్యక్షుడు జగన్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో హామీలు ఇచ్చి అమలుచేయని చీటర్ చంద్రబాబుపై కేసులు ఎందుకు పెట్టకూడదు? అని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో గుంటూరు జిల్లా నేతలతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జగన్ మాట్లాడుతూ 'అన్యాయం చేసినవారిని ఎవరినీ వదిలిపెట్టను. చట్టం ముందు దోషిగా నిలబెడతాను. అన్యాయాలు చేస్తే ప్రజలు గుణపాఠం చెప్తారు. ఆ విషయాన్ని చంద్రబాబు మరిచిపోతున్నారు' అని అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రాజ్యాంగహితులేనా?

శాసనసభ ఆమోదించిన బిల్లుల మీద ఏ నిర్ణయం తీసుకోకుండా అంతకాలం ఎలా వదిలేస్తారు? అంటూ సుప్రీంకోర్టు ఇటీవల తమిళనాడు గవర్నర్‌ను ప్రశ్నించింది. గవర్నర్లు కేంద్రప్రభుత్వం ఏజెంట్లమాదిరిగా వ్యవహరిస్తున్నారంటూ విపక్షపాలిత రాష్ట్ర ప్రభుత్వాలు సర్వోన్నతన్యాయస్థానాన్ని ఆశ్రయించడం, ఆయా కేసుల వాదోపవాదాల సందర్భంగా న్యాయమూర్తులు ఆగ్రహాన్నీ, ఆవేదననూ, నిస్సహాయతనూ వ్యక్తంచేయడం చూస్తూనే ఉన్నాం. బలమైన రాజకీయ శత్రువు ఉన్నచోట గవర్నర్ కూడా నాలుగు ఆకులు ఎక్కువ చదివినవారే ఉంటారు. తమ తెలివితేటలనూ, శక్తియుక్తులను సంపూర్ణంగా వినియోగించి, ఆ రాష్ట్రాన్ని ఏలుతున్న వారిని వేధించుకుతింటూ, పాలనసాగనివ్వకుండా అడుగడుగునా అడ్డుపడుతూంటారు. విస్తృతప్రజామోదంతో నెగ్గివచ్చినా కూడా సదరు పార్టీలు తాము కోరుకున్న చట్టాలు చేసుకోవడానికీ, నిర్ణయాలు తీసుకోవడానికి కొట్టుమిట్టాడాల్సిందే. నిన్నటికి నిన్న ఘోరంగా ఓడిపోయిన ఢిల్లీ కేజ్రీవాల్, బెంగాల్ మమత, కేరళ విజయన్, తమిళనాడు స్టాలిన్ వరకూ అందరిదీ ఒకే కథ. విపక్షపాలిత రాష్ట్రాల్లో ఏ గవర్నర్ అద్భుతమైన పనితీరు కనబరుస్తారో వారికి ప్రమోషన్ ఇచ్చి ఢిల్లీలో దేశ అత్యున్నత పదవులతో అలంకరించే సంప్రదాయం కూడా ఉంది.

తమిళనాడు గవర్నర్ ఎన్.రవి నిలిపివేసిన పన్నెండు బిల్లుల్లో ఒకటి 2020 జనవరి నాటిది. బిల్లులను సమ్మతించరు, పునఃపరిశీలనకు వెనక్కుపంపరు, రెండోసారి పంపిన బిల్లులను కచ్చితంగా ఆమోదించాలన్న ధర్మాన్ని కూడా పాటించరు అని రాష్ట్రప్రభుత్వం గత రెండేళ్ళుగా సుప్రీంకోర్టులో వాపోతోంది. ప్రభుత్వం పంపిన పన్నెండు బిల్లులను ఎటూతేల్చకుండా మూడేళ్ళు ఆపివేసి, గత ఏడాది నవంబరులో సుప్రీంకోర్టులో జవాబు చెప్పుకోవాల్సి వస్తుందన్న కారణంగా కొన్నింటిని రాష్ట్రపతికి పంపడం వంటి చర్యలు న్యాయమూర్తులను ఆశ్చర్యపరిచాయి. ఆయన చర్యలు ఆర్టికల్ 200కు విరుద్ధమని గుర్తుచేస్తూ, గవర్నర్ అధికారాలు, విచక్షణల విస్తృతి గురించి అటార్నీ జనరల్‌ను గుచ్చిగుచ్చి ప్రశ్నిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసు విచారణలో భాగంగా పలు చక్కని వ్యాఖ్యలు చేసింది. గవర్నర్ అధికారాలను తగ్గించి చెప్పడం లేదని అంటూనే, బిల్లుల్ని ఆలస్యం చేయడంలో ఎన్. రవి తన సొంత విధానాన్ని అనుసరిస్తున్నారంటూ సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించి ఈ కేసులో తీర్పును రిజర్వుచేసింది.

అసెంబ్లీ రూపొందించిన అన్ని బిల్లులను గవర్నర్ ఆమోదించాల్సిన అవసరం లేదు. నచ్చినవాటికి సరేనని, నచ్చనివి తిప్పికొట్టవచ్చు. అవసరమైతే వివరణలు కోరవచ్చు, అంతిమంగా రాష్ట్రపతికీ నివేదించవచ్చు. ఈ మార్గాలన్నీ కాకుండా ఏళ్ళతరబడి తేల్చకుండా వదిలివేయడమంటే అది మరో రాజకీయపార్టీ మీద కక్షతీర్చుకోవడం కంటే, రాజ్యాంగాన్ని అవమానించడం అవుతుంది. చివరకు ఎటువంటి వ్యాఖ్యలు, వివరణలు లేకుండా బిల్లులు తిప్పికొట్టడం, నిలుపు చేస్తున్నామని చెప్పి, వెనక్కుపంపకపోవడం వంటి విన్యాసాలు కూడా జరిగాయి. ఒక బిల్లు ఉభయసభల్లో రెండోసారి ఆమోదం పొందితే, గవర్నర్ చెప్పిన మార్పుచేర్పులు అందులో జరిగినా, లేకున్నా దాని మీద ఆయన సంతకం చేయాల్సిందే తప్ప, తిప్పికొట్టడానికి వీల్లేదని ఆర్టికల్ 200 నిర్దేశిస్తోంది. ఈ కేసులో సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే పలుమార్లు తన అసంతృప్తిని వెలిబుచ్చింది. తీర్పులో సైతం బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్ అధికారాలూ పరిమితులమీద మరింత నిర్దిష్టమైన వ్యాఖ్యలు చేయవచ్చును. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన గవర్నర్లు రాజ్యాంగేతర శక్తుల్లాగా, రాజకీయపార్టీ అధికారిక ప్రతినిధుల్లాగా వ్యవహరిస్తున్నప్పుడు న్యాయస్థానాలు ఒక పరిధికి మించి చేయగలిగేదేమీ ఉండదు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల చేతుల్లోనే అధికారాలు ఉండాలి తప్ప, ప్రజలతో ప్రత్యక్షసంబంధం లేని నామమాత్రపు పెద్దల చేతుల్లో కాదు. రాష్ట్ర రాజకీయాల్లో తలదూర్చడం, పరోక్షపాలన సాగించడం, అర్థంపర్థంలేని వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రభుత్వాలను అవమానించడం, రాష్ట్రపతిపాలన విధిస్తామని బెదిరించడం వంటి చేష్టలతో గవర్నర్లు హద్దులు దాటుతున్నారు, రాజ్యాంగాన్ని అతిక్రమిస్తున్నారు. గవర్నర్లమీద సుదీర్ఘకాలం న్యాయస్థానాల్లోనూ, అక్కడ ఏమీ తేలక ప్రజాక్షేత్రంలోనూ విపక్ష పార్టీలు పోరాడుతూండటం, ముఖ్యమంత్రులు నిరసనదీక్షల్లో కూర్చోవడం ప్రస్తుత ప్రజాస్వామ్యస్థితికి నిదర్శనం.

ఆప్ ఓటమి ప్రజాస్వామ్య విజయమేనా?



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో పరాజయం ఆప్‌కు పూర్తిగా యుక్తమైనదే. అందుకు సంతోషించవలసింది ఏమీ లేదు. నిజానికి రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం మన దేశంలో సుస్థిరంగా వర్ధిల్లాలని కోరుకుంటున్న వారు ఆప్ ఓటమిలోని అపశకునాలకు ఆందోళన చెందాలి, మన గణతంత్ర రాజ్య భవిష్యత్తు గురించి శ్రద్ధతో ఆలోచించాలి. దేశ రాజకీయాలలో ఎటువంటి మినహాయింపులేని సంపూర్ణ ప్రాబల్యాన్ని నెలకొల్పుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చుకోవడంలో బీజేపీ మరో అడుగు ముందుకు వేసేందుకు ఢిల్లీ విజయం తోడ్పడుతుంది.


■ యోగేంద్ర యాదవ్

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ ఓడిపోయింది. మధ్యతరగతి ఓటర్లు మందహాసం చేస్తున్నారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రత్యర్థులు ఆనంద తాండవం చేస్తున్నారు. క్షమించాలి, నేనీ విజయోత్సవాలలో పాల్గొనలేను. ఇది నిజంగా 'ఆమ్ ఆద్మీ' విజయమేనా అని ప్రశ్నిస్తున్నాను. పది సంవత్సరాల క్రితం ఆప్‌లో పనిచేస్తున్న మాలో కొంతమందిపై పుకార్లు పుట్టించి, అవమానించి గెంటివేసిన వైనాన్ని నేను మరచిపోయానని మీరు పొరపడవద్దు. ఒక విశాల రాజకీయ సన్నివేశం గురించి యోచిస్తున్నప్పుడు నా వ్యక్తిగత అనుభవాలు, ఎంత చేదువైనా, ఆ వివేచనను ప్రభావితం చేయడాన్ని అనుమతించను. ఢిల్లీ ఎన్నికలలో బీజేపీ గెలుపు, ఆప్ ఓటమి ఆ విస్తృత రాజకీయ సన్నివేశంలో ఒక భాగం మాత్రమే. ఆ ఆలోచన నా గురించి కాదు, ఆప్, దాని నాయకుల గురించీ కాదు. నేను ముందే ప్రస్తావించినట్టు అది 'ఆమ్ ఆద్మీ' గురించి. చింత, కలత, ఆందోళన మిళితమైన మనసుతో నిట్టూరుస్తున్నాను.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఆప్ పదేళ్ల పాలన ఒక ప్రజాభిప్రాయ సేకరణ. ప్రజలు ఆప్ పాలనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఢిల్లీ ప్రజల ఆప్ తిరస్కారం బీజేపీకి అధికార లబ్ధిని సమకూర్చింది. గమనించారా? పరాజిత ఆప్, విజేత బీజేపీ మధ్య ఓట్ల శాతం కేవలం 3.5శాతం మాత్రమే. బీజేపీ సాధించుకున్న సీట్ల సంఖ్యను సూచిస్తే విజేత ఓట్ల వాటా పరాజిత ఓట్ల వాటా కంటే చాలా అధికంగా ఉండవచ్చనే భావన కలుగుతుంది. అయితే వాస్తవంగా ఆ రెండు వాటాల మధ్య తేడా ఊహాత్మక అంచనా కంటే చాలా తక్కువగా లేదూ?!

ఢిల్లీ ఎన్నికల ఫలితం ఎటువంటి పరిస్థితులలో విరుద్ధంగా ఉండేదో ఊహించడం కష్టమేమీ కాదు. అవినీతి ఆరోపణలు ప్రజల దృష్టికి వెళ్లకుండా ప్రసార మాధ్యమాలు బీజేపీ నాయకులను కాపాడిన విధంగానే ఆప్ నేతలనూ ఆదుకున్నట్టయితే పరిస్థితి మరో విధంగా ఉండేది. ఢిల్లీ ఎన్నికలు కేంద్ర బడ్జెట్‌కు ముందే నిర్వహించేందుకు ఎన్నికల సంఘం శ్రద్ధ చూపి ఉన్నట్టయితే, అలాగే ఢిల్లీ ఓటర్లను లక్ష్యం చేసుకునేందుకు కేంద్ర బడ్జెట్‌ను అనుమతించబోమన్న తన హామీకి ఈసీ కట్టుబడి ఉన్నట్టయితే పరిస్థితి భిన్నంగా ఉండేది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో వలే మహిళలకు నగదు బదిలీ పథకాన్ని అమలుపరచడంలో ఢిల్లీ ప్రభుత్వాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ నిరోధించకుండా ఉన్నట్టయితే ఓటర్లు అంతగా ఆప్‌కు వ్యతిరేకమయ్యేవారు కాదు అని నిశ్చితంగా చెప్పవచ్చు. ఆప్, కాంగ్రెస్‌లు పొత్తు పెట్టుకోకపోయినా ఎక్కడ పోటీ చేయాలి, ఎన్ని సీట్లకు పోటీ చేయాలి అనే విషయమై అవగాహన కుదుర్చుకున్నట్లయితే ఈ రెండు పార్టీల పరిస్థితి మరింత మెరుగ్గా ఉండేది. ప్రస్తావించిన వాటిలో ఏ ఒక్కటైనా సంభవించి ఉన్నట్టయితే మరో 2 శాతానికి పైగా ఓట్లు ఆప్‌కు చేకూరేవి. ఎన్నికల ఫలితాలపై పతాక శీర్షికలు భిన్నంగా ఉండేవి.

ఇదే సమయంలో ఓటర్లలో 'ప్రభుత్వ వ్యతిరేకత' చాలా తీవ్రంగా ఉందన్నది ఒక కొట్టివేయలేని వాస్తవం. అయితే ఈ వ్యతిరేకతను ఓట్ల వాటాల వైనం పూర్తిగా ప్రతిబింబించలేదు. ప్రజల శ్రేయస్సుకు సంబంధించిన వివిధ అంశాల–అభివృద్ధి, రోడ్లు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా– లో ఆప్ సర్కార్‌పై ప్రజల్లో భ్రమలు పూర్తిగా తొలగిపోయాయని సిఎస్‌డిఎస్–లోక్‌నీతి సర్వే ధ్రువీకరించింది. ఆప్ ప్రభుత్వం పనితీరుపై ప్రజల సంతృప్తి, కేంద్ర ప్రభుత్వ పనితీరు పై కంటే తక్కువగా ఉన్నది. అరవింద్ కేజ్రీవాల్‌కు వ్యక్తిగతంగా ప్రజాదరణ ఆ పార్టీకి లభించిన ఓటర్ల వాటా కంటే తక్కువగా ఉన్నది. అవినీతి నిర్మూలన నినాదంతో ప్రభవించిన ఆప్ ప్రభుత్వం 'పూర్తి'గా లేదా 'కొంతమేరకు' అవినీతి సర్కార్ అని ఢిల్లీ ఓటర్లలో మూడింట రెండు వంతుల మంది అభిప్రాయపడడం దిగ్భ్రాంతికరమైన విషయం. ఆప్‌కు ఓటు వేసిన ఢిల్లీ ఓటర్లలో చాలా మంది ఆ పార్టీని అంతగా ఇష్టపడడం లేదన్నది కూడా నిరాకరించలేని వాస్తవం. ఆప్‌కు ఒక గట్టి ప్రత్యామ్నాయం ఉన్నా, బీజేపీ తరపున విశ్వసనీయమైన ముఖ్యమంత్రి అభ్యర్థి ఉన్నా లేదా కాంగ్రెస్ ఒక గెలుపు గుర్రంగా కనిపించినా ఈ ప్రజాభిప్రాయసేకరణలో ఆప్ పట్ల మరింత వ్యతిరేకత వ్యక్తమై ఉండేది.

అవును, ఈ ఎన్నికల పరాజయం ఆప్‌కు పూర్తిగా యుక్తమైనదే. అయితే అందుకు సంతోషించవలసింది ఏమీ లేదు. నిజానికి రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం మన దేశంలో సుస్థిరంగా వర్ధిల్లాలని కోరుకుంటున్న వారు ఆప్ ఓటమిలోని అపశకునాలకు ఆందోళన చెందాలి, మన గణతంత్ర రాజ్య భవిష్యత్తు గురించి శ్రద్ధతో ఆలోచించాలి. ఆప్ ఓటమికి నేను చింతిస్తున్నాను – ఆ పార్టీకి నేను అభిమానిని అయినందువల్ల కాదు. రాజకీయాలలో మౌలిక పరివర్తన సాధించేందుకు ప్రభవించిన పార్టీ అది. ఆవిర్భవించిన మొదటి రెండు సంవత్సరాలలోనే ప్రజామోదం సంపూర్ణంగా పొందిన పార్టీ అది. ఆ పార్టీ అధినేత వ్యక్తిపూజను ప్రోత్సహించాడు, సకల అధికారాలనూ తన చేతుల్లో కేంద్రీకరించుకున్నాడని నిక్కచ్చిగా చెప్పక తప్పదు. ఇక ఆయన సన్నిహితులు, ఆంతరంగికులు నిగూఢ రాజకీయాలు చేశారు, రెండు నాల్కలతో మాట్లాడారు, సాధారణ పార్టీ కార్యకర్తను లక్ష్యపెట్టలేదు. ఏతా వాతా ఏ పార్టీలనయితే అధికారం నుంచి, జాతి రాజకీయ జీవితం నుంచి తొలగించేందుకు పుట్టిందో ఆ ప్రధాన స్రవంతి రాజకీయ పక్షాల కంటే ఆప్ భిన్నమైనది కాదని రుజువయింది. మీడియాలో ముఖ్యమంత్రి నివాసం 'శీష్ మహల్' గురించి అతిశయోక్తులతో ఉధృత ప్రచారం జరిగింది. పార్టీ నాయకులు పదే పదే మాట్లాడిన గాంధేయ ఆదర్శాలకు విరుద్ధంగా వారి జీవన శైలి ఉన్నందునే మీడియా నిశిత విమర్శలు అనివార్యమయ్యాయి. మద్యం కుంభకోణంలో ఆప్ నాయకులకు న్యాయస్థానాలు ఎటువంటి శిక్ష విధించని మాట నిజమే. అసలు వారు ఆ అవినీతికి పాల్పడినట్లు న్యాయసమ్మతమైన రుజువులు లభించకపోవచ్చు. అయినా మద్యం కుంభకోణం మిథ్య కాదు. ఆప్‌కూ నైతిక విలువలు లేవనే కఠోర వాస్తవాన్ని ప్రజలకు అది స్పష్టం చేసింది.

ఆప్ ఓటమికి నేను కలత చెందుతున్నాను. 'ఢిల్లీ నమూనా' ఆదర్శప్రాయమైనదని విశ్వసించడం వల్ల కానే కాదు. ఆప్ సర్కార్ ప్రభుత్వ విద్యారంగానికి రాజకీయ ప్రఖ్యాతి తీసుకువచ్చింది. ప్రభుత్వ బడులలో సదుపాయాలను మెరుగుపరిచింది. మరి నాణ్యమైన విద్య ఢిల్లీ బాలలకు అందినదా అనే విషయం పూర్తిగా చర్చనీయాంశమే. మొహల్లా క్లినిక్‌లు ఒక మంచి ఆలోచన. అయితే వాటిని అమలుపరిచిన తీరు ఆరోగ్య సాధకంగా లేదు. ఉచిత విద్యుత్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం మొదలైనవి పేదల సంక్షేమం పట్ల ఆప్ రాజకీయ సంకల్పానికి అద్దం పడుతున్నాయి. అయితే అందుకు ఖర్చు చేసిన నిధులను ప్రజల జీవన స్థితిగతుల మెరుగుదలకు దోహదం చేసే దీర్ఘకాలిక సంస్థాగత మెరుగుదలకు వినియోగించి ఉండవలసింది. పట్టణ ప్రాంతాల మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఢిల్లీ నమూనా చేసిన దోహదం పెద్దగా ఏమీ లేదు. వ్యర్థ పదార్థాల నిర్వహణపై శ్రద్ధ చూపలేదు. నీటి, వాయు కాలుష్యాలను సమర్థంగా నిరోధించలేదు. కొన్ని రంగాలలో పరిస్థితులు పాక్షికంగా మెరుగుపడినా ఆ మెరుగుదల ఏ విధంగానూ ఆదర్శ నమూనా కానేకాదు.

ఢిల్లీ నగర–రాజ్య విధానాలు, రాజకీయాలలో నిరుపేదల రాజకీయ ప్రాధాన్యాన్ని తుడిచివేసేందుకు ఆప్ ఓటమి నాంది అవుతుందని నేను అమితంగా వ్యాకులత చెందుతున్నాను. ఆప్ ప్రభుత్వం ఎన్ని పరిమితులతో అయినప్పటికీ నగరంలో అనధికారికంగా నివసించక తప్పని పరిస్థితులలో కునారిల్లుతున్న ఢిల్లీ వాలాలలో చాలా మందికి రక్షణ కల్పించింది. పేదలు, కొత్తగా నగరానికి వలసవచ్చిన అభాగ్యులు, దళితుల సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన బీజేపీ అజెండా ఢిల్లీని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నగరంగా అభివృద్ధిపరచడం. యమునానది తీర ప్రాంతాల అభివృద్ధి, సుందరీకరణ మొదలైనవి ఆ అజెండాలో ఉన్నాయి. ఇవన్నీ ఢిల్లీ జనాభాలో మెజారిటీగా ఉన్న పేదలు, నిరుపేదలు నగరంలో లేకుండా చేసేందుకు దారితీస్తాయి.

దేశ రాజకీయాలలో ఎటువంటి మినహాయింపులేని సంపూర్ణ ప్రాబల్యాన్ని నెలకొల్పుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చుకోవడంలో బీజేపీ మరో అడుగు ముందుకు వేసేందుకు ఢిల్లీ ఎన్నికలలో విజయం తోడ్పడుతుందని నేను ఆందోళన చెందుతున్నాను. ఎన్నికల సంఘం బీజేపీ పక్షపాతిగా వ్యవహరించడాన్ని, అన్ని పక్షాలకు సమ అవకాశాలు కల్పించకపోవడాన్ని ఎవరూ ప్రశ్నించడానికి ఆస్కారం లేకుండా పోతుంది. మరీ ముఖ్యంగా ఆప్ ఓటమితో ప్రత్యామ్నాయ రాజకీయాలకు అవకాశం లేకుండా పోతుందని, అటువంటి ప్రయత్నాలు చేసే శక్తులకు తీవ్ర విఘాతం కలుగుతుందని నేను భయపడుతున్నాను. ఈ విషయమై మీరూ ఆందోళన చెందాలి.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

జాతిరత్నం సంజీవయ్య

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య. రాష్ట్ర ముఖ్యమంత్రి కారు.. ఓ మారుమూల పల్లెలో పొలం గట్ల మీద నుంచి వెడుతోంది. ఆ పక్కనే నెత్తిన గడ్డిమోపుతో ఒక వృద్ధురాలు నడుచుకుంటూ పోతున్నది. ఒక్కసారిగా ఆ రాష్ట్రాధినేత చూపు ఆమెపై పడింది. తనను నవ మాసాలు మోసి ఇంతవాడిని చేసి, అతి సాధారణంగా సాగుతున్న ఆ తల్లిని గుర్తించి ముఖ్యమంత్రి కారు ఆపి ఆమెను ఎక్కమని బతిమలాడాడు. కారులో కన్నా కాలినడకే తనకు తగినదని ఆ తల్లి సున్నితంగా నిరాకరించింది. దాంతో ఆయన తాను కూడా కారు విడిచి కాలినడకనే అనుసరించాడు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య జీవితంలో వాస్తవ ఘటన ఇది. కొడుకు రాష్ట్రానికే అధినేత అయినా, సాధారణ జీవితానికి విలువనిచ్చింది ఆ తల్లి. కొడుకు ముఖ్యమంత్రిగా ఉన్నా ఆ మాతృమూర్తి వృద్ధాప్య పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడం విశేషం. ఆయన కూడా ఆ నిరాడంబరతనే పుణికి పుచ్చుకున్నాడు. అందుకే ఆ బిడ్డ జాతిరత్నంగా నిలిచిపోయాడు. పదవులకే వన్నె తెచ్చాడు.

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా, కల్లూరు మండలం, పెద్దపాడు గ్రామంలో సుంకులమ్మ, మునిదాసు దంపతులకు 1921 ఫిబ్రవరి 14న సంజీవయ్య జన్మించారు. తండ్రి మరణంతో మేనమామ ఇంట పెరిగారు. పెద్దపాడులో ఐదవ తరగతి వరకు చదువుకొని హైస్కూల్ చదువు కోసం ప్రతి రోజు కాలినడకన కర్నూలుకు వెళ్లేవారు. అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో చేరి 1942లో పట్టభద్రులయ్యారు. ఆ తర్వాత పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికై విధి నిర్వహణలో మేటిగా పేరు పొందారు. మద్రాసు వెళ్లి న్యాయశాస్త్రం అభ్యసించారు. సీనియర్ న్యాయవాదులైన గణపతి, జాస్తి సీతామహాలక్ష్మమ్మ వద్ద జూనియర్ న్యాయవాదిగా పని చేశారు. సంజీవయ్య చురుకుదనం, చొరవను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ ఆయనకు పార్టీ సభ్యత్వం ఇచ్చి రాజకీయాల్లోకి తీసుకువచ్చింది.



ముఖ్యమంత్రిగా సంజీవయ్య అనేక విప్లవాత్మక విధాన నిర్ణయాలు తీసుకున్నారు. సంక్షేమంతో ప్రజలకు చేరువయ్యారు. భూసంస్కరణలు అమలుచేసి, ఆరు లక్షల ఎకరాల బంజరు భూములను భూమిలేని వ్యవసాయ కూలీలకు పంచిపెట్టారు.

1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత ఏర్పడిన ప్రొవిన్షియల్ సభ్యునిగా నియమితులయ్యారు. ఇదే సందర్భంలో 'హోం విభాగ సభ్యుని'గా ఆయన సమర్థవంతంగా వ్యవహరించారు. 1952లో మద్రాస్ అసెంబ్లీకి కర్నూలు రిజర్వుడు నియోజకవర్గం నుండి గెలుపొంది చిన్న వయసులోనే రాజాజీ కేబినెట్‌లో మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. టంగుటూరి ప్రకాశం పంతులు మంత్రివర్గంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1954 మే 7న సికింద్రాబాద్‌కు చెందిన బుచ్చయ్య కూతురు కృష్ణవేణమ్మను కులాంతర వివాహం చేసుకొని అభ్యుదయ భావాలకు ఆనాడే బీజం వేశారు. 1955 ఆంధ్ర రాష్ట్ర మధ్యంతర ఎన్నికల్లో ఎమ్మిగనూరు–కోడుమూరు ఉమ్మడి అసెంబ్లీ నియోజకవర్గం నుండి రిజర్వుడు స్థానం నుండి దామోదరం సంజీవయ్య గెలుపొందారు. బెజవాడ గోపాల్‌రెడ్డి మంత్రివర్గంలో రవాణా, వాణిజ్య పన్నుల శాఖ మంత్రిగా పనిచేశారు. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి మంత్రివర్గ సహచరుడుగా పనిచేశారు.

1960 జనవరి 11న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే నాటికి ఆయన వయస్సు కేవలం 38 ఏళ్లు. 1962 మార్చి 29 వరకు ఆయన పాలన కొనసాగింది. ముఖ్యమంత్రిగా సంజీవయ్య అనేక విప్లవాత్మక విధాన నిర్ణయాలు తీసుకున్నారు. సంక్షేమంతో ప్రజలకు చేరువయ్యారు. భూసంస్కరణలు అమలుచేసి, ఆరు లక్షల ఎకరాల బంజరు భూములను భూమిలేని వ్యవసాయ కూలీలకు పంచిపెట్టారు. ఉత్తరాంధ్ర ప్రజల కోసం శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టుకు, కర్నూలు జిల్లాలో గాజులదిన్నె ప్రాజెక్టుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు పేరు నేడు 'సంజీవయ్య సాగర్'గా ప్రసిద్ధికెక్కింది. గుంటూరు జిల్లా పులిచింతల ప్రాజెక్టుకు మొదటి శంకుస్థాపన చేసింది సంజీవయ్యే.

ప్రాజెక్టుల స్థాపనే కాకుండా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. సబ్బండ వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లను అమలుపరిచారు. రిజర్వేషన్ల శాతాన్ని ఎస్సీ, ఎస్టీలకు 14 నుంచి 17 శాతానికి, బలహీన వర్గాలకు 24 నుంచి 38 శాతానికి పెంచారు. వృద్ధాప్య పించన్లు, కార్మికులకు బోనస్ ఇచ్చే పద్ధతికి శ్రీకారం చుట్టారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలని ఉత్తర్వులు జారీ చేశారు. 'లా' కమిషన్‌ను, లిడ్ క్యాప్, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్, భూగర్భ గనుల సంస్థలను నెలకొల్పారు. ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధికి చేయూతనిచ్చే ప్రత్యేక ఆర్థిక సహకార సంస్థలను ఏర్పాటు చేశారు. దళిత విద్యార్థులకు ఉపకార వేతనాలను, నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేశారు.

సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో, ఆయనంటే గిట్టనివారు ప్రధాని నెహ్రూకి అనేక ఫిర్యాదులు చేశారు. నిజానిజాలను తేల్చేందుకు నెహ్రూ అప్పటి హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పర్మార్‌ను పంపిచారు. పర్మార్‌తో పాటు (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్‌గా పనిచేసిన) చక్రపాణి కూడా సంజీవయ్య స్వగ్రామం పెద్దపాడును సందర్శించారు. వారు ప్రయాణిస్తున్న కారు ఓ పూరింటి ముందు ఆగింది. దాన్ని చూసి ఇక్కడెందుకు ఆపారు, మనం వెళ్లాల్సింది సంజీవయ్య ఇంటికి కదా! అని పర్మార్ అడిగారట. అప్పుడు చక్రపాణి ఇదే సంజీవయ్య ఇల్లు అని చెప్పడంతో పర్మార్ ఆశ్చర్యపోయారు. ఇంట్లోకి వెళ్లి చూస్తే వృద్ధురాలయిన సంజీవయ్య తల్లి సుంకులమ్మ చిరిగిన ముతక గుడ్డలతో కట్టె పొయ్యి దగ్గర వంట చేస్తూ కనిపించారు. ఈ దృశ్యం చూసి పర్మార్ చలించిపోయి వెంటనే తిరుగు ప్రయాణమయ్యారట. ఇది సంజీవయ్య నిజాయితీకి నిలువుటద్దం.

సంజీవయ్య 1972 మే 7న అనారోగ్యంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ అధికార నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. సంపద లేకుండా 'సంతతి' లేకుండా జీవించిన అతి కొద్ది మంది రాజకీయవేత్తలలో సంజీవయ్య ఒకరు.

■ కదిరికోట ఆదెన్న
దళిత రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యులు

(రేపు దామోదరం సంజీవయ్య జయంతి)

కార్పొరేట్ల సేవకే అభివృద్ధి మంత్రం

ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్ నుంచి విశాఖపట్నం సముద్రతీరంలోని గంగవరం పోర్టు వరకు 464 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ రహదారిని కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్నది. ఇది ఆరులైన్ల విశాలమైన రహదారి. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన విస్తారమైన అటవీ ప్రాంతమే దండకారణ్యంగా ప్రసిద్ధి. ఈ అడవిలో అపారమైన ప్రకృతి సంపద ఉంది. ఒక్క వృక్ష సంపదే లక్షల కోట్ల విలువ చేస్తుంది. ఈ అరణ్యంలో 26 రకాల విలువైన ఖనిజ సంపద ఉంది.

ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే 31 శాతం ఖనిజ సంపద, అటవీ సంపద ప్రభుత్వాలకు లక్షల కోట్ల ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. ఈ సంపదను రాజకీయ నాయకులు, అధికారులు, కార్పొరేట్ కంపెనీలు, సామ్రాజ్యవాద శక్తులు నిలువుదోపిడీ చేస్తున్నాయి. అదానీ, అంబానీలకు ఈ సంపద అప్పనంగా దోచిపెట్టి, విదేశాలకు తరలించడం ద్వారా వారి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించే కుట్రలో భాగంగా జరుగుతున్న తంతు ఇది. దండకారణ్యానికి అతి సమీపంలో ఉన్నది గంగవరం పోర్టు. ఇక్కడ సముద్రం లోతు ఎక్కువ. విదేశీ భారీ నౌకల సంచారానికి చాలా అనువైన పోర్టు.

కార్పొరేట్ల ప్రయోజనాలకే దండకారణ్య ప్రాంతాన్ని సైనికీకరణ, ప్రైవేటీకరణకు కేంద్రం కృషి చేస్తున్నది. దండకారణ్య ప్రాంతం దేశంలో నక్సలైట్ ఉద్యమానికి కేంద్ర స్థానంలో ఉంది. వీరికి ఇక్కడి గిరిజనులలో మంచి ఆదరణ, ప్రోత్సాహం ఉంది. దీనివల్ల అటవీ ప్రాంతం నుంచి ప్రకృతి సంపదను తరలించాలన్నా, గనులను కొల్లగొట్టాలన్నా, వృక్ష సంపదను అనుభవించాలన్నా కార్పొరేట్ వర్గాలకు స్థానికుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతున్నది. దీంతో నక్సలైట్లను నిర్మూలించడం ద్వారా గిరిజన ప్రతిఘటనోద్యమాన్ని బలహీనపరచాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. అందుకే 2026 నాటికి దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పదే పదే ప్రకటిస్తున్నారు. ఇందుకోసం దండకారణ్యంలో వేలాది సైనికులు, కోబ్రా తదితర దళాలు వినియోగిస్తూ నక్సలైట్ ఉద్యమకారులను అంతం చేయాలని ప్రయత్నిస్తున్నారు. అమాయకులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారు. వేలాది పోలీసు బలగాల సంరక్షణలో రోడ్డు నిర్మాణం కొనసాగిస్తున్నారు. అపార సంపదలకు నిలయమైన ఈ ప్రాంతం నుంచి గిరిజనులను గెంటి వేసి ఈ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలో భాగమే మావోయిస్టుల నిర్మూలన ఆలోచన.

అభివృద్ధి మంత్రంతో జరుగుతున్న ఈ దోపిడి చర్యలను ప్రజలు గ్రహించి, అసంబద్ధ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి. ప్రకృతి ప్రసాదించిన విలువైన సంపదను భవిష్యత్ తరాల కోసం కాపాడుకోవాలి.

– చలసాని వెంకటరామారావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

రైతు మనుగడకు ముంచుకొస్తున్న మరో ముప్పు

ప్రపంచమంతా కరోనా విజృంభణతో లాక్‌డౌన్‌లో ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం 2020, జూన్‌లో వ్యవసాయ రంగానికి సంబంధించిన మూడు ఆర్డినెన్సులను తీసుకువచ్చి, ఆ తరువాత వాటిని చట్టాలుగా మార్చడం తెలిసిన విషయమే. ఈ మూడు చట్టాలను భారత రైతాంగం పూర్తిగా వ్యతిరేకించి, చరిత్రలో కనీవిని ఎరుగని విధంగా దాదాపు 15 మాసాలు దేశ రాజధానిలో చేసిన దీక్షలు, ధర్నాల ఫలితంగా... చివరికి దేశ ప్రధాని రైతాంగానికి క్షమాపణ చెప్తూ ఈ మూడు చట్టాలను ఉపసంహరించుకున్నారు. ఆ సమయంలో ఆయన రైతాంగానికి కొన్ని నిర్దిష్టమైన హామీలను ఇచ్చారు. అందులో ముఖ్యమైనది కనీస మద్దతు ధరకి చట్టబద్ధత కల్పించడం. ఈ హామీ నేటికీ అమలు చేయకపోవడంతో భారత రైతాంగం తిరిగి పోరాట బాట పట్టింది. రైతాంగం నుంచి ఇంత వ్యతిరేకతతో కూడిన పోరాటాలు కొనసాగుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. పైగా జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఎన్‌పిఎఫ్ఎఎం) ముసాయిదా రూపంలో మళ్లీ రద్దు చేసిన నల్ల చట్టాలలోని కొన్ని అంశాలను రైతులపై రుద్దే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం.

2024, నవంబర్ 24న భారత ప్రభుత్వం జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఎన్‌పిఎఫ్ఎఎం) ముసాయిదాను విడుదల చేసి, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను కోరింది. ఈ ముసాయిదాలోని కొన్ని అంశాలను క్షుణ్ణంగా విశ్లేషిస్తే, గతంలో రద్దయిన మూడు నల్ల చట్టాలలో రెండిటిని తిరిగి ఈ కొత్త మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దనున్నట్లు తెలుస్తుంది. భారత ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఈ విధానంపై రైతులు, రాష్ట్రాలు, నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇది రైతుల కోసం కాకుండా, పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించబడిన విధానమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ముసాయిదాలో ఉన్న రైతు వ్యతిరేక అంశాలు ఏమిటో చూద్దాం.

జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ద్వారా కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పి) చట్టబద్ధ హామీ ఇవ్వడంలో స్పష్టత లేకపోవడం రైతుల భద్రతకు ప్రధాన అడ్డంకిగా మారింది. అంతేకాక రైతుల ఆదాయ భద్రతపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఎంఎస్‌పి రక్షణ లేకుండా రైతులు మార్కెట్‌లో ఉన్న అనిశ్చిత పరిస్థితులను అధిగమించడం చాలా కష్టం. ఇది చిన్న రైతులను ఇంకా అస్థిరతలోకి నెట్టివేస్తుంది. అంతేకాక, ఈ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను పక్కన పెట్టి, వ్యవసాయ మార్కెటింగ్‌ను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రస్తుత వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వాల కీలక పాత్రను ఈ విధానం పూర్తిగా దెబ్బతీస్తుంది. ముఖ్యంగా, అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీస్ (ఎపిఎంసీ) వ్యవస్థను బలహీనపరచడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పక్షాన న్యాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పేర్కొన్నాయి.

మరొక ముఖ్యమైన అంశం ఏమంటే, ఈ విధానం ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో అధిక ప్రాధాన్యత పొందే అవకాశం ఉంది. కాంట్రాక్ట్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తుంది. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయంపై పట్టు కోల్పోయి, కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఈ విధానం రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓ) ప్రధాన భాగస్వాములుగా చూపబడుతున్నప్పటికీ, కార్పొరేట్ సంస్థల కేంద్రీకృత నియంత్రణకు దోహదపడుతుంది. తద్వారా చిన్న రైతుల మనుగడ ప్రశ్నార్థకంగా మారి, వాళ్ళు మార్కెట్‌లో బలహీనపడే ప్రమాదం పొంచివుంది. ఈ విధానంలో ఉన్న గిడ్డంగుల ప్రైవేటీకరణ ద్వారా, రైతులు తమ ఉత్పత్తులను సకాలంలో నిల్వ చేసుకునే అవకాశాలను కోల్పోతారు. ధరల అస్థిరతలో రైతులకు భద్రత ఇవ్వాల్సిన పద్ధతులు పూర్తిగా ప్రైవేట్ కంపెనీల నియంత్రణలోకి వెళ్లడం వల్ల, రైతులు తమ ఉత్పత్తులకు సరైన ధరలు పొందలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విధానంలో మార్కెట్ నియంత్రణలను తొలగించడం ద్వారా, పెద్ద సంస్థలు మార్కెట్‌ను పూర్తిగా ఆధీనంలోకి తీసుకోవడమే కాకుండా, రైతులపై ఆర్థిక ఒత్తిడి పెంచే పరిస్థితిని సృష్టిస్తోంది. ముఖ్యంగా వ్యాపారులు అనైతిక వర్తక సంఘాలుగా ఏర్పడి, రైతుల ఉత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చేయడం, తద్వారా అధిక లాభాలను పొందడం లాంటివి జరిగే ప్రమాదం ఉంది.

జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానంలోని ఇలాంటి ప్రమాదకర అంశాల వల్ల రైతుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లే అవకాశం ఉంది. చిన్న రైతులు వ్యవసాయం నుంచి వైదొలగాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చు. వారు తమ పంటలకు సరైన ధర పొందడంలో ఇంకా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మరోవైపు, మార్కెటింగ్ వ్యవస్థలో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం మరింత పెరగడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అసమానతలను పెంచే అవకాశముంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న వ్యవసాయ మార్కెట్ వ్యవస్థకి సంబంధించిన అంశాలపైన కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇలాంటి విధానాలు తీసుకురావటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. గతంలో ఎపిఎంసీ చట్టం–2002 సవరణ చేయవలసి వచ్చినప్పుడు ఆనాటి కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల నుంచి శాసనసభ తీర్మానాలు తీసుకున్న తరువాత అమలులోకి తెచ్చేది. అలాంటి సంప్రదాయాలను నేటి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.


భారత రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి. దీని స్థానంలో రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని రైతు సంఘాలు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తీసుకురావాల్సిన అవసరం ఉన్నది. ఈ సమగ్ర విధానాలలో భాగంగా, కనీస మద్దతు ధరకు చట్టబద్ధతని కల్పించటం, మద్దతు ధర లెక్కింపులో డా. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సు చేసినట్టుగా కాస్ట్–3 పైన 50శాతం మద్దతు ధరను ప్రకటించడం, ప్రస్తుతం ఉన్న ఎపిఎంసీలలో ఆధునిక సదుపాయాలు కల్పించి బలోపేతం చేయడం, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న గిడ్డంగులను ఆధునీకరించడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం, ఎఫ్‌పిఓలను బలోపేతం చేయడం, మార్కెట్ రిస్క్ నుంచి రైతులను కాపాడడం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఈ కొత్త వ్యవసాయ మార్కెటింగ్ విధానం రైతుల హక్కులకు ముప్పుగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం సరైన మార్పులు చేసి, ఈ విధానాన్ని సమతుల్యం చేయాలి. రైతులు భవిష్యత్తులో బలహీనం కాకుండా, వారు తమ హక్కులను సాధించేందుకు అది సమర్థంగా ఉండాలి.

భారత రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి. దీని స్థానంలో రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని రైతు సంఘాలు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తీసుకురావాలి.



• ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
వ్యవసాయ ఆర్థికవేత్త





కలర్‌ఫుల్

కొన్ని అనుభూతులను మాటల్లో వర్ణించడం సాధ్యంకాదేమో. చాలా సందర్భాల్లో ఏ భాషలోనూ మాటలు కూడా దొరకవు. అలాంటి మాటలకందని ఆనందానుభూతులు కుంచె గీసిన చిత్రాలను చూస్తే కలుగుతుంది. మనసును కాన్వాస్‌గా చేసుకుని సాధారణ జనజీవనంలోని సన్నివేశాలను గోడపై మలచుకుని, అందమైన చిత్రాలను గీయడం ఇలాంటి చిన్నచిన్న కళాకారులకు వెన్నతో పెట్టిన విద్య. పల్లె ప్రజల జీవనచిత్రాన్ని నగరవాసుల ముందుంచడం కోసం, మోడరన్ ఆర్ట్ మోజులో కొట్టుకుపోతున్న నేటితరానికి సంప్రదాయ చిత్రాలను పరిచయం చేయడం కోసం పూట కూడా గడవని ఈ కళాకారులు చేస్తున్న ప్రయత్నం అభినందనీయం కదూ. (బందరు రోడ్డులోని ఆకాశవాణి వద్ద రోడ్డుసైడ్ గోడలకు పెయింటింగ్ వేస్తున్న కళాకారుడు)

పట్టుబడ్డారు

దుర్గమ్మ మూలవిరాట్ పట్టు వస్త్రాల్లో అవినీతి

టెండర్ సమయంలో నాణ్యత కలిగిన శాంపిళ్లు

- సరఫరా చేస్తున్నది మాత్రం నాణ్యతలేనివి
- రూ.5,900 ధోవతి స్థానే రూ.450 ధోవతి
- రూ.6 వేల చీర స్థానే రూ.1,000 చీర
- విచారణలో బయటపడిన నిజాలు
- జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్



రూ.5,900 ధర కలిగిన ధోవతి స్థానే కేవలం రూ.450 నుంచి రూ.600 విలువైన ధోవతి.. రూ.6 వేల విలువైన చీర స్థానే కేవలం రూ.1,000 చీర.. సాక్షాత్తూ జగన్మాత సన్నిధిలో అక్రమార్కులు ఆడిన పాపకార్యమిది. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు నిత్యం అలంకరించే పట్టుచీరల సరఫరాకు నిర్వహించిన టెండర్ల కిరికిరిలో నిజాలు ఇప్పటికి బయటపడ్డాయి. ఈ పాపంలో భాగస్వామి అయిన జూనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరెడ్డిని బుధవారం సస్పెండ్ చేశారు.

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అమ్మవారి మూలవిరాట్‌కు రోజూ ఏడు చీరలు అలంకరిస్తారు. వాటిని సరఫరా చేయటానికి గతంలో టెండర్లు ఆహ్వానించారు. 2024, ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు చీరలు సరఫరా చేయాలని పిలిచిన టెండర్లలో క్రోసూరుకు చెందిన శ్రీసాయి మణికంఠ ఏజెన్సీస్ 17 రకాలు, నగరంలోని బాలకృష్ణ శిల్క్స్ ఏడు రకాలు, కడపలోని నాగార్జున టెక్స్‌టైల్స్‌కు టెండర్లు దక్కాయి. వీరే టెండర్ ధర తక్కువ కోట్ చేయటంతో చీరల సరఫరాకు అధికారులు ఆమోదం తెలిపారు. ఈ క్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి.. టెండర్‌దారులు సరఫరా చేస్తున్న వస్త్రాలు నాణ్యతగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. జూనియర్ గుమాస్తా కె.శ్రీనివాసరెడ్డి వద్ద టెండర్‌దారులు మొదట్లో సమర్పించిన వస్త్రాల శాంపిళ్లను, గోడౌన్‌లో ఉన్న వస్త్రాలను పోల్చి చూడగా భారీ వ్యత్యాసం కనిపించింది. గుమాస్తా దగ్గర ఉన్న శాంపిల్ ఒకటైతే, టెండర్‌దారులు సరఫరా చేసిన చీరలు మరోలా ఉన్నాయి. విచారణ చేయగా ధరల్లో కూడా వ్యత్యాసం కనిపించింది. చీరల వెరిఫికేషన్ నిమిత్తం నియమించిన కమిటీ కూడా ఇదే నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం రూ.5,900 ధర కలిగిన ధోవతి స్థానే కేవలం రూ.450 నుంచి రూ.600 విలువైన వస్త్రాలనే సరఫరా చేశారు. రూ.6 వేల విలువైన వస్త్రం స్థానే కేవలం రూ.1,000 చీర సరఫరా చేశారు. దీంతో దేవస్థానం అధికారులు.. జూనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరెడ్డిపై చర్యలకు ఆదేశించారు. పలు సెక్షన్ల కింద క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నోటీసు ఇచ్చారు. ఏడు రోజుల్లోపు సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. అప్పటివరకు హెడ్ క్వార్టర్ విడిచి వెళ్లరాదని పేర్కొంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వస్త్రసేవ కార్యక్రమంలో భక్తులు ఇచ్చిన చీరలను సరిగ్గా జమ చేయకుండా ఉండటంతో పాటు చీరల సంఖ్యలో కూడా తేడా రావటంతో ఈ సస్పెన్షన్ వేటు వేశారు. ప్రాథమికంగా రుజువులు దొరకటంతో అతనిపై చర్యలకు ఈవో ఆదేశాలు జారీ చేశారు. విధులను సీనియర్ అసిస్టెంట్ పి.శిరీషకు అప్పగించారు.

ఆదాయం కోసం ఆరాటం..!

ప్రమాదకరంగా ఎగ్జిబిషన్ల నిర్వహణ

అనుమతులు లేకపోయినా ఇష్టానుసారంగా..

- ఏడాది కిందట భవానీపురంలోని బబ్బూరి గ్రౌండ్స్‌లో ఓ ఎగ్జిబిషన్ జరిగింది. కృష్ణలంకకు చెందిన యువకుడు ఆ ఎగ్జిబిషన్‌కు వెళ్లి జైంట్‌వీల్ ఎక్కాడు. దానికి సమీపంలో ఎలాంటి రక్షణ లేకుండా విద్యుత్ తీగను వదిలేశారు. దీన్ని ఆ యువకుడు తాకడంతో అక్కడికక్కడే చనిపోయాడు.
- ప్రస్తుతం విద్యాధరపురంలోని గ్రౌండ్‌లో కశ్మీర్ జలకన్యల ఎగ్జిబిషన్ జరుగుతోంది. దీనికి అనుమతి గడువు ముగిసింది. ఆ తర్వాత పొడిగించలేదు కూడా. అయినా ఎగ్జిబిషన్ మాత్రం నడుపుతున్నారు. ఓ షాపులో రేగిన మంటలు ఎగ్జిబిషన్‌లో సగభాగాన్ని చుట్టేశాయి. స్టాళ్లు, ఆటపరికరాలు సహా సర్వం అగ్నికి ఆహుతయ్యాయి.
- ఇదే ఎగ్జిబిషన్‌లో కొద్దిరోజుల కిందట మరో ఘటన జరిగిందని తెలుస్తోంది. జైంట్‌వీల్ నుంచి పడి ఓ యువకుడు మరణించినట్టు ప్రచారం జరుగుతుండగా, పోలీసులు మాత్రం ధ్రువీకరించడం లేదు.

..ఎగ్జిబిషన్లపై లక్షలాది రూపాయల ఆదాయాన్ని రుచిమరిగిన నిర్వాహకులు భద్రతను గాలికొదిలేస్తున్నారు. లోపభూయిష్టంగా ఏర్పాట్లు చేసి షాపులను అద్దెలకిస్తున్నారు. ఇరుకిరుకు ప్రదేశాల్లో షాపులు ఏర్పాటు చేస్తున్నారు. అగ్నిప్రమాద ముందస్తు ఏర్పాట్లను పైపైనే చేసుకుంటున్నారు. అనుమతులు ఇవ్వాల్సిన శాఖల మధ్య సమన్వయలోపంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. విద్యాధరపురంలోని కశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్‌లో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో అధికారులు, నిర్వాహకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది.

- కశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్ పరిస్థితి ఇదే..
- జనవరి నెలాఖరుకే ముగిసిన గడువు
- తర్వాత అనుమతి ఇవ్వలేదన్న వీఎంసీ అధికారులు
- పోలీసుల నుంచి మాత్రం అనుమతి ఓకే..
- గ్యాస్ సిలిండర్లు పేలి 20 షాపులు దహనం
- రూ.10 లక్షల వరకూ ఆస్తినష్టం



అస్తవ్యస్తంగా ఎగ్జిబిషన్ ప్రాంగణం (ఇన్‌సెట్‌లో) మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సాధారణంగా వేసవి, దసరా, సంక్రాంతి సెలవుల సమయంలో నగరంలో ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేస్తుంటారు. కొంతమంది నిర్వాహకులు ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన ఖాళీ స్థలాలను అద్దెకు తీసుకుని వీటిని ఏర్పాటు చేస్తారు. మరికొంతమంది ప్రభుత్వ శాఖలకు చెందిన ఖాళీ స్థలాల్లో నిర్వహిస్తారు. నగరంలో ఎక్కువగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటిలో ఎగ్జిబిషన్లను నిర్వహించడానికి నగరపాలక సంస్థకు దరఖాస్తులు చేసుకుంటారు. ఖజానాకు ఆదాయం చేకూరుతుందన్న ఆలోచనలో వీఎంసీ ఈ స్థలాలను అద్దెకిస్తుంది. ఈ స్థలాల్లో ఎగ్జిబిషన్ నిర్వహించాలంటే ముందుగా అందులోని ఎస్టేట్ విభాగానికి దరఖాస్తు చేసుకోవాలి. దీంతో పాటు వీఎంసీకి అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. ఈ రెండు అనుమతులు తీసుకున్నాక పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలి. ప్రైవేట్ స్థలంలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినా, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్థలాల్లో నిర్వహించినా ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. విద్యాధరపురంలోని కార్మికశాఖకు చెందిన స్థలంలో ప్రభాకర్ అనే వ్యక్తి కశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్‌ను జనవరిలో ఏర్పాటు చేశాడు. మూడు నెలల పాటు అద్దెకు తీసుకున్నాడు. కానీ, జనవరి 2 నుంచి నెలాఖరు వరకు మాత్రమే అనుమతి లభించింది. ఈ ఎగ్జిబిషన్‌లో జైంట్‌వీల్‌తో పాటు వివిధ రకాల వినోద యంత్రాలను ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ మిగతా 6లో..



ప్రమాదం జరిగింది ఇలా..

బుధవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో కశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్‌లో ఓ స్టాల్‌లో సిబ్బంది వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలింది. ఆ గ్యాస్ సిలిండర్ భాగాలు భారీ శబ్దాలతో ఎదురుగా ఉన్న స్టాళ్లలో పడ్డాయి. ఆ స్టాల్‌లో ఉన్న సిలిండర్లు కూడా పేలటంతో ఇరువైపులా ఉన్న స్టాళ్లకు మంటలు అంటుకున్నాయి. దట్టంగా పొగలు వ్యాపించడంతో పాటు మంటలు ఎగసిపడ్డాయి. ఫైర్ అధికారులు, సిబ్బంది నాలుగు అగ్నిమాపక వాహనాలతో ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అప్పటికే సుమారు 20 దుకాణాలకు మంటలు అంటుకున్నాయి. సుమారు రెండున్నర గంటల పాటు కష్టపడి మంటలు ఆర్పారు. ఈ ఘటనలో సుమారు 20 స్టాళ్లు పూర్తిగా కాలిపోయాయని, రూ.10 లక్షల వరకు నష్టం జరిగి ఉండవచ్చని భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.



గంపలగూడెంలో మృతిచెందిన కోళ్ల నమూనాలు సేకరిస్తున్న వైద్యులు

బర్డ్‌ఫ్లూ కలవరం

గంపలగూడెం కేంద్రంగా కలకలం

మూడు రోజుల్లో 13 వేల కోళ్లు మృతి

ఏపీ, తెలంగాణ సరిహద్దులో కోళ్ల రవాణా నిలిపివేత

- శాంపిళ్ల సేకరణ.. పరీక్షల కోసం భోపాల్‌కు..
- పశు సంవర్ధకశాఖ నుంచి టీమ్‌ల ఏర్పాటు

గంపలగూడెం/జి.కొండూరు/జగ్గయ్యపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గంపలగూడెం కేంద్రంగా బర్డ్‌ఫ్లూ పంజా విప్పింది. మూడు రోజుల వ్యవధిలో 13 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో ఏపీ-తెలంగాణ సరిహద్దు నుంచి ఎన్టీఆర్ జిల్లాలోకి కోళ్ల రవాణాను నిలిపివేశారు. అయితే, ఇది బర్డ్ ఫ్లూనా, మరేదైనానా అని తెలుసుకునేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు శాంపిళ్లను సేకరించి భోపాల్‌కు పంపారు.

రెడ్‌జోన్, ఎఫిక్ జోన్ ఏర్పాటు

ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, డిప్యూటీ జేడీ రమేశ్ బుధవారం కోళ్లు మృతిచెందిన పౌల్ట్రీని పరిశీలించారు. గోదావరి జిల్లాలతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోనూ ఈ వైరస్ ఉందని, ప్రస్తుతం కోళ్ల నమూనాలు సేకరించి భోపాల్‌లోని వ్యాధి నిర్ధారణ కేంద్రానికి పంపుతున్నామన్నారు. పరీక్షల అనంతరమే ఏ విషయం చెబుతామన్నారు. అప్పటి వరకు సదరు బాలాజీ పౌల్ట్రీ ఫారాన్ని సీజ్ చేస్తున్నట్లు చెప్పారు. సాధారణంగా హెచ్5ఎన్1ల వద్ద 38 డిగ్రీల సీ వద్దకు వైరస్ చేరితేనే కోళ్లు చనిపోతాయని, ఘటన జరిగిన ఫారానికి కిలోమీటర్ వరకు రెడ్‌జోన్, 9 కిలోమీటర్ల వరకు ఎఫిక్ జోన్ ప్రకటించామన్నారు. కోళ్లు మృతిచెందిన ఫారానికి కిలోమీటర్ దూరంలో ఉన్న చికెన్ దుకాణాల్లో విక్రయాలు నిలిపివేయాలని, 9 కిలోమీటర్ల పరిధిలోని దుకాణాల్లో కోడిమాంసం, గుడ్లను మిగతా 6లో..

ఫిర్యాదుల్లో అగ్రస్థానం

సీఎంవో ఫిర్యాదుల్లో ఎన్టీఆర్ జిల్లాకు రెండో స్థానం

- సీఎంవో గ్రీవెన్స్‌కు మొదటిస్థానం
- 12వ స్థానంలో నిలిచిన కృష్ణాజిల్లా
- రెవెన్యూ తప్పులు, మ్యూటేషన్, భూవివాదాలే అధికం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ముఖ్యమంత్రి కార్యాలయానికి వస్తున్న ప్రజా ఫిర్యాదుల్లో ఎన్టీఆర్ జిల్లా రెండోస్థానంలో నిలిచింది. సెక్రటేరియట్స్/హెచ్‌వోడీ కార్యాలయాల పరిధిలో వచ్చే సీఎంవో గ్రీవెన్స్ మొదటి స్థానంలో నిలిచింది. ఇక జిల్లాల పరంగా ఎన్టీఆర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 2024, జూన్ 15 నుంచి 2025, ఫిబ్రవరి 6 వరకు ఎన్టీఆర్ జిల్లా నుంచి మొత్తం 2008 ఫిర్యాదులు అందాయి. ఇక కృష్ణాజిల్లా 12వ స్థానంలో ఉంది. కృష్ణాజిల్లా నుంచి 592 ఫిర్యాదులు అందాయి. ముఖ్యమంత్రి కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదుల్లో ఎక్కువగా రెవెన్యూ అర్జీలు ఉండగా, ఆ తర్వాత స్థానంలో ప్రకృతి విపత్తులు, భూ వివాదాలు, రెవెన్యూ, పోలీసు ఫిర్యాదులు ఉంటున్నాయి. ఆగస్టులో సంభవించిన బుడమేరు వరదల కారణంగా విపత్తు సాయం కింద ఎక్కువ దరఖాస్తులు అందినట్టుగా తెలుస్తోంది. వీటితో పాటు భూ వివాదాలు, పోలీసు సహాయం కోసం ఫిర్యాదులు వచ్చినట్టుగా సమాచారం. జిల్లాలవారీగా సాధారణ గ్రీవెన్స్ విషయానికొస్తే.. పైన చెప్పుకొన్న తేదీల ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలో 24,795 అర్జీలు వచ్చాయి. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా అర్జీల సంఖ్యాపరంగా ఎన్టీఆర్ జిల్లా 12వ స్థానంలో ఉంది. కృష్ణాజిల్లా 17,310 అర్జీలతో 24వ స్థానంలో ఉంది. రెండు జిల్లాల్లో సాధారణ గ్రీవెన్స్‌లో ముఖ్యంగా రెవెన్యూ తప్పులు, సర్వే సెటిల్‌మెంట్, భూ వివాదాలు, మ్యూటేషన్ల అర్జీలే ఎక్కువ ఉంటున్నాయి.

ఏమార్చారు..!

రైతులను మోసం చేసిన ట్రాన్స్‌కో

పేరుకు హైటెన్షన్ విద్యుత్ లైన్లకు మరమ్మతులు

- గుట్టుచప్పుడు కాకుండా కొత్త లైన్ల మార్పిడి
- నున్న-గుడివాడ 220 కేవీ పవర్ లైన్స్‌లో ట్రాన్స్‌కో నిర్వాకం
- భూ యజమానులకు పరిహారం ఇవ్వాల్సి వస్తుందనే..
- ఎకరాకు రూ.9 లక్షల మేర నష్టపోయిన రైతులు
- రూ.31.68 కోట్ల మేర రైతులకు నష్టం



నున్న-గుడివాడలో జరుగుతున్న పనులు

నున్న-గుడివాడ 220 కేవీ ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ విద్యుత్ లైన్ల మార్పిడి విషయంలో రైతులకు ట్రాన్స్‌కో అధికారులు అన్యాయం చేశారు. రిపేర్లు చేస్తామని ప్రకటన ఇచ్చి.. ఏకంగా విద్యుత్ లైన్లనే మార్చేశారు. నిబంధనల ప్రకారం.. పాత లైన్ల స్థానే కొత్తవి మారిస్తే సదరు భూ యజమానులకు పరిహారం చెల్లించాలి. అయితే, ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేస్తున్నామని నమ్మబలికి, పరిహారాన్ని ఎగ్గొట్టి, ఆ సొమ్మును స్వాహా చేయడం వివాదాస్పదంగా మారింది.

విజయవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నున్న-గుడివాడ 220 కేవీ సెక్షన్‌లో ట్రాన్స్‌మిషన్ విద్యుత్ హైటెన్షన్ లైన్లపై తీవ్ర ఒత్తిడి పడుతుందన్న ఉద్దేశంతో ఆ లైన్లను అప్‌గ్రేడ్ చేయాలని ట్రాన్స్‌కో మిగతా 6లో..

రైతులు ఎంత నష్టపోయారు?

నున్న-గుడివాడ 220 కేవీ సెక్షన్‌లో 44.5 కిలోమీటర్లు ఉండగా, కిలోమీటర్‌కు 1,000 మీటర్లు కాగా, 32.1 మీటర్ల మేర వెడల్పును కూడా కలిపి లెక్కిస్తే 14,24,000 మీటర్లు అవుతుంది. ఎకరాకు 4,040 చదరపు మీటర్లు కాబట్టి.. పై విలువతో భాగిస్తే 352 ఎకరాలు అవుతుంది. అంటే.. మొత్తం 350 ఎకరాలకు సంబంధించి ట్రాన్స్‌కో అధికారులు రైతులకు పరిహారం ఎగ్గొట్టారు. నున్న నుంచి గుడివాడ వరకు చూస్తే ఎకరం ధర బుక్ వాల్యూ ప్రకారం.. రూ.25 లక్షల నుంచి రూ.1.50 కోట్ల వరకు ఉంటుంది. ఎకరం రూ.30 లక్షలే అనుకున్నా.. అందులో 30 శాతం.. అంటే ఎకరాకు ఒక్కో రైతుకు రూ.9 లక్షల మేర నష్టపరిహారం చెల్లించాలి. ఈ లెక్కన 352 ఎకరాలకు రూ.31.68 కోట్ల మేర నష్టపరిహారం ఇవ్వాల్సి ఉండగా, నయాపైసా చెల్లించలేదు.

నగరంలో ఎస్టీపీలకు రూ.16 కోట్లు

- పరిపాలన అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఐక్యరాజ్య సమితి అనుబంధం యూఎన్‌డీపీవో ఆర్థిక సహకారం రూ. 11.77 కోట్లు
- విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వాటా రూ.4.93 కోట్లు

8లో



ఘనంగా గిరి ప్రదక్షిణ

మిర్చి రైతు విలవిల!



నల్లి దాడితో కకావికలమైన మిర్చి పంట, కల్లంలో ఆరబోసిన మిరపకాయలు



ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో మిర్చి రైతును నల్లి కోలుకోలేని దెబ్బతీసింది.. దిగుబడి లేకపోగా పెట్టిన పెట్టుబడి కూడా రాలేని దుస్థితి.. మిర్చి రైతు పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయి విలవిల్లాడుతున్నారు. మార్కెట్ పరిస్థితి చూస్తే ఘోరంగా తయారైంది. కనీసం బయటపడటానికి కూడా తగిన ధర లభించటం లేదు. ఆరుగాలం కష్టపడి పంట పండించినా.. రెక్కల కష్టం తప్పితే లాభసాటి లేని పరిస్థితి. ప్రభుత్వం ఆదుకోవాలని మిర్చి రైతులు అభ్యర్థిస్తున్నారు.

- నల్లి తెగులుతో దిగుబడి ధమాల్
- మార్కెట్ పరిస్థితి చూస్తే దారుణం
- కనీస పెట్టుబడి కూడా రాని పరిస్థితి
- ఎన్టీఆర్ జిల్లాలో మిర్చి రైతు కడగండ్లు

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

మిర్చి రైతు పరిస్థితి కడుదయనీయంగా తయారైంది. చీడపీడల దెబ్బకు ఎన్టీఆర్ జిల్లాలో మిరప తోటలు కకావికలమయ్యాయి. దిగుబడి సగానికి సగం తగ్గిపోయింది. లేత తోటల్లో అయితే ఎకరానికి పది క్వింటాళ్లు రావటమే గగనమవుతోంది. మార్కెట్ కూడా గట్టి దెబ్బకొట్టింది. గతేడాది తాలు (తెల్ల) కాయలకు లభించిన ధర కూడా ప్రస్తుతం నాణ్యమైన ఎర్రకాయలకు పలకటం లేదు. కోత కూలి కూడా రావటం లేదంటే మార్కెట్ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దిగుబడి రాక, ధర లేక పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన మిర్చి రైతులు కన్నీళ్లు పెడుతున్నారు.

● ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లాలో 30 ఎకరాల్లో రైతులు మిర్చి తోటలు సాగుచేశారు. ముఖ్యంగా పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలు మిర్చి తోటలకు ప్రసిద్ధి. ఇక్కడ ఎకరం కౌలు రూ.30 వేల నుంచి రూ. 40 వేలుగా ఉంది. ఒక్కొక్క మొక్క రూ. 1.50ల వంతున కొని, ఎకరానికి 15 వేల మొక్కలు నాటారు. వ్యవసాయం, ఎరువులు, పురుగు మందులు, నీటి తడులు ఇతరత్రా ఖర్చులు కలిపి ఎకరాకు రెండు లక్షలకు పైగా పెట్టుబడి అయింది. కోత కూలి, గ్రేడింగ్‌తో కలిపి క్వింటాకు రూ. ఐదువేల నుంచి రూ. ఆరువేలు అవుతోంది.

● ఆగస్టు చివర్లో, సెప్టెంబరు మొదట్లో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు పల్లపు, లోతట్టు, వాగుల వెంబడి సాగు చేసిన తోటలు దెబ్బతిన్నాయి. మరల రైతులు ఎంతో ఆశతో తోటలు సాగుచేశారు. నవంబరు నెలవరకు తోటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇక ఆ తర్వాత ఎర్రనల్లి, నల్లనల్లి దాడి చేశాయి. పురుగు మందులు ఒకటికి నాలుగు సార్లు పిచికారి చేసినప్పటికీ నల్లి అదుపులోకి రాలేదు. నల్లి ఉధృతంగా దాడి చేయటంతో రోజుల వ్యవధిలోనే తోటలు కకావికలమయ్యాయి. పూత రాలిపోయింది. ఆకులు, పిందెలు నల్లగా మాడిపోయాయి. చిగుళ్లు సైతం వాడిపోవటంతో మిరప మొక్కలు గిడసబారి, జీవచ్ఛవాల్లా తయారయ్యాయి. వేరుకుళ్లు సోకినట్టుగా తోటలు ఎర్రబడి నిలువునా ఎండిపోతున్నాయి. దీంతో తోటల్లో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ముదురు తోటల్లో అయితే ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల లోపు దిగుబడి వస్తుండగా, లేత తోటల్లో ఐదు నుంచి పది క్వింటాళ్ల లోపు దిగుబడి మాత్రమే వస్తోంది. ఇప్పటికే ముప్పావు వంతుకు పైగా కోత పూర్తయింది. కోయాల్సింది కేవలం పావు వంతు లోపు మాత్రమే ఉంటుంది.

● ఆశించిన దిగుబడులు లేక తీవ్ర నిరుత్సాహంతో కొట్టుమిట్టాడుతున్న రైతులను మార్కెట్ చావు దెబ్బకొట్టింది. ప్రస్తుతం పలుకుతున్న ధరలు చూస్తుంటే నిలువునా మిర్చి రైతుల ఉసురు తీసేట్టుగా ఉన్నాయి. కొంతమంది వ్యాపారులు కల్లాల్లోకి వచ్చి మిర్చి కొంటున్నారు. తేజ రకానికి క్వింటా రూ. 8 వేల నుంచి రూ. 13 వేల లోపు ధర ఇస్తున్నారు. లావు రకాలకు రూ. ఎనిమిది వేలనుంచి రూ. 10 వేలలోపు, మధ్యస్థ రకాలకు అయితే రూ. పదివేల నుంచి రూ. 11 వేల లోపు ధర పలుకుతున్నది. గత ఏడాది తాలు (తెల్ల) కాయలకు వచ్చిన ధర కూడా ఇప్పుడు ఎర్ర కాయలకు రావటం లేదు. అప్పట్లో తెల్లకాయలకు రూ. పది వేల నుంచి రూ. 13 వేలు ధర పలికింది. నాణ్యత కల్గిన ఎర్ర కాయలకు ఈ ధర రావటం గగనమవుతోంది. అయితే ప్రస్తుతం తెల్లకాయలకు నామమాత్రపు ధర వస్తున్నది. వ్యాపారులు క్వింటా రూ. మూడు వేల నుంచి రూ. నాలుగు వేల లోపు కొంటున్నారు. ఈ ధరలకు కూడా మార్కెట్లో చురుకుగా కొనుగోళ్లు జరగటం లేదు. ప్రస్తుతం ధర చాలా తక్కువగా ఉండటంతో ముందు ధర పెరుగుతుందన్న ఆశతో కొంతమంది చిన్న వ్యాపారులు కాయలు కొని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు.

● మిర్చి ఘాటుకు రైతులు విలవిల్లాడుతూ కంటతడి పెడుతున్నారు. 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చినప్పటికీ గిట్టుబాటు ధర లభించనందున రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. కొంతమంది రైతులకు అయితే కోత కూలి రావటమే కష్టమవుతుందని అంటున్నారు. ఏమైనా ఈ ఏడాది ఊహించని విధంగా లక్షల్లో నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చిందని మిర్చి రైతులు వాపోతున్నారు. ఈనేపథ్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలో దెబ్బతిన్న మిర్చితోటలను ఇటీవల ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పరిశీలించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సాయమందించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీఇచ్చారు.

గిట్టుబాటు ధర లేదు

- కొమ్మినేని నరసింహారావు, రైతు



పదమూడు ఎకరాల్లో మిర్చి వేయగా, సగటున 15 క్వింటాళ్ల వంతున దిగుబడి వస్తుంది. మార్కెట్లో నెలకొన్న సంక్షోభం వల్ల గిట్టుబాటు ధర లభించటం లేదు. పరిస్థితి దారుణంగా ఉంది. గత ఏడాది పంట ఇంకా శీతల గిడ్డంగిలో ఉంది. గత్యంతరం లేక క్వింటా రూ. 11 వేలకు అమ్మాను. ఎకరానికి రూ. రెండు లక్షలకు పైగా పెట్టుబడి అయింది. నష్టం రూ. ఎనిమిది లక్షలకు పైగా ఉంటుంది. ఏం చేయాలో అర్థం కావటం లేదు.

నల్లి నిలువునా ముంచేసింది

- పద్మాల శ్రీనివాసరావు, రైతు



ఎంతో ఆశతో ఎనిమిది ఎకరాల్లో మిర్చి సాగుచేశాను. మొదట్లో బొబ్బర తెగులు సోకినప్పటికీ అదుపులోకి వచ్చింది. డిసెంబరు నెలలో నల్లి ఉధృతంగా దాడి చేయటంతో తోటలు నిలువునా దెబ్బతిన్నాయి. కోతలు పూర్తి కాలేదు. పది క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. ఎకరానికి రూ. లక్షకు పైగా నష్టం వస్తుంది. మిర్చి రైతులను ప్రభుత్వం స్పందించి ఉదారంగా ఆదుకోవాలి.

గురుకులాల్లో ప్రవేశాలకు

దరఖాస్తులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి (ఇంగ్లీషు మాధ్యమం), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ఐఐటీ మెడికల్ కోచింగ్ సెంటర్లలో ప్రవేశానికి బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లాల సమన్వయ అధికారి ఎ.మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ఐఐటీ మెడికల్ కోచింగ్ సెంటర్లకు సంబంధించి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్://ఏపీబ్రాగ్‌సెట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలి. దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 6 అని, వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన తెలిపారు. ఇతర వివరాల కోసం జిల్లాల్లోని గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

ప్రవేశ పరీక్ష తేదీ

ఏప్రిల్ 6 - 5వ తరగతి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
ఏప్రిల్ 6వ తేదీ - జూనియర్ ఇంటర్మీడియట్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు
ఏప్రిల్ 20వ తేదీ - ఐఐటీ మెడికల్ కోచింగ్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.



మహిళా పారిశ్రామికవేత్తలను సత్కరిస్తున్న జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సాంబయ్య, నాగళ్ల విద్యాఖన్నా తదితరులు

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

- జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సాంబయ్య

మొగల్రాజపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, అలాంటి ఔత్సాహికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు, రాయితీలు కల్పిస్తున్నాయని జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం బి.సాంబయ్య తెలిపారు. జన శిక్షణా సంస్థాన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా ఉత్సవ్ పారిశ్రామిక ఎగ్జిబిషన్‌లో ఐదో రోజు మహిళా పారిశ్రామిక వేత్తలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని.. దానికి పట్టుదలతో పాటు విజయం సాధించిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. మరో ముఖ్య అతిథి వాసవ్య మహిళా మండలి కార్యదర్శి రష్మి మాట్లాడుతూ, మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారని, పురుషులకు దీటుగా పేరు ప్రఖ్యాతులు సాధిస్తున్నారని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జనశిక్షణ సంస్థాన్ ఛైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా మాట్లాడుతూ, మహిళల శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి తెలిసేలా ప్రతీ ఏడాది మహిళా ఉత్సవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఔత్సాహిక మహిళలు ముందుకు వస్తే అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తామన్నారు. చిన్న టైలర్‌గా మొదలు పెట్టి శ్రేష్ఠ బోటిక్స్ పేరుతో ఒక పరిశ్రమను నెలకొల్పిన కొర్లపాటి మేరీ (కొండపల్లి), డిప్లొమా ఇన్ మెడిసిన్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదివి రవి అమెరికన్ కేన్సర్ కేర్‌లో ల్యాబ్ ఇన్‌చార్జిగా ఉద్యోగం చేస్తూ.. పండ్లు, కూరగాయలను డీహైడ్రేషన్ పద్ధతిలో పౌడర్‌లుగా మార్చుతూ శ్యామలాంబ ఫుడ్ ప్రొడక్స్ సంస్థను నడుపుతున్న కనకాల మాధురి (గుణదల), సత్య ఫ్యాషన్స్ పేరుతో అతి తక్కువ ధరలకు రెడీమేడ్ వస్త్రాలను తయారు చేస్తూ తమ లాంటి మరి కొందరికి ఉపాధిని ఇస్తూ, జనశిక్షణా సంస్థాన్‌లో శిక్షణ ఇస్తూ రాణిస్తు స్ఫూర్తిని అందిస్తున్నందుకుగాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిళా పారిశ్రామిక వేత్తలు, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.





చంద్రబాబు, లోకేశ్‌లను కలిసిన ఎంపీ, పారిశ్రామిక వేత్తలు

వన్‌టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ప్రాంతంలో స్పోర్ట్స్ సిటీకి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా, ఐటీ మంత్రి నారా లోకేశ్‌లను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, శాప్ ఛైర్మన్ రవినాయుడుతో కలిసి బుధవారం ఉండవల్లిలోని వారి నివాసంలో కలిశారు. పాపులస్ గ్లోబల్ ఆర్కిటెక్స్ ప్రతినిధి సిద్ధార్థ్, ఎన్.వి.ఆర్కిటెక్స్ ప్రతినిధి వెంకట్, ఐబీఎస్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టేషన్స్ కంపెనీ ఎండీ వడ్లమూడి హర్ష సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను కలిశారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల 5కే రన్

విజయవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కస్టమ్స్‌డే సందర్భంగా బుధవారం కేంద్ర జీఎస్టీ, పాస్‌పోర్టు కార్యాలయం, సీఏజీ, పోస్టల్‌శాఖ, ఆదాయ పన్ను, ఆర్‌పీఎఫ్, సీపీడబ్ల్యూడీ, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు 300 మంది 5కే రన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి, బీఎస్ఎన్ఎల్ సీజీఎంటీ ఎం.శేషాచలం, రీజనల్ పాస్‌పోర్టు అధికారి శివహర్ష పాల్గొని రన్‌ను ప్రారంభించారు. ఈ పరుగు పీడబ్ల్యూడీ గ్రౌండ్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ సేవలను గుర్తుచేస్తూ, ఆరోగ్య సంకీర్ణత, ఉద్యోగల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కస్టమ్స్ కమిషనరేట్ అదనపు కమిషనర్ కాకరాల ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు.

సింధు స్నానాలకు పోటెత్తిన భక్తజనం

- పుణ్యస్నానాలు ఆచరించిన 30 వేలమంది
- ట్రాఫిక్ అంతరాయంతో ఇక్కట్లు



హంసలదీవి వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కోడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సింధు స్నానాలు ఆచరించేందుకు హంసలదీవికి భక్తులు భారీ సంఖ్యలో రావటంతో సాగర తీరం పోటెత్తింది. బుధవారం మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా హంసలదీవి సమీపంలో సాగర తీరం వద్దకు తెలుగు రాష్ట్రాల్లోని నలుమూలల నుంచి 30 వేలమంది వరకు భక్తులు తరలి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. హంసలదీవి నుంచి పాలకాయితిప్ప వరకు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సముద్రతీరం వద్ద భక్తుల రక్షణ కోసం ఐదు మరబోట్లు, 30 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. రెండు వైద్యశిబిరాలు, నాలుగు తాత్కాలిక మరుగుదొడ్లు, మంచినీటి వసతిని ఏర్పాటు చేశారు. సముద్ర తీర ప్రాంతంలో గ్రామపంచాయతీ వారు 150 మంది శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. అవనిగడ్డ నుంచి హంసలదీవికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు వేశారు. మెరైన్, పోలీసు, ఫారెస్ట్ శాఖ తరపున 250 మంది సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ప్రదేశాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచినట్టు అవనిగడ్డ సీఐ యువకుమార్ తెలిపారు. హంసలదీవి కృష్ణా పవిత్ర సంగమ ప్రదేశంలో స్నానాలు ఆచరించేందుకు భక్తులకు అధికారులు అనుమతించకపోవటంతో భక్తులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పవిత్ర సంగమ ప్రదేశంలో పుణ్యస్నానాలు ఆచరిస్తే పాపవిమోచనం కలుగుతుందని, ఇతర రాష్ట్రాల నుంచి హంసలదీవికి వచ్చామని, కానీ ఇక్కడ అధికారులు భద్రత దృష్ట్యా అనుమతించటం లేదని భక్తులు అసహనం వ్యక్తం చేశారు. హంసలదీవి గ్రామంలో డీసీ వైస్ ఛైర్మన్ బచ్చు వెంకటనాగ్ ప్రసాద్ ఆధ్వర్యంలో రెండు వేలమందికి మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామంలోని శివాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 5 వేలమందికి అన్నసమారాధన నిర్వహించారు. సింధు స్నానాల నేపథ్యంలో అవనిగడ్డ ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ తదితరులు పుణ్యస్నానాలు ఆచరించి వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు.

బర్డ్‌ఫ్లూ కలవరం

(5వ పేజీ తరువాయి)

100 డిగ్రీల సీ వద్ద వేడిచేసి తినవచ్చని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయ్యే వరకు గోసవీడు, ఊటుకూరు, నెమలి గ్రామాల్లోని రాష్ట్ర సరిహద్దులో కోళ్ల రవాణాను నిలిపివేస్తున్నామని, భద్రత కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వారు చెప్పారు. మృతిచెందిన కోళ్లకు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామన్నారు. భోపాల్ నుంచి నివేదిక వచ్చాక కలెక్టర్‌తో సమావేశమై తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో 116 కోళ్లఫారాలు ఉన్నాయని, వాటిలో చిన్నాపెద్దా బాయిలర్ కోళ్లు 23 లక్షలు, నాటుకోళ్లు 2 వేల వరకు ఉన్నాయని, వాటి పరిస్థితిని తెలుసుకునేందుకు పశు సంవర్ధకశాఖ నుంచి 16 బృందాలు వచ్చాయన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ వి.రాజకుమారి, ఆర్ఐ బద్రీ పాల్గొన్నారు. పౌల్ట్రీ యజమాని అత్తునూరు పద్మారెడ్డి మాట్లాడుతూ బ్యాంకు రుణంతో కోళ్లఫారం నడుపుతున్నానని, ప్రస్తుతం తనకు రూ.35 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. కాగా, గంపలగూడెం, నెమలి పశు సంవర్ధకశాఖ అధికారులు శాయికృష్ణ, అభిలాష్ ఘటనాస్థలికి చేరుకుని మృతిచెందిన కోళ్లను పరిశీలించి, సుమారు 12 అడుగుల లోతుతో వివిధ రసాయనాలు చల్లి పాతి పెట్టించారు.



మంగినపూడి బీచ్‌లో..

మచిలీపట్నం టౌన్ : మాఘపౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లో బుధవారం పెద్దసంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సముద్రుడికి అర్ఘ్యం ఇచ్చారు. గుమ్మడికాయలతో అర్చనలు నిర్వహించారు. బీచ్‌లో పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో తప్పిపోయిన పిల్లలను మెరైన్ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతపురం నుంచి బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు పుణ్యస్నానం చేశారు. దత్తరామేశ్వరంలో ద్వాదశ బావుల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. నగరేశ్వరుని సందర్శించారు.

ఏమార్చారు..!

(5వ పేజీ తరువాయి)

అధికారులు భావించారు. లైన్లను మార్చే విషయంలో ట్రాన్స్‌కో అధికారులు రహస్య ఆపరేషన్ నిర్వహించారు. కేవలం మరమ్మతులు చేస్తున్నట్టుగా చూపించి, విద్యుత్ లైన్లను మార్చేశారు. కేవలం మరమ్మతులేనంటూ ఓ పత్రికలో ప్రకటన ఇచ్చారు. ఈ ప్రకటన వేసిన విషయం కూడా చాలామందికి తెలియదు. లైన్ల మరమ్మతులు జరుగుతున్నాయని ప్రచారం చేశారు. రైతులు కూడా మరమ్మతులే కదా.. అనుకున్నారు. కానీ, ట్రాన్స్‌కో అధికారులు తెలివిగా కొత్త విద్యుత్ లైన్లను మార్చారు. నున్న-గుడివాడ 220 కేవీ సెక్షన్ మొత్తం 44.5 కిలోమీటర్లు. 2007-08 లో ఈ ట్రాన్స్‌మిషన్ లైన్లను వేశారు. అప్పట్లో ఏసీఎస్ఆర్ మూస్ కండక్టర్ డబుల్ సర్క్యూట్ లైన్లను వేశారు. 2020 నుంచి ఈ సెక్షన్‌లో లోడ్ పెరిగిపోవటంతో లైన్లను దానికి అనుగుణంగా మార్చాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఏసీఎస్ఎస్ మూస్ డబుల్ సర్క్యూట్ లైన్లను వేసే పని ప్రారంభించారు. ఈ మార్గంలో ఆరు వైర్లను మార్చారు. పూర్తిగా కొత్త లైన్లను మార్చుతుండగా, కేవలం మరమ్మతులంటూ ట్రాన్స్‌కో ప్రకటన చేయడం గమనార్హం. డబుల్ కెపాసిటీ కలిగిన విద్యుత్ లైన్లను పూర్తిగా మార్చే క్రమంలో ట్రాన్స్‌కోనే భారీగా లబ్ధి పొందుతోంది.

రైతులను మోసం చేసిన ట్రాన్స్‌కో

నున్న-గుడివాడ 220 కేవీ సెక్షన్‌లో కొత్త విద్యుత్ లైన్లను మార్చే క్రమంలో ట్రాన్స్‌కో అధికారులు కారిడార్ కాంపన్సేషన్ ఎగవేతకు పాల్పడ్డారు. 2024, జూన్‌లో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ లైన్ల మార్పిడికి సంబంధించి సరికొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. వీటి ప్రకారం.. ప్రస్తుత ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ విద్యుత్ లైన్లను మార్చి కొత్తవి వేస్తే రైతుకు చెందిన భూమి ఎకరం మార్కెట్ విలువకు 30 శాతం మేర పరిహారం చెల్లించాలి. ఈ విషయంపై రైతులకు అవగాహన లేకపోవటంతో మరమ్మతుల పేరు చెప్పి లైన్లను మార్చేశారు.

దొంగచాటు పనులెందుకు..?

నున్న నుంచి గుడివాడ వరకు విద్యుత్ లైన్లను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరమే లేదు. 2017లో గుడివాడలో 400 కేవీ విద్యుత్ లైన్లను వేయటానికి చర్యలు చేపట్టగా, రైతులు కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ కేసులు తేలలేదు. ట్రాన్స్‌కో అధికారులు ఈ కేసులను పరిష్కరించుకుంటే నున్న-గుడివాడ లైన్‌ను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం లేదు.

ఆదాయం కోసం ఆరాటం..!

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేయగా, మిగిలిన స్థలంలో రేకుల షెడ్లను ఏర్పాటుచేసి దుకాణాలుగా విభజించాడు. మొత్తం 38 దుకాణాలను ఏర్పాటుచేసి వివిధ వ్యాపారులకు అద్దెకిచ్చాడు. ఎగ్జిబిషన్ ముగిసే సమయానికి కనీసం రూ.50 వేలను అద్దెగా వసూలు చేస్తారు. ఇలా ఇక్కడ షాపులు నిర్వహిస్తున్న వారిలో ఉత్తరాదికి చెందినవారున్నారు. ప్రభాకర్ తీసుకున్న అనుమతులు జనవరి నెలాఖరుతోనే ముగిశాయి. అనుమతి పొడిగించాలని దరఖాస్తు చేసుకున్నానని, కార్పొరేషన్‌కు రూ.3.96 లక్షలు చెల్లించానని సదరు నిర్వాహకుడు చెబుతున్నాడు. జనవరి నెలాఖరు తర్వాత తాము అనుమతి ఇవ్వలేదని వీఎంసీ అధికారులు చెబుతున్నారు. తాము ఎన్‌వోసీ మాత్రమే ఇచ్చామని, ప్రైమరీ అనుమతి ఇవ్వలేదని వీఎంసీ ప్రాంతీయ అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు చెప్పారు. ప్రాంగణంలో ఎగ్జిబిషన్‌ను నిర్వహించడానికి వీఎంసీ ఎస్టేట్ విభాగం అనుమతి పొడిగించలేదని చెబుతోంది.

పోలీసులు ఎలా ఇచ్చారు?



వీఎంసీ ఇచ్చిన అనుమతి గడువు ముగిసింది. పొడిగింపునకు నిర్వాహకుడు ప్రభాకర్ డబ్బులు చెల్లించినా.. అధికారికంగా ఎలాంటి కాగితాలు ఇవ్వలేదు. ఇది లేకుండానే పోలీసు శాఖ ప్రభాకర్‌కు అనుమతినిచ్చింది. వీఎంసీకి డబ్బు చెల్లించిన రశీదులను చూపించి పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నట్టు తెలుస్తోంది. జనవరి నెలాఖరుకే గడువు ముగిసినా పోలీసులు ఈనెల 1 నుంచి 28వ తేదీ వరకు అనుమతి ఇవ్వడం గమనార్హం. డబ్బు చెల్లించుకున్న వీఎంసీ అధికారులు.. ఇప్పటి వరకు నిర్వాహకుడికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అనుమతిని పొడిగిస్తారా లేదా అనే విషయం కూడా చెప్పలేదు. పొడిగింపు దరఖాస్తులు ఎలాగూ అధికారుల వద్ద ఉండటం, పోలీసులు ఇప్పటికే అనుమతి ఇవ్వడంతో ఎగ్జిబిషన్‌ను నడుపుకోవడానికి ఎలాంటి అడ్డంకులు లేవని భావించాడు. అలాగే, ఎగ్జిబిషన్‌ను సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించాలి. కానీ, రాత్రి 10 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

హోంమంత్రి ఆరా

అగ్నిప్రమాదంపై హోంమంత్రి అనిత స్పందించారు. పశ్చిమ ఏసీపీ దుర్గారావుతో ఫోన్‌లో మాట్లాడారు. గ్యాస్ సిలిండర్ పేలుడుతో మంటలు వ్యాపించాయని మంత్రికి ఏసీపీ వివరించారు. వేసవికాలం మొదలవుతున్నందున ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసు, అగ్నిమాపక అధికారులను ఆదేశించారు. వ్యాపారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

ఉపాధిలో పురోగతి కనిపించాలి

- పనితీరులో బాధ్యతా రాహిత్యం కనిపిస్తే చర్యలు తప్పవు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరిక



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు దినసరి సగటు వేతనం రూ.300 హక్కుగా పొందేలా క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది సరైన ప్రణాళికతో పనులు చేపట్టాలని, ప్రతి గ్రామ పంచాయతీలోనూ పురోగతి కనిపించాలని, సిబ్బంది పనితీరులో బాధ్యతా రాహిత్యం కనిపిస్తే చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలం, గ్రామపంచాయతీల వారీగా చేపడుతున్న పనులు, హాజరవుతున్న కూలీలు, సగటు వేతనం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ ఏడాది జనవరితో పోలిస్తే ఫిబ్రవరి నాటికి కొన్ని మండలాలు, గ్రామ పంచాయతీల్లో సగటు వేతనంలో పెరుగుదల కనిపించిందని, పథకం అమల్లో వెనుకబడిన మండలాలు, గ్రామ పంచాయతీలు కూడా లక్ష్యాలు చేరుకోవాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, క్రియాశీలంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

ఎంఎస్ఎంఈ సర్వేను వేగవంతం చేయాలి

పారిశ్రామికరంగ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) సర్వేలో వేగం పెంచాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. పోటీతత్వ, ఆరోగ్యకర పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థను పెంపొందించడం, పారిశ్రామిక యూనిట్ల అవసరాలు, ఎంఎస్ఎంఈ యూనిట్లలో లోపాలను గుర్తించి, సరిదిద్దేందుకు సర్వే ఫలితాలు దోహదం చేస్తాయన్నారు. ఇప్పటివరకు 28,216 యూనిట్ల సర్వే పూర్తయిందని, మిగిలిన వాటి సర్వేను చకూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పీఎం విశ్వకర్మ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన వారం రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. నరేగా-పల్లెపండుగ కింద పశువుల షెడ్లకు సంబంధించి 746 పనులు మంజూరు కాగా 451 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సీసీ రోడ్లకు సంబంధించి 612 పనులు మంజూరు కాగా 49.51 శాతం మేర పనులు పూర్తయ్యాయని, మిగిలిన రోడ్లను కూడా నెలాఖరుకు పూర్తిచేసేందుకు చొరవ చూపాలని ఆదేశించారు. రైతులకు సంజీవని వంటి పంట పొలాల్లో నీటి కుంటల (ఫార్మ్ పాండ్స్)పై అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.రాము, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు. వర్చువల్‌గా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


రూ.2.08 కోట్లతో నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

రూ.కోట్లతో నిర్మించే రోడ్లు
క్వాలిటీ లేకుంటే ఎలా..?

● అధికారులను ప్రశ్నించిన కలెక్టర్ లక్ష్మీశ

జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న రహదారుల్లో నాణ్యత లేకుంటే ఎలా..! అధికారుల పని తీరు ఇదేనా? అని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ప్రశ్నించారు. బుధవారం పోచంపల్లి, అనుమంచిపల్లి గ్రామాలలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖాధికారులతో కలిసి ఆయన పర్యటించారు. జాతీయ రహదారి నుంచి పోచంపల్లి గ్రామానికి వెళ్లే పరసబాట డొంకగా పిలిచే డొంకరోడ్డు అభివృద్ధికి 3.700కి.మీలకు గాను రూ.2.08 కోట్లను డీఎంఎఫ్ నిధులు మంజూరు కావటంతో నిర్మాణం చేపట్టారు. ఇంకా కి.మీ పెండింగ్ ఎందుకుందని ఆరా తీశారు. ఈ రోడ్డుకు క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ ఉందా అని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రూ.కోట్లు వెచ్చించి చేపట్టే పనుల్లో ఆయా శాఖలు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనుమంచిపల్లిలో రైతులు 'పొలం పిలుస్తుంది'లో మాట్లాడుతూ తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. సాగులోని పంటలు, ఎరువులు, వాటి లభ్యత వివరాలను తెలుసుకున్నారు. యంత్ర పరికరాలు, కోతుల బెడదను రైతులు కలెక్టర్‌కు వివరించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. అసిస్టెంట్ కలెక్టర్ శుభంనోఖ్వాల్, పంచాయతీ రాజ్ ఎస్ఈ రమేష్, వ్యవసాయ శాఖ ఏడీఏ భవానీ, ఎంపీడీవో నితిన్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నేడు తీర్పు

విజయవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గన్నవరం నియోజకవర్గ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై తీర్పు గురువారం వెలువడనుంది. ఈ కేసులో ఇప్పటికే ఫిర్యాదుదారుడు ముదునూరు సత్యవర్ధన్ తనకు ఎలాంటి సంబంధం లేదని న్యాయాధికారికి వాంగ్మూలం ఇచ్చాడు. బెయిల్ పిటిషన్‌పై న్యాయవాదులు వాదనలు వినిపించారు. బుధవారం వాదనలు పూర్తి కావడంతో తీర్పును న్యాయాధికారి హిమబిందు గురువారానికి వాయిదా వేశారు.

ఆర్టీసీకి ప్రైవేటు ఈవీల ముప్పు!

● ఇప్పటికే న్యూగో, ఫ్రెష్ బస్సులు
● కొత్తగా రోడ్డెక్కిన ఫ్లిక్స్ బస్సు సర్వీసులు
● తక్కువ టికెట్ ధరకే ప్రయాణ సేవలు
● ప్రయాణికులను ఆకర్షిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు
● పాత బస్సులతో ఓఆర్ కోల్పోతున్న ఏపీఎస్ఆర్టీసీ



అమరావతి-ఆంధ్రజ్యోతి: ఏపీఎస్ఆర్టీసీకి ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సుల రూపంలో ముప్పు ముంచుకొస్తోంది. ప్రైవేటు సంస్థలు ఆకర్షణీయమైన ఆఫర్లతో ప్రయాణికులను తన వైపు తిప్పుకుంటున్నాయి. కేవలం రూ.99కే విజయవాడ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తామని వల విసురుతూ ఆర్టీసీని సవాల్ చేస్తున్నాయి. ఇప్పటికే న్యూగో, ఫ్రెస్ బస్సులు ఆర్టీసీ టికెట్ కన్నా తక్కువ ధరకు ప్రయాణికులను తీసుకెళ్తుండగా.. తాజాగా ఫ్లిక్స్ బస్సు రోడ్డు ఎక్కడంతో ఆర్టీసీకి ప్రమాదం ముంచుకొస్తోంది. ఇప్పటికే పాత డొక్కు బస్సులతో ఆక్యుపెన్సీ రేటు (ఓఆర్)ను కాపాడుకోలేక ఆర్టీసీ ఇబ్బందులు పడుతోంది. ఏసీ బస్సుల్లో అయితే సీట్లన్నీ ప్రయాణికులతో నింపలేకపోతున్న పరిస్థితి! ఈ క్రమంలో ముంచుకొస్తున్న ప్రైవేటు ఈవీల ముప్పును గమనించి.. వీలైనంత త్వరగా ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేసి రోడ్లపైకి వదిలితే తప్ప ప్రయాణికులు కాపాడుకోవడం కష్టమనే వాదన వినిపిస్తోంది.

కాలానుగుణ మార్పుల్లో నెమ్మదిగా..

ఏపీఎస్ఆర్టీసీ ప్రతిరోజూ దాదాపు 11 వేల బస్సుల ద్వారా 45 లక్షల మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తోంది. అయితే ఈ సంస్థ కాలానుగుణ మార్పు చెందడంలో నెమ్మదిగా ఉంది. పదేళ్ల క్రితం రాష్ట్ర విభజన సమయంలో అమరావతి 'పేరుతో' హైదరాబాద్-విజయవాడ మధ్య నడిపిన బస్సుల్లో ఎక్కిన ప్రయాణికులు ఫ్లైట్ ఆన్ రోడ్ అని వ్యాఖ్యానించారు. అంతటి అభిమానాన్ని చూరగొన్న ఆర్టీసీ ఆ తర్వాత కొత్త బస్సుల ఊసు మరిచింది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్క కొత్త బస్సు కొనుగోలు చేయలేదు. ఫలితంగా డొక్కు బస్సులు ఎక్కడికక్కడ ఆగిపోతుండటంతో ప్రయాణికులు రోజురోజుకూ దూరమవుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విడతల వారీగా గడిచిన ఆర్నెళ్లలో 700కు పైగా కొత్త బస్సులను కొనుగోలు చేసింది.

ప్రధాన రూట్లపై ప్రైవేటు దృష్టి

ప్రస్తుతం ప్రపంచం ఎలక్ట్రిక్ వాహనాల వైపు చూస్తోంది. ఇదే క్రమంలో ప్రైవేటు ఆపరేటర్లు ఈ-బస్సులు నడుపుతూ ప్రయాణికులను ఆఫర్లతో ఆకర్షిస్తున్నారు. రాష్ట్రంలో ఆర్టీసీకి ఎక్కువ ఫ్లీట్ విజయవాడ-హైదరాబాద్ మధ్య ఉంటుంది. అందులో వెన్నెల, డాల్ఫిన్, ఇంద్ర, అమరావతి, స్టార్ లైనర్ పేర్లతో ఏసీ బస్సులు నడుపుతోంది. దీని తర్వాత విజయవాడ-విశాఖపట్నం రూట్ ప్రయాణికుల రద్దీలో రెండోది. ఇది గమనించిన ప్రైవేటు బస్సు ఆపరేటర్లు ఈ రెండు రూట్లలో ఈవీలను ప్రవేశపెట్టారు. న్యూగో పేరుతో విజయవాడ-హైదరాబాద్ మధ్య నడుస్తోన్న ప్రైవేటు ఈవీ బస్సుల్లో రూ.450-550 మధ్య టికెట్ ధర పెట్టారు. అదే ఆర్టీసీ బస్సులో రూ.800కు పైనే ఉండటంతో ప్రయాణికులు ఈవీల వైపు మొగ్గు చూపుతున్నారు.

త్వరగా ఎలక్ట్రిక్ బస్సులు కొనాల్సిందే..

ఇదిలా ఉండగా తాజాగా ప్రవేశపెట్టిన ఫ్లిక్స్ బస్సు ఆర్టీసీ హౌస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం రూ.99తో 5 గంటల్లో తీసుకెళ్తామని ఆఫర్ ప్రకటించింది. తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ నెల 9న ప్రవేశపెట్టిన ఈ బస్సుల ట్రయల్ రన్ రెండు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల మధ్య నడుస్తోంది. సుమారు 12 వారాలు పరీక్షించిన తర్వాత ప్రయాణ చార్జీల్లో మార్పులుంటాయని చెబుతున్నారు. ప్యాసింజర్లను ఆకర్షిస్తోన్న ఫ్లిక్స్ బస్సు ఈ నెలాఖరు నుంచి ఏపీఎస్ఆర్టీసీకి మూడో ముప్పుగా ఎదురవుతోంది. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీ వీలైనంత త్వరగా ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలందించకపోతే పోటీ ప్రపంచంలో సంస్థ మనుగడ కష్టమే అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

రచయిత్రి ఓల్గాకు కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కారాన్ని 2024 సంవత్సరానికి ప్రముఖ రచయిత్రి పోపూరి లలితకుమారి(ఓల్గా)కు ప్రదానం చేయనున్నట్టు గుప్తా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మదుపల్లి మోహన్ గుప్తా ప్రకటించారు. ఈ నెల 16న ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేస్తామన్నారు. ముఖ్య అతిథిగా గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ తదితరులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.


జలబిందెలను ఎత్తుకున్న సీఐ, ఎస్సై

వైభవంగా తిరుపతమ్మ
జలబిందెల మహోత్సవం

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మహోత్సవాల్లో బుధవారం జలబిందెల మహోత్సవం ఘనంగా జరిగింది. తొలుత అమ్మవారి ఆలయం నుంచి ఐదు కొత్త మట్టి కుండలను మునేటి వద్దకు మేళతాళాలతో తీసుకువెళ్లారు. పవిత్ర మునేటిలో ప్రధాన అర్చకుడు మర్రిబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో పురోహితుడు శివరాం బొట్ల ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు కొత్త కుండల్లో పవిత్ర మునేటి జలాన్ని నింపి పూజలు చేశారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం గ్రామానికి చెందిన నల్లపునేని, గజ్జి, సూరంపల్లి, వడ్లమూడి, కర్ల వంశీయులు నితిత్ చౌదరి, శివకృష్ణ, రామకృష్ణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు పవిత్ర జలబిందెలను తలపై పెట్టుకొని భారీ ఊరేగింపుగా దేవస్థానం వద్దకు చేరుకొని జలబిందెలను అమ్మవారి ఆలయంలో సమర్పించారు. జలబిందెలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగానే సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ఎం.ఎస్.కె అర్జున ఘన స్వాగతం పలికి పోలీస్‌స్టేషన్‌లోకి తీసుకువెళ్లి క్రతువులు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ బి.హెచ్.వి.ఎస్ కిషోర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎల్.రమా, తహసీల్దార్ శాంతి లక్ష్మి, గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.శ్యామ్‌కుమార్, ఎంపీడీవో జి.శ్రీను, ట్రాన్స్‌కో మండల ఏఈ కోగంటి దుర్గా ప్రసాద్, ఏఈలు రాజు, అరవింద్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మెట్రో నిర్ణయం సరికాదు

● మాజీ మంత్రి వడ్డే

ధర్నాచౌక్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో కొన్ని అంశాలపై సీఎం చంద్రబాబు తన దృక్పథాన్ని సవరించుకోవాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో మెట్రో రైలు ఏర్పాటు చేయాలనే నిర్ణయం సరైంది కాదన్నారు. 90 లక్షల కోట్ల జనాభాతో నడుస్తున్న హైదరాబాద్ మెట్రో రైల్ వ్యవస్థకు 2023-24లో రూ.1386 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నగరంలోని ఔటర్ రింగ్‌రోడ్డు, ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలన్నారు. రామాయపట్నంలోనే నౌకా నిర్మాణంతో పాటు మేజర్ పోర్టును ఏర్పాటు చేయాలన్నారు. 45 మీటర్ల ఎత్తుతోనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరిగితేనే ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి, రాయలసీమకు నీరు అందించడం సాధ్యపడుతుందన్నారు. వరి ధాన్యం రకాల సాగును ప్రోత్సహించాలని చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరించాలన్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

భారతీనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కాలనీలోని ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్లో బుధవారం ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివాదరహితుడు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించే ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం కోసం బీజేపీ నేతలు, కార్యకర్తలు శ్రమించి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందన్నారు. మోదీపై నమ్మకంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాలనాదక్షతకు ఓటు వేసిన రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన జరుగుతుందన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ఆలపాటి గెలుపు ఖాయం: ఎంపీ చిన్ని

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా ఎన్డీయే కూటమి బలపరిచిన ఉమ్మడి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు ఖాయమని, ఎన్టీఆర్ జిల్లాలో భారీమెజార్టీ వస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు. ఎన్డీయేకూటమి బలపఅభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన ఎన్డీయే కూటమి నేతల ఆత్మీయ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొని మాట్లాడారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు చేయించుకున్న గ్రాడ్యుయేటర్ల ఓటర్ల మ్యాపింగ్ చురుగ్గా సాగుతుందన్నారు.

ఎన్డీయే కూటమి నేతలు ప్రతి 30 మంది ఓటర్లకు ఒక పరిశీలకుడిని నియమించి మ్యాపింగ్ చేస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి నెట్టెం రఘురాం, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, తంగిరాల సౌమ్య, వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు, శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మచిలీపట్నం పార్లమెంట్ అధ్యక్షుడు రాజాబాబు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీనాథ్, జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాసరాజు, ఏపీ స్టేట్ మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు కనపర్తి శ్రీనివాసరావు, ఎం ఎస్ బేగ్, కూటమి నేతలు, నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పాల్గొన్నారు.

పాన్‌కార్డు 2.0 వచ్చేసింది

● మరింత సెక్యూరిటీ ఫీచర్లతో సర్వీస్ వేగవంతం
● ఆర్థిక మోసాలకు చెక్.. దుర్వినియోగానికి పాతర
● క్యూ ఆర్ కోడ్‌తో అడ్వాన్స్ ఫీచర్స్

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో పాన్‌కార్డు భాగమైపోయింది. అంతేకాదు అత్యంత కీలకంగానూ మారింది. బ్యాంకు లావాదేవీలు, క్రెడిట్ కార్డులు, బ్యాంకు లోన్లు, ఇన్‌కంటాక్స్ రిటర్న్స్ ఇలా డబ్బుతో ముడిపడిన లావాదేవీలు ఏవైనా పాన్‌కార్డు ఉండాల్సిందే. బడా పారిశ్రామికవేత్తలు, ఉద్యోగుల నుంచి చిరు వ్యాపారుల వరకు పాన్‌కార్డు తప్పనిసరి. అయితే ఈ పాన్‌కార్డును కేంద్ర ప్రభుత్వం మరింత అడ్వాన్స్ ఫీచర్స్‌తో రూపొందించింది. 'పాన్ 2.0' పేరుతో అప్‌డేట్ వర్షన్‌తో అందుబాటులోకి వచ్చింది. గతంతో పోలిస్తే వేగవంతమైన సర్వీస్, పటిష్ట సెక్యూరిటీతో ఆర్థిక మోసాలకు తావులేకుండా క్యూఆర్ కోడ్‌తో తెచ్చింది. ఈ పాన్ 2.0ను ఆన్‌లైన్‌లోని ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉచితంగా పొందే సౌకర్యం కల్పించింది. ప్రస్తుతం చలామణిలో ఉన్న పాన్‌కార్డుతో వెరిఫికేషన్‌కు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తుంది. లావాదేవీల సమయంలోనూ ఒరిజినల్ పాన్‌కార్డును అందుబాటులో ఉంచుకోవాలి. అయితే పాన్ 2.0తో అలాంటి ప్రక్రియలేమీ ఉండవు. కేవలం ఒకే ఒక్క క్యూ ఆర్ కోడ్ స్కాన్‌తో పూర్తి వివరాలు ఆటోమెటిక్‌గా లభిస్తాయి. డూప్లికేట్ పాన్‌కార్డుల వినియోగం, పాన్‌కార్డులను దుర్వినియోగం జరగదు. భౌతికంగా కార్డు పొందాలనుకుంటే మాత్రం రూ.50 చెల్లించాలి. పాన్ 2.0 రాకతో పాత పాన్‌కార్డులు చెల్లవనే అపోహలు అవసరం లేదు. కొత్త కార్డులు తీసుకోవాలన్న తప్పనిసరి నిబంధన లేదు. పాత పాన్‌కార్డులు యథావిధిగానే పనిచేస్తాయి. అయితే భద్రత, వేగవంతమైన సర్వీస్ కావాలనుకుంటే మాత్రం ఆన్‌లైన్‌లో కొత్త పాన్ 2.0ను పొందవచ్చు.




గిరిప్రదక్షిణలో పాల్గొన్న అధికారులు, అర్చకులు, భక్తులు

భక్తి ప్రపత్తులతో
దుర్గమ్మ గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని మాసవారీ కార్యక్రమంలో భాగంగా గంగా, పార్వతీ మల్లేశ్వర ఉత్సవమూర్తుల గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం ఆలయం నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్దకు తీసుకొచ్చారు. అక్కడ అన్నపు రాశిని పోసి బలిహరణలు సమర్పించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, గుమ్మడికాయ దిష్టితీశారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, ఈఈ కోటేశ్వరరావు, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి కొబ్బరికాయలు కొట్టి బలిహరణలు సమర్పించారు. అనంతరం డిప్యూటీ ఈవో, ఈఈ, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, శ్రీనివాస శాస్త్రి, ఉద్యోగులు, భక్తులు ఉత్సవమూర్తులను ఉంచిన బండిని లాగారు. భక్తుల నినాదాల మధ్య గిరిప్రదక్షిణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట వాయిద్యాలు, భక్తుల భజనలు, తదితర భక్తిపారవశ్య వాతావరణంలో గిరిప్రదక్షణ బయలుదేరింది. కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంట్ల మీదుగా బయలుదేరి తిరిగి ఘాట్‌రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు. అనేకచోట్ల భక్తులు కొబ్బరికాయలు, పండ్లు, హారతులు సమర్పించి, పసుపు నీళ్లతో వారు పోశారు. వందలాది భక్తులు పాల్గొన్నారు.

ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ రాష్ట్ర హెడ్‌గా భార్గవ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ రాష్ట్ర హెడ్‌గా విజయవాడకు చెందిన వల్లూరు భార్గవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఏపీసీసీ పనిచేస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలారెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యలపై నిరంతరం ఇప్పటికే పనిచేస్తున్నారన్నారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

79 మంది రైతులకు 191 ప్లాట్ల కేటాయింపు

వన్‌టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో మంగళగిరి, తుళ్లూరుకు చెందిన 79 మంది రైతులకు 191 రిటర్న్‌బుల్ ప్లాట్లను కేటాయించి ప్రొవిజనల్ సర్టిఫికెట్లను అందచేసినట్టు ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు చెప్పారు. లాటరీ ద్వారా ఈ కేటాయింపులు జరిగాయి. కృష్ణాయపాలెం, నవులూరు 1, 2, నిడమర్రు 1, 2, వెలగపూడి మందడం 1, 2, కొరగల్లు 1, 2, తుళ్లూరు 1, 2, నెక్కల్లు, అనంతవరం రైతులకు లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రైతులు వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకోవాలని సూచించారు. ఎల్‌పీఎస్ భూముల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యం కాకుండా ఉండేందుకు కొత్తగా 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ప్రారంభించినట్టు తెలిపారు. సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సాయి ప్రవీణ్ చంద్, ల్యాండ్స్ జాయింట్ డైరెక్టర్ డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, శేషరెడ్డి, రవీందర్, పి.పద్మావతి, కె.స్వర్ణమేరి, ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. గురువారం 364 రిటర్న్‌బుల్ ప్లాట్‌కు లాటరీ విధానం కేటాయించనున్నారు. అమరావతి కోసం భూములిచ్చిన 11 గ్రామాల్లోని 167 మంది రైతులకు ప్లాట్లను కేటాయించనున్నారు. దొండపాడు, పిచ్చుకలపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, శాఖమూరు, వెంకటపాలెం రైతులకు ఉదయం 10 గంటల నుంచి, ఉద్ధండరాయునిపాలెం, మల్కాపురం, రాయపూడి 1, 2, కొండమరాజుపాలెం, అబ్బరాజుపాలెం గ్రామాల రైతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్లాట్ల కేటాయింపు జరుగుతుందన్నారు.





రైతులకు రిట్నబుల్ ప్లాట్లు కేటాయింపులు చేస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

నగరంలో ఎస్టీపీలకు రూ.16.7 కోట్లు

● పరిపాలన అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
● ఐక్యరాజ్య సమితి అనుబంధం యూఎన్ఐడీవో ఆర్థిక సహకారం రూ. 11.77 కోట్లు
● విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వాటా రూ.4.93 కోట్లు



విజయవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) పరిధిలో ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యూఎన్ఐడీవో) ఆర్థిక సహకారంతో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, నాలుగు బయో ఎనర్జీ ప్లాంట్స్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పరిపాలన అనుమతులను జారీ చేసింది. దీంతో నగరంలో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఆధునీకరణకు మార్గం ఏర్పడింది. వీఎంసీ పరిధిలో యూఎన్ఐడీవో బృందం పరిశీలించిన క్రమంలో నగరాభివృద్ధికి తన వంతు గ్రాంటును ఇస్తానని అప్పట్లో తెలిపింది. ఆ ప్రకారం గతంలో బృందం పర్యటించిన మేరకు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాట్ల ఆధునీకరణకు, అభివృద్ధికి రూ.11.77 కోట్లు ఇవ్వటానికి ముందుకొచ్చింది. సంస్థ కార్పొరేషన్‌తో భాగస్వామ్యంగా ఉండటంతో తన వాటాగా వీఎంసీ రూ.4.93 కోట్లను ఖర్చు చేయటానికి సిద్ధమైంది. వీఎంసీ కమిషనర్ ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి నిర్దేశించటంతో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో రామలింగేశ్వరనగర్‌లోని 20 ఎంఎల్‌డీ ఎస్టీపీ ప్లాంట్‌తో పాటు అజిత్ సింగ్‌నగర్-2, జక్కంపూడి, రామలింగేశ్వరనగర్‌లలోని బయోగ్యాస్ ఎనర్జీ ప్లాంట్ల మరమ్మతులకు నిధుల కేటాయింపు జరుగుతుంది. దీంతో నగరంలో మురుగునీటిని శుద్ధి చేయటంతో పాటు బయోగ్యాస్ ఉత్పత్తి, దీని ద్వారా విద్యుదుత్పత్తికి మార్గం ఏర్పడుతోంది.

చర్లపల్లి - కాకినాడ టౌన్, చర్లపల్లి - నరసాపూర్
వారాంతపు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి - కాకినాడ టౌన్, చర్లపల్లి - నరసాపూర్ మధ్య వారాంతపు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌వో నస్రత్ మండ్రూపకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రద్దీ నియంత్రణకు ఈ రైళ్లను ఈనెల 23 వరకు నడుపుతున్నట్టు తెలిపారు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ రైలు చర్లపల్లిలో రాత్రి 7.20 గంటలకు బయలుదేరి కాకినాడ టౌన్‌కు ఉదయం 4.30 గంటలకు చేరుతుంది. ఈనెల 14, 21 తేదీల్లో నడుస్తుంది. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి రైలు కాకినాడలో సాయంత్రం 6.55కు బయలుదేరుతుంది. చర్లపల్లికి ఉదయం 6.50 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 16, 23 తేదీల్లో నడుస్తుంది. 07233 చర్లపల్లి - నరసాపూర్ రైలు రాత్రి 7.15కు చర్లపల్లిలో బయలుదేరి నరసాపూర్‌కు ఉదయం 5.50 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 14, 21 తేదీల్లో నడుస్తుంది. 07234 నరసాపూర్ - చర్లపల్లి రైలు నరసాపూర్‌లో రాత్రి 8 గంటలకు బయలుదేరి చర్లపల్లికి ఉదయం 8 గంటలకు చేరుతుంది. చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. దీనికి టూఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్, రెండో తరగతి కోచ్‌లు అనుసంధానం చేశారు. చర్లపల్లి - నరసాపూర్ ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది. టూ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్, రెండో తరగతి కోచ్‌లు అనుసంధానం చేశారు.



రేపు ప్రేమికుల రోజు

చూపులు కలిసినంత సులువు కాదు మనసులు ముడిపడడం. ప్రేమంటే భావోద్వేగాల బంధం. ఒకరికి ఒకరుగా... ఇద్దరూ ఒకటిగా జీవించాలని తపించే అనుబంధం. ఇది బలమైన బంధమై... ప్రేమ ప్రయాణం కలకాలం సాగాలంటే రెండు వైపుల నుంచీ నిరంతర ప్రయత్నం అవసరమంటున్నారు లవ్ గురువులు. మనలోని లోటుపాట్లను తెలుసుకొని... ఒకరిపై ఒకరు నమ్మకంతో అడుగులు వేస్తే అంతా ఆనందకరమే అంటున్నారు. అందుకు వారు ఇస్తున్న సలహాలివే...

ప్రేమను గెలిపిద్దాం!

మ్యాజిక్ బాక్స్ కాదు...

ఒకరితో సాంగత్యం ఎప్పుడూ మధురానుభూతినిస్తుంది. కానీ అదే జీవితమనుకోవద్దు. వాస్తవానికి రిలేషన్‌షిప్ మ్యాజిక్ బాక్స్ కాదు... మీ బాధలన్నీ చిటికెలో పోగొట్టేసి జీవితాన్ని ఆనందమయం చేయడానికి! మీ సంతోషం వేరెవరి చేతుల్లోనో కాదు... మీ చేతుల్లోనే ఉందని గమనించండి.

భిన్నాభిప్రాయాలు సహజం...

మీ అలవాట్లు, అభిప్రాయాలు, జీవనశైలి, దృష్టికోణం లానే మీ భాగస్వామి కూడా ఉండాలని ఆశించవద్దు. ఏ ఇద్దరూ ఒకేలా ఉండరనేది గుర్తించండి. కొన్ని విషయాల్లో భిన్నాభిప్రాయాలున్నా పట్టించుకోవాల్సిన పని లేదు. కావల్సిందల్లా ఒకరి మనోభావాలు ఒకరు గౌరవించుకోవడం... వాళ్లని వాళ్లలానే మీ జీవితంలోకి ఆహ్వానించడం.

ఇరువైపుల నుంచీ ప్రయత్నం...

ఏ ప్రేమ బంధమూ పర్‌ఫెక్ట్ కాదు! దాన్ని పక్కాగా తీర్చిదిద్దుకోవడానికి రెండు వైపుల నుంచీ నిరంతర ప్రయత్నం జరుగుతుండాలి. ప్రతి అనుబంధంలో ఎప్పుడో ఒకప్పుడు చేదు అనుభవాలు ఎదురవుతాయి. చిన్న చిన్న వాదనలు, గొడవలు జరుగుతాయి. ఇలాంటప్పుడే వాటిని ఎలా పరిష్కరించుకోవాలో నేర్చుకుని, బంధాన్ని ఆనందమయం చేసుకొంటూ ముందుకు సాగాలి.

విలువలు ముఖ్యం...

ప్రేమలో కొన్ని మంచి రోజులు... ఒకరికి ఒకరికి పడని రోజులూ ఉండవచ్చు. కానీ... నైతిక విలువలు దెబ్బతినేలా ఒకరి గౌరవానికి ఒకరు భంగం కలిగించే రోజు ఒక్కటి కూడా రాకూడదు. ఎందుకంటే ప్రేమన్నది బాధను పెంచడానికి కాదు... రెండు హృదయాలను దగ్గరకు చేర్చడానికని తెలుసుకోండి.

అతిగా ఆశించవద్దు...

మీలానే మీ భాగస్వామి కూడా ఉండాలని ఆశించడం సహజమే. కానీ... కొన్ని కొన్ని మీ నియంత్రణలో లేవని బాధపడుతూ కూర్చోకండి. జరిగినవి, జరగబోయేవీ తలుచుకుని చింతిస్తూ మానసిక ఒత్తిడిలోకి వెళ్లకుండా జాగ్రత్త పడండి. మీ స్నేహం ఆనందంగా సాగుతుంటే... దాన్ని మరింత అందంగా తీర్చిదిద్దుకోవడానికి కలిసి ప్రయత్నించండి. అంతే కానీ... జరగనివాటిని ఆశించి భంగపడవద్దు.

ఆ సత్యాన్ని అర్థం చేసుకోండి...

ఒక వేళ మీ ప్రేమ విఫలమైతే... అది మళ్లీ పుడుతుందన్న నిజాన్ని అర్థం చేసుకోండి. కొంత మంది తొలి ప్రేమే ఇక చివరిదని, నిజమైన ప్రేమ జీవితంలో ఒక్కసారే పుడుతుందనే దురభిప్రాయంలో ఉంటారు. ఒకసారి గుండె పగిలినంత మాత్రాన అది మళ్లీ అతకదనుకోవడం పొరపాటు. తొలి ప్రేమలోనే జీవిత భాగస్వామిని పొందితే హ్యాపీనే. ఒకవేళ పొందలేకపోతే... జీవితంలో ఇంకా ఎన్నో అద్భుతమైన విషయాలు మీ కోసమే వేచి ఉన్నాయని తెలుసుకోండి.

ఈ కథ ఇలా మొదలైంది!

ప్రేమ అనేది అపురూపమైన భావన. మనసులో ఉన్న ప్రేమను వ్యక్తపరచడానికి ప్రత్యేక సమయం అవసరం లేదు. అయినా తమ ప్రేమను తెలిపేందుకు ప్రేమికులంతా ఈ రోజు కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అదే ఫిబ్రవరి 14... ప్రేమికుల రోజు. ఈ రోజుకు సంబంధించి ఆసక్తికరమైన అంశాల సమాహారం... మీ కోసం.

వారం ముందు నుంచే...

ప్రేమికుల రోజుకి వారం ముందు అంటే ఫిబ్రవరి ఏడు నుంచే వాలెంటైన్స్ వీక్‌ను జరుపుకుంటారు. ఒక్కో రోజును ఒక్కో పేరుతో సెలబ్రేట్ చేసుకుంటారు. ఫిబ్రవరి 7న రోజ్ డే, 8న ప్రపోజ్ డే, 9న చాకొలేట్ డే, 10న టెడ్డీ డే, 11న ప్రామిస్ డే, 12న హగ్ డే, 13న కిస్ డే, 14న వాలెంటైన్స్ డే జరుపుకుంటారు. ప్రేమికులు ఒకరికొకరు బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపేస్తారు.

ఎలా మొదలైంది?

రోమ్‌లో వాలెంటైన్ అనే క్రైస్తవ ప్రవక్త... ప్రేమతో జీవించడాన్ని ఇష్టపడేవాడు. ఆ దిశలోనే యువతీ యువకులను ప్రోత్సహించేవాడు. సమాజంలో పెరుగుతున్న హింస, స్వార్థం, ద్వేషం లాంటి చెడు గుణాలపై పోరాడేందుకు ప్రేమను మించిన ఆయుధం లేదని చెప్పేవాడు. రోమ్ చక్రవర్తి కూతురు ఇతని పట్ల ఆకర్షితురాలవుతుంది. యువతను తప్పుదోవ పట్టిస్తున్నాడంటూ వాలెంటైన్‌కు రోమ్ చక్రవర్తి మరణశిక్ష విధిస్తాడు. ఈ సంఘటన జరిగిన రెండు దశాబ్దాల తరవాత అప్పటి పోప్ ఫిబ్రవరి 14ని ప్రేమికుల రోజుగా ప్రకటించాడు. అప్పటి నుంచి వాలెంటైన్ పేరు మీద ప్రేమికుల రోజు (వాలెంటైన్స్‌డే)ను జరుపుకుంటున్నారు.



- ప్రపంచంలోని చాలా దేశాల్లో ఈ ప్రేమికుల రోజు ఉత్సవాన్ని జరుపుకుంటారు. రకరకాల బహుమతులు, పువ్వులు, గ్రీటింగ్ కార్డులు, విందులు, వినోదాలతో తమ ప్రేమను తెలియజేస్తుంటారు.

ఏ దేశంలో ఎలా....?

- ఫిన్లాండ్‌లో ఈ రోజుని స్నేహితుల దినోత్సవంలా జరుపుకుంటారు. స్నేహితులను ప్రత్యేకంగా అభినందిస్తూ వారంటే తమకు ఎంత ఇష్టమో తెలియజేస్తూ రకరకాల బహుమతులు, బొకేలు ఇచ్చుకుంటారు.
- జపాన్‌లో మహిళలు తమ భాగస్వాములకు చాక్లెట్లు, ఆభరణాలు బహుమతిగా ఇస్తారు. జంటగా తమకు ఇష్టమైన ప్రదేశాలకు వెళతారు. ఒక నెల తరవాత అంటే మార్చి 14న బహుమతి పొందిన పురుషులంతా వైట్ డే ఉత్సవాన్ని జరుపుకుంటారు. ఈ రోజున వీరు తమ భార్యలకు బహుమతులు, నగలు ఇస్తారు.
- డెన్మార్క్, నార్వే దేశాల్లో ప్రేమికులు మాత్రమే కాదు...... స్నేహితులు, కుటుంబ సభ్యులు అందరూ బహుమతులు ఇచ్చి పుచ్చుకుంటారు. అందరూ కలిసి రకరకాల ఆటలు ఆడుకుంటారు. పేరు తెలియకుండా తమకు ఇష్టమైనవారికి బహుమతి పంపుతారు. ఇది అందుకున్నవారు ఎవరు పంపారో చెప్పాలి. లేదంటే వచ్చే ఏడాదికి ఒక బహుమతి బాకీ ఉన్నట్లు భావిస్తారు.
- ఇంగ్లాండ్‌లో పిల్లలంతా కలిసి స్వీట్స్, పండ్లు, వాలెంటైన్ బన్స్ పంచుకుంటారు.
- జర్మనీలో ప్రేమ, శృంగారం రెంటినీ సూచించేలా పంది బొమ్మలతో కూడిన బహుమతులు ఇచ్చుకుంటారు.
- ఫిలిప్పీన్స్‌లో సామూహిక వివాహాలు జరుపుతారు. వందలాది జంటలను కలుపుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహిస్తుంది
- దక్షిణాఫ్రికాలో ఫిబ్రవరి 15న వాలెంటైన్స్ డేను జరుపుకుంటారు. ఇక్కడి మహిళలు తమ ప్రేమికుని పేరుని ధైర్యంగా దుస్తులకు పిన్ చేసుకుంటారు.
- తైవాన్‌లో ప్రేమికులు పువ్వులను ఇచ్చుకుంటారు. ఇక్కడి పురుషులు 108 ఎర్ర గులాబీలతో కూడిన పెద్ద గుత్తిని తమ ప్రేమికురాలికి పంపుతారు.
- దక్షిణ కొరియాలో జంటలు చాక్లెట్లు, బహుమతులు ఇచ్చుకుంటారు. జపాన్‌లోలాగే మార్చి 14న వైట్ డే జరుపుకుంటారు. ఏప్రిల్ 14న తాము సింగిల్‌గా ఉన్నామని సూచిస్తూ బ్లాక్ డే వేడుకలు చేసుకుంటారు. ఈ రోజున నల్ల బీన్ సాస్‌తో ఉన్న నూడుల్స్ తింటారు.

విజేత





ప్యాచీల బోటుతో పతకాలు పట్టింది

నాన్నతో కలిసి సరదాగా నదిలో వేటకు వెళ్లినప్పుడు ఆ చిన్నారికి తెలియదు... ఒక రోజు తాను జల క్రీడల్లో చాంపియన్ అవుతానని. తెడ్డు వేయడం... వల విసరడం... చేపలను ఒడిసి పట్టుకోవడం... ఒక్కొక్కటీ నేర్చుకుంది. ఈత మొదలు ఇంజిన్ బోటు మరమ్మతుల వరకు అన్నీ తెలుసుకుంది. వాటర్ స్పోర్ట్స్‌లోకి అడుగుపెట్టి... నేడు జాతీయ క్రీడల్లో కనోయి స్లాలోం ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించింది. మత్స్యకార కుటుంబం నుంచి వచ్చి... అద్భుత ప్రతిభతో దూసుకుపోతున్న నాగిడి గాయత్రి... 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

"కృష్ణా జిల్లా నాగాయిలంక మా స్వగ్రామం. నాన్న నాగబాబు, అమ్మ వెంకట నాగేశ్వరమ్మకు నేను రెండో సంతానం. నాన్న చేపల వేటపైనే మేము బతికేది. నాన్న నదిలోకి వేటకు వెళ్లేప్పుడు నన్ను తీసుకెళ్లమని చిన్నతనంలో మారం చేసేదాన్ని. నా పోరు పడలేక నాన్న నన్ను వెంటబెట్టుకుని వెళ్లేవాడు. అలా ఈత దగ్గర నుంచి నదిలో తెడ్డు వేయడం, ఒడుపుగా పడవ నడపడం, వల, లంగర్ వేయడం, చేపలు పట్టడం, ఇలా ఒక మత్స్యకారుడికి కావాల్సిన మెళకువలన్ని ఒక్కొక్కటి అవపోశన పట్టాను. ఒక విధంగా నాన్నే నా తొలి గురువు. ఒక పక్క చదువుకుంటూనే బడిలేని రోజుల్లో నాన్నతో కలిసి చేపల వేటకు వెళుతుండేదాన్ని. హైస్కూల్‌లో చదువుతున్నప్పుడు అన్ని క్రీడల్లో పాల్గొన్నాను. మండల, జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పలు పతకాలు కూడా సాధించా. ఆ సమయంలో మా కుటుంబానికి తెలిసిన ఒక కరాటే మాస్టారు ద్వారా ఆ క్రీడపై ఆసక్తి కలిగింది. కరాటేలో జాతీయ స్కూల్ గేమ్స్ జూనియర్ విభాగంలో స్వర్ణం పతకం కూడా సాధించా.

మలుపు తిప్పిన సంబరాలు...

2017లో నా జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఆ ఏడాది మా ఊళ్లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా వాటర్ స్పోర్ట్స్ (కనోయింగ్ కయాకింగ్) నిర్వహించారు. ఈ పోటీల్లో అంతకుముందు నేను చూడని బోట్లు కృష్ణా నది బ్యాక్ వాటర్‌లో దూసుకెళ్లాయి. ఆ బోట్లు, క్రీడాకారుల శైలి నన్ను ఆకర్షించాయి. పోటీలు నిర్వహించిన బలరామ్ నాయుడు సార్‌ను కలిసి వాటర్ స్పోర్ట్స్ గురించి తెలుసుకున్నా. కేరళ మాదిరి మా దగ్గరున్న వాతావరణం వాటర్ స్పోర్ట్స్‌కు బాగుంటుందని వాటర్ స్పోర్ట్స్ నిపుణుడు సాంబశివారెడ్డి సార్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అకాడమీ పెట్టడానికి సాధ్యసాధ్యాలను పరిశీలించడానికి ప్రభుత్వ బృందం వచ్చినప్పుడు మా పడవలోనే నాన్న, నేను వారికి నది మొత్తం తిప్పి చూపించాం. స్థానిక ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ గారి చొరవతో 2018లో అక్కడ 'శాప్' వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేసింది.

అమ్మానాన్నల ప్రోత్సాహంతో...

అమ్మానాన్నల ప్రోత్సాహంతో వెంటనే అకాడమీలో చేరా. కోచ్‌లు నాగబాబు, శ్రీనివాస్ అప్పటివరకు మేము నేర్చుకున్న విద్యకంటే విభిన్నంగా ప్రొఫెషనల్ కోచింగ్ ఇవ్వడం ఆరంభించారు. అకాడమీలో మూడు బోట్లు ఉండగా మేము 30 మంది పిల్లలం ఉండేవాళ్లం. ఒకరి తర్వాత ఒకరు నేర్చుకునేవాళ్లం. ఆ సమయంలోనే 2019లో స్పోర్ట్స్ కోటాలో విజయనగరం జిల్లా గరివిడి వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాలలో డిప్లమో కోర్సులో సీటు వచ్చింది. ఈ కోర్సు చేస్తూనే శిక్షణ కొనసాగించి రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటా. నాన్న ఒక్కడి కష్టంపైన కుటుంబం మొత్తం బతకాలి. ఈ క్రమంలో చదువు పూర్తి చేసి ఏదైన ఉద్యోగం చేసి నాన్నకు అండగా ఉండాలా? లేదా వాటర్ స్పోర్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకుని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలా? అనే ప్రశ్నలు ఉత్పన్నమైనప్పుడు, అమ్మానాన్న నాకు వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ ఇప్పిస్తామని అన్నారు.

డబ్బులు లేక...

గతేడాది థాయ్‌లాండ్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్, అంతర్జాతీయ వాటర్ వరల్డ్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించి, అందులో పాల్గొనే అవకాశం వచ్చింది. థాయ్‌లాండ్ వెళ్లడానికి రూ.1.80 లక్షలు కావాల్సి వచ్చింది. డబ్బులు లేక అవస్థలు పడుతుంటే.. బాపట్లలో ప్రస్తుతం నేను చదువుతున్న వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ కళాశాల కరస్పాండెంట్ బుచ్చియ్య చౌదరి సహాయం చేశారు. ఆయన సహకారంతో అక్కడికి వెళ్లాను కానీ, పతకాలు సాధించలేకపోయా. అయితే అక్కడి వాతావరణ పరిస్థితులు, నీటి ప్రవాహం తీరు, అంతర్జాతీయ స్థాయిలో పోటీ ఏ స్థాయిలో ఉంటుందో ఒక అవగాహన వచ్చింది. ఇక్కడలా నదీ జలాల్లో అక్కడ పోటీలు నిర్వహించడం లేదు. కృత్రిమ సరస్సు, అందులో కృత్రిమ అలలు సృష్టించి పోటీలు నిర్వహించడంతో నాకు కొత్తగా అనిపించి, అర్థం చేసుకోలేకపోయా.



> **నాన్న అప్పులు చేసి...**
>
> **దూ**ర ప్రాంతాల్లో జరుగుతున్న పోటీల్లో పాల్గొనేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడ్డ సందర్భాలు అనేకం. నాన్న అప్పులు చేసి ఆ సమయానికి ఏదో విధంగా నన్ను పంపేవాడు. నాకు తొలిసారిగా 2022 గుజరాత్ నేషనల్ గేమ్స్‌లో పాల్గొనే అవకాశం లభించింది. అక్కడి వాతావరణం, నీటి ప్రవాహాన్నీ పూర్తిగా అంచనా వేయలేకపోవడంతో నాలుగో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తరువాత మరింత కసిగా శ్రమించాను. అదే ఏడాది చండీగఢ్‌లో జరిగిన జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం, మధ్యప్రదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ కనోయి స్లాలోంలో, ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో కాంస్య పతకాలు నెగ్గడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. మరుసటి ఏడాది గోవాలో జరిగిన నేషనల్ గేమ్స్‌కు అర్హత సాధించా. అక్కడ రజత పతకం సాధించాను. దాంతో నా శక్తి సామర్థ్యాలపై నాకొక గురి కుదిరింది.

కోచ్‌లు లేకుండానే శిక్షణ...

2019లో ప్రభుత్వం మారాక మా ఊళ్లోని అకాడమీ మూత పడింది. అకాడమీ భవనం కూడా ఇప్పటికీ పూర్తికాలేదు. కోచ్‌లు లేకుండానే అక్కడున్న మూడు బోట్లతో మేమే సాధన చేసుకునేవాళ్లం. మా వెనుక ఇంట్లో పెద్దవాళ్లు తోడుగా వచ్చేవాళ్లు. సరైన సదుపాయాలు, శిక్షణ లేకపోవడంతో ఒక దశలో డీలా పడ్డా. ఆ తరుణంలో కొందరు క్రీడాకారులు తేజ, గిరిబాబు, చిన్నబాబు ప్రోత్సాహంతో శిక్షణకు మధ్యప్రదేశ్ వెళ్లా. అక్కడ జాతీయ కోచ్ కులదీప్ సార్ శిక్షణలో మరింత నైపుణ్యం సంపాదించాను.

తడి బట్టలతోనే..

రెండుసార్లు జాతీయ క్రీడల్లో పాల్గొన్నా పసిడి పతకం సాధించలేకపోయాననే బాధ నాలో ఎక్కువైంది. ఉత్తరాఖండ్‌లో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ క్రీడలకు రెండు వారాలు ముందుగానే వెళ్లాను. పోటీలు జరిగే ప్రాంతానికి 10 కిలోమీటర్ల దూరంలో కానీ గదులు అద్దెకు దొరకలేదు. రోజూ ఆ కొండల మధ్యలోనే అంత దూరం ప్రయాణించి మా వంట మేమే చేసుకుంటూ సాధన చేశాను. ఎండ ఎక్కువ కాస్తే మంచు పర్వతాలు కరిగి ఉన్నఫలంగా నదిలో నీరు పెరిగేది. నీళ్లు చల్లగా ఉండడంతో పాటు ప్రవాహం వేగంగా ఉండేది. వీటన్నింటిపై ఒక అంచనాకు వచ్చా. గత రెండు జాతీయ క్రీడల్లో నేను ఓడిపోవడానికి ఒక కారణం మంచి బోటు లేకపోవడం కూడా. ఈసారీ అదే సమస్య. అయినా పతకం గెలవాలనే సంకల్పం. నాది ప్యాచీలు, రిపేర్లు చేసిన సాధారణ ఫైబర్ బోటు. ప్రత్యర్థులేమో అధునాతన కార్బన్ బోట్లు వేసుకొని సాధన చేస్తున్నారు. నా బోటు బరువు 27 కిలోలు ఉంటే వారి బోట్ల బరువు 13 కిలోలే. వారివి తేలికైన బోట్లు. నేను వేసుకునే బట్టలు ఒక్కసారి నీళ్లు పడితే ముద్దముద్దగా తడిసిపోయే సాధారణ దుస్తులు. వారివి శరీరమంతా తడవకుండా ఉండే ప్రత్యేకమైన సూట్లు. ఇవన్నీ నాకు పోటీలో ప్రతికూలాంశాలు. ఎలాగైనా ఈసారి స్వర్ణం సాధించాలనే పట్టుదల. నాన్నతో చెబితే 'అవన్నీ లేకుండానే నువ్వు ఇప్పటివరకు ఇన్ని పతకాలు సాధించావు. నీలో స్వర్ణం సాధించే సత్తా ఉంది' అంటూ మనోధైర్యం నింపారు. ఇప్పటివరకు కనోయి స్లాలోం ఈవెంట్‌లో స్వర్ణం మధ్యప్రదేశ్ రాష్ట్రాన్ని దాటి వేరే రాష్ట్రానికి పోలేదు. అంతటి పోటీని తట్టుకొని తొలిసారి నేను ఆంధ్రప్రదేశ్‌కు ఈ పతకాన్ని అందించా.

ఈ విజయం నాలో కొండంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. వచ్చే ఆసియా క్రీడలు, ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే నా ముందున్న లక్ష్యం. నాకు కావాల్సింది మంచి బోట్లు, దుస్తులు, జర్మనీ వంటి దేశాల్లో ప్రత్యేక శిక్షణ. రాష్ట్ర ప్రభుత్వం సాయం చేస్తే దేశం గర్వించే స్థాయికి ఎదుగుతా."

• ఎస్.ఎస్.బి.సంజయ్

కౌన్సెలింగ్

అందుకు ఒత్తిడి కారణమా?



డాక్టర్! నాకు ఒత్తిడి ఎక్కువ. ఆయనకు శారీరకంగా దగ్గరయ్యే సమయంలో అకస్మాత్తుగా ఆసక్తి సన్నగిల్లుతోంది. ఒత్తిడి తగ్గి, అందరిలా లైంగిక తృప్తి పొందే మార్గం సూచించండి?

- ఓ సోదరి, హైదరాబాద్

ముందు మీ ఒత్తిడికి చికిత్స తీసుకోవాలి. రోజు మొత్తంలో మీరు ఏ ఏ సమయాల్లో, ఏ పనులు చేసేటప్పుడు ఒత్తిడికి గురవుతున్నారో ఒక డైరీలో రాసుకోండి. ఇలా వారం పాటు రాస్తే ఒత్తిడికి అసలు కారణం తెలిసిపోతుంది. ఇలా రాసుకోవడం ద్వారా...ఉదయం నిద్ర లేచినప్పుడు, లేదా పడుకోబోయే ముందు, లేదా లైంగిక క్రీడకు ముందు... ఇలా ఏదో ఒక ఒత్తిడి క్రమం తెలుస్తుంది. ఆ క్రమాన్ని బట్టి కారణం ఏదో కూడా అర్థమవుతుంది. అలా తెలుసుకున్న ఒత్తిడి కారకాన్ని అదుపు చేసుకుంటే, ఒత్తిడి దానంతటదే అదుపులోకొస్తుంది. ఒక్కసారి ఒత్తిడి చేతిలో ఇరుక్కుంటే మీ జీవనశైలి, లైంగిక జీవితం రెండూ ప్రభావితమై, లైంగికాసక్తి పూర్తిగా సన్నగిల్లుతుంది. కాబట్టి మీ వారితో మాట్లాడి, లైంగికంగా దగ్గరయ్యే సమయంలో ఒత్తిడిని కలిగించే అంశాలకు దూరంగా ఉండే ప్రయత్నం చేయండి. అలా ఒత్తిడికి దూరంగా కాగలిగితే, ఒత్తిడి నుంచి తప్పించుకోగలిగే మెలకువలు కూడా మీకు అలవడతాయి. వాటిని అనుసరించి ఒత్తిడిని, దాని కారణంగా వస్తున్న అసంతృప్తినీ తేలికగా జయించవచ్చు. అలాగే మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం కోసం యోగా, ధ్యానం కూడా సాధన చేయవచ్చు.

- డాక్టర్ షర్మిలా మజుందార్,
చీఫ్ సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్,
హైదరాబాద్.

ఉప్పు ఇన్ని రకాలా?

వంటకాల తయారీకి ఉప్పు అత్యవసరం. రంగు, రుచి, ఆకారాన్ని అనుసరించి ఉప్పు ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఉప్పులో ఎన్ని రకాలు ఉన్నాయో తెలుసుకుందాం..!



టేబుల్ సాల్ట్ : ఇది మనం ప్రతిరోజూ వంటల్లో ఉపయోగించే సాధారణ ఉప్పు. సముద్రపు ఉప్పుని శుద్ధి చేసి దీనిని తయారు చేస్తారు. ఇందులో ఉండే అయోడిన్ థైరాయిడ్ పనితీరుని మెరుగుపరుస్తుంది.

సీ సాల్ట్ : సముద్రపు నీటిని ఆవిరి చేసి దీనిని ఉత్పత్తి చేస్తారు. ఇది చిన్న స్ఫటికాల మాదిరి మెరుస్తూ ఉంటుంది. ఇందులో ఆరోగ్యానికి ఉపకరించే మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం, జింక్, ఇనుము లాంటి ఖనిజాలు ఉంటాయి.

హిమాలయన్ పింక్ సాల్ట్ : ఇది హిమాలయ పర్వతాల్లో దొరుకుతుంది. దీనిని అత్యంత పరిశుభ్రమైన ఉప్పుగా పరిగణిస్తారు. ఇది ముతకగా కనిపిస్తూ ప్రత్యేకమైన రుచితో ఉంటుంది. ఇందులో సోడియం చాలా తక్కువ. వంటల్లో వాడడంవల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. శరీరంలో పీహెచ్ స్థాయి సమతౌల్యంలో ఉంటుంది. టాక్సిన్లు విసర్జితమవుతాయి. పోషకాలను శోషించుకునే శక్తి పెరుగుతుంది.

కోషెర్ సాల్ట్ : దీనిని కిచెన్ సాల్ట్ అని కూడా అంటారు. ఇది తెల్లగా చిన్న రాళ్ల మాదిరి ఉంటుంది. ఇందులో అయోడిన్ ఉండదు. దీనిని ఎక్కువగా మసాలా గ్రేవీలు, మాంసాహార కూరల తయారీలో ఉపయోగిస్తూ ఉంటారు.

బ్లాక్ సాల్ట్: ఇది లేత గులాబీ రంగులో ప్రత్యేకమైన రుచితో ఉంటుంది. ఇందులో సల్ఫర్ సహా పలు పోషకాలు ఉంటాయి. అందరూ ఇష్టపడే పానీపూరీ నీళ్లలో దీనినే కలుపుతారు. ఇది జీర్ణక్రియని వేగవంతం చేస్తుంది.

సైంధవ లవణం: సముద్రపు నీటిని ఆవిరి చేసినప్పుడు ఏర్పడే లేత ఎరుపు రంగు స్ఫటికాలను సైంధవ లవణంగా పరిగణిస్తారు. ఇందులో అయోడిన్ తక్కువ. ఎలక్ట్రొలైట్స్, న్యూట్రియెంట్స్ ఎక్కువ. దీనిని ఆయుర్వేద మందుల తయారీలో ఉపయోగిస్తారు.

పిల్లల షూ క్లీనింగ్ ఇలా...

పిల్లలు పాఠశాలకు వెళ్లేటప్పుడు వేసుకునే షూలను కనీసం రెండు రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని నిపుణులు చెబుతున్నారు. తక్కువ సమయంలో షూలను ఎలా క్లీన్ చేయాలో తెలుసుకుందాం!



- షూలను ముందుగా పాత టూత్‌బ్రష్‌తో రుద్దుతూ వాటికి అంటిన మట్టిని తొలగించాలి. లోపల ఉండే సోల్‌ని తీసి షూని బాగా దులపాలి.
- డిటర్జెంట్, సర్ఫ్, షాంపూ కలిపిన నీళ్లలో పలుచని గుడ్డని ముంచి పిండాలి. దీనితో షూ లోపల, బయటా తుడవాలి. ఒక ట్రేలో ఈ నీళ్లు కొన్ని పోసి అందులో షూ అడుగు భాగం మునిగేలా ఉంచాలి. అయిదు నిమిషాల తరవాత మంచినీళ్లతో కడగాలి.
- టూత్ బ్రష్‌ను కొద్దిగా సర్ఫ్ లేదా షాంపూలో ముంచి దానితో తెలుపు రంగు షూల పై భాగాన్ని రుద్దాలి. మురికి మొత్తం వదిలాక కొన్ని నీళ్లు చిలకరిస్తూ పలుచని గుడ్డతో తుడవాలి.
- షూలను శుభ్రం చేసిన తరవాత వాటి లోపల కాగితం ఉండలను లేదా పలుచని తువాలును గుండ్రంగా మడిచి ఉంచాలి. లోపలి భాగంలోని తడిని ఇవి పీల్చుకుంటాయి. అయిదు నిమిషాల తరవాత వీటిని తీసివేసి షూలకు బాగా గాలి తగిలేలా ఉంచి ఆరనివ్వాలి.
- షూ లేసులను, సోల్‌ని సబ్బునీటిలో ముంచి పది నిముషాలు నాననివ్వాలి. తరవాత మంచి నీళ్లలో ముంచి తీసి గాలికి ఆరబెట్టాలి.
- నైలాన్, కాటన్, పాలిస్టర్ పదార్థాలతో తయారైన కాన్వాస్ షూలను ముందుగా పైపైన శుభ్రం చేసి తరవాత పాత తువాలులో చుట్టి వాషింగ్ మెషిన్‌లో వేయవచ్చు.
- లెదర్, రబ్బర్, వినైల్ షూలను మాత్రం చేతితో క్లీన్ చేసుకోవాలి.
- షూలను శుభ్రం చేయడానికి గోరువెచ్చని నీటిని ఉపయోగించవచ్చు. బ్లీచ్, ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్‌లను వాడకూడదు.
- ప్రతిరోజూ పలుచని పొడి గుడ్డతో పైపైన తుడిచి పాలిష్ చేసుకుంటూ ఉంటే షూలు కొత్తవాటిలా మెరుస్తాయి.

స్పోర్ట్స్

విజయవాడ ● గురువారం 13 ఫిబ్రవరి 2025

'ముక్కోణం' ఫైనల్లో పాక్

కరాచీ: సల్మాన్ అఘా (134), రిజ్వాన్ (122 నాటౌట్) శతకాల మోతతో.. పాకిస్థాన్ ముక్కోణపు సిరీస్ ఫైనల్‌కు చేరుకొంది. తొలుత దక్షిణాఫ్రికా 352/5 స్కోరు చేసింది. క్లాసెన్ (87), మాథ్యూ బ్రీట్జ్‌కే (83), బవుమా (82) రాణించారు. లక్ష్యాన్ని పాక్ 49 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వన్డేల్లో పాక్‌కిదే అత్యధిక ఛేదన. రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన సఫారీలు టోర్నీ నుంచి నిష్క్రమించారు. శుక్రవారం జరిగే ఫైనల్లో పాక్-కివీస్ తలపడతాయి.



రిస్క్ తీసుకోకూడదనే..

» 'చాంపియన్స్' జట్టు నుంచి బుమ్రా అవుట్

» కోలుకున్నా.. బౌలింగ్ చేయలేని పరిస్థితి



న్యూఢిల్లీ: ఊహించినదే జరిగింది. భారత జట్టు పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ చివరి టెస్ట్ సందర్భంగా బుమ్రా వెన్ను గాయానికి లోనైన సంగతి తెలిసిందే. దాంతో ఆస్ట్రేలియా పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత నుంచి అతడు బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పునరావాసం పొందుతున్నాడు. ఐదు వారాల పునరావాసం తర్వాత బుమ్రాకు స్కానింగ్ చేశారు. అందులో బాగానే ఉన్నట్టు తేలింది. కానీ చాంపియన్స్ ట్రోఫీ నాటికి బౌలింగ్ చేసే స్థాయికి అతడు ఫిట్‌నెస్ సంతరించుకున్నాడా..లేదా..అన్నది కచ్చితంగా తేల్చలేకపోయారు. దాంతో రిస్క్ తీసుకోకూడదని చీఫ్ సెలెక్టర్ అగార్కర్ నిర్ణయించాడు. ఫలితంగా చాంపియన్స్ ట్రోఫీ ప్రాథమిక జట్టు నుంచి బుమ్రాను తొలగించారు. అతడి స్థానంలో మరో పేసర్ హర్షిత్ రాణాకు చోటు కల్పించారు. అలాగే తొలుత ప్రకటించిన జట్టులో ఉన్న జైస్వాల్‌ను తప్పించారు. అతడికి బదులు మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఎంపిక చేశారు. చాంపియన్స్ ట్రోఫీలో భారత్ తన తొలి మ్యాచ్‌ను ఈనెల 20న దుబాయ్‌లో బంగ్లాదేశ్‌తో ఆడనుంది. ఇక జట్టులో కెప్టెన్ రోహిత్‌తోపాటు వైస్ కెప్టెన్ గిల్, కోహ్లీ, శ్రేయాస్, రాహుల్, పంత్, హార్దిక్, అక్షర్, వాషింగ్టన్, కుల్దీప్, హర్షిత్, షమి, అర్ష్‌దీప్, జడేజా, వరుణ్ చక్రవర్తి ఉన్నారు.

పునరాగమనం ఎప్పుడు?

బుమ్రా పోటీ క్రికెట్‌లోకి మళ్లీ ఎప్పుడు అడుగుపెడతాడనేది ప్రశ్న. చాంపియన్స్ ట్రోఫీకి దూరమవడంతో మరికొన్ని వారాలు అతడు ఎన్‌సీఏలోనే పునరావాసంలో ఉంటాడని సమాచారం. ఇక..ఐపీఎల్ వచ్చేనెల 21న ప్రారంభం కానుంది. ఆ టోర్నీలో బౌలింగ్ చేసే స్థాయికి సిద్ధమయ్యేలా అతడు ఎన్‌సీఏలో కొనసాగనున్నట్టు తెలిసింది. ఐపీఎల్‌లో బౌలింగ్ చేయడం ద్వారా..జూన్‌లో ఇంగ్లండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌కు బుమ్రాను సిద్ధం చేయాలనేది ప్రణాళిక.



జిమ్నాస్ట్ నిషికకు స్వర్ణం

నిఖిల్ కాంస్య పట్టు » జాతీయ క్రీడలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ జిమ్నాస్ట్ నిషిక అగర్వాల్ జాతీయ క్రీడల్లో సంచలనం సృష్టించింది. ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ టేబుల్ వాల్ట్ పోటీల్లో టోక్యో ఒలింపియన్ ప్రణతి నాయక్ (ఒడిశా)ను ఓడించి స్వర్ణం కైవసం చేసుకుంది. డెహ్రాడూన్‌లో బుధవారం జరిగిన ఈ పోటీల్లో నిషిక 12.717 స్కోరుతో విజేతగా నిలిచింది. ప్రణతి (12.700) రజతం అందుకుంది. రెజ్లింగ్‌లో హైదరాబాదీ నిఖిల్ యాదవ్ కంచు పట్టు పట్టాడు. 65 కిలోల కాంస్య పతక పోరులో నిఖిల్ 12-2తో మహేష్ (కర్ణాటక)పై గెలిచి కాంస్యం నెగ్గాడు.

అసలంక శతకం.. లంక విజయం

కొలంబో: కెప్టెన్ అసలంక (127) శతకంతో కదం తొక్కడంతో బుధవారం జరిగిన తొలి వన్డేలో శ్రీలంక 49 పరుగులతో ఆస్ట్రేలియాని ఓడించింది. మొదట ఆతిథ్య జట్టు 46 ఓవర్లలో 214 పరుగులకే కుప్పకూలింది. ఛేదనలో స్పిన్నర్ తీక్షణ (4/40) దెబ్బకు ఆసీస్ 33.5 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌటైంది.


క్వార్టర్స్‌కు భారత్

కింగ్డావో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్ గ్రూప్-డిలో తమ తొలి మ్యాచ్‌లో భారత్ 5-0తో మకావు జట్టును ఓడించింది. ఈ గెలుపుతో భారత్ తన గ్రూప్ నుంచి క్వార్టర్‌ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. తొలుత మిక్స్‌డ్‌లో సతీశ్/ఆద్య జోడీ 21-10, 21-9తో లియోంగ్/వెంగ్‌పై నెగ్గగా, పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-16, 21-12తో పంగ్ ఫాంగ్‌పై, మహిళల సింగిల్స్‌లో మాళవిక 21-15, 21-9తో హావో వాయిపై గెలిచారు. పురుషుల డబుల్స్‌లో చిరాగ్/అర్జున్ జంట 21-15, 21-19తో చిన్ పాన్/కొక్ వెన్‌ను, చివరిగా మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 21-10, 21-5తో ఎన్ వెంగ్ చి/హూయి చి వానును ఓడించడంతో భారత్ తిరుగులేని ఆధిక్యంతో క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. ఇక గ్రూప్‌లో తనకు చివరిదైన రెండో మ్యాచ్‌ను భారత్ గురువారం కొరియాతో ఆడనుంది. దీంతో ఈ గ్రూప్ టాపర్ ఎవరనేది తేలుతుంది. కొరియా ఇప్పటికే మకావును ఓడించింది.

రంజీ సెమీఫైనల్లో కేరళ

పుణె: కేరళ లోయరార్డర్ బ్యాటర్లు అజరుద్దీన్ (67 నాటౌట్), సల్మాన్ (44 బ్యాటింగ్) అద్భుతంగా ఆడి 43 ఓవర్లపాటు కశ్మీర్ బౌలర్లను ఎదుర్కొన్నారు. ఫలితంగా ఇరుజట్ల మధ్య రంజీ క్వార్టర్స్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. అయితే తొలిఇన్నింగ్స్‌లో లభించిన ఏకైక పరుగు ఆధిక్యంతో కేరళ సెమీస్ చేరింది. 399 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 110/2తో బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కేరళ 295/6 స్కోరుతో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో జమ్మూ 280, కేరళ 281 రన్స్ చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో జమ్మూ 399/9 (డిక్లేర్) స్కోరు చేసింది.





శతకంతో సత్తాచాటిన ఓపెనర్

గిల్ సూపర్

● రాణించిన కోహ్లీ, అయ్యర్
● 142 పరుగులతో విజయం
● మూడో వన్డేలోనూ ఇంగ్లండ్ చిత్తు
● 3-0తో సిరీస్ భారత్ వశం

అహ్మదాబాద్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత్.. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. శుభ్‌మన్ గిల్ (102 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సలతో 112) సెంచరీతో చెలరేగడంతో.. బుధవారం ఏకపక్షంగా సాగిన మూడో, ఆఖరి వన్డేలో భారత్ 142 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. తొలుత భారత్ 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌటైంది. కోహ్లీ (55 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 52), శ్రేయాస్ అయ్యర్ (64 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 78), రాహుల్ (40) రాణించారు. రషీద్ నాలుగు, మార్క్ ఉడ్ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఇంగ్లండ్ 34.2 ఓవర్లలో 214 పరుగులకు కుప్పకూలింది. అట్కిన్సన్ (38), బాంటన్ (38) టాప్ స్కోరర్లు. అక్షర్, అర్ష్‌దీప్, హర్షిత్, హార్దిక్ తలో 2 వికెట్లు దక్కించుకొన్నారు. చాంపియన్స్ ట్రోఫీకి ముందు రోహిత్, కోహ్లీ టచ్‌లోకి రాగా.. తన ఎంపికను ప్రశ్నిస్తున్న వారికి గిల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'తో సమాధానమిచ్చాడు.

పోరాటమే లేకుండా..: భారీ లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు ఓపెనర్లు సాల్ట్ (23), డకెట్ (34) దూకుడైన ఆరంభాన్నిచ్చినా.. భారత స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఇంగ్లండ్ బ్యాటర్లు మరోసారి చేతులెత్తేశారు. ఈ దశలో బాంటమ్‌కి జతకలసిన రూట్ (24) జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. దీంతో 15వ ఓవర్లో ఇంగ్లండ్ వంద పరుగులు దాటింది. అయితే, సిక్స్‌తో గేర్ మార్చే ప్రయత్నం చేస్తున్న బాంటన్‌ను కుల్దీప్ బోల్తాకొట్టించాడు. 21వ ఓవర్లో రూట్‌ను అక్షర్ బౌల్డ్ చేయడంతో.. ఇంగ్లండ్ 136/4తో కష్టాల్లో పడింది. బట్లర్ (6), బ్రూక్ (19)ను హర్షిత్ పెవిలియన్ చేర్చడంతో.. మ్యాచ్ భారత్‌వైపు మొగ్గింది. అట్కిన్సన్ కొంత ప్రతిఘటించినా.. లివింగ్‌స్టోన్ (9), రషీద్ (0), ఉడ్ (9) అలా వచ్చి ఇలా వెళ్లారు.

బ్యాటర్లు భళా..: ఓపెనర్ గిల్ సూపర్ సెంచరీతో భారీ స్కోరుకు బాటలు వేయగా.. ఫామ్ కోసం తంటాలు పడుతున్న విరాట్ కోహ్లీ హాఫ్ సెంచరీతో టచ్‌లోకి రావడం అభిమానులకు ఊరటనిచ్చింది. ఇక, జోరుమీదున్న అయ్యర్ అదే తరహా దూకుడును ప్రదర్శించడంతో.. టీమిండియా సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. కోహ్లీతో కలసి రెండో వికెట్‌కు 116 పరుగులు జోడించిన గిల్.. అయ్యర్‌తో కలసి మూడో వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టిదెబ్బ తగిలింది. గత మ్యాచ్‌లో శతకంతో జోరుమీదున్న రోహిత్ (1)ను ఉడ్ క్యాచవుట్ చేశాడు. అయితే, గిల్ మాత్రం ఆరంభం నుంచే చక్కని స్ట్రోక్ ప్లేతో బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. మరోవైపు క్రీజులో కుదురుకొనేందుకు కొంత సమయం తీసుకొన్న విరాట్ ఆ తర్వాత బ్యాట్‌కు పనిచెప్పడంతో తొలి పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 52/1తో నిలిచింది. 17వ ఓవర్‌లో ఫోర్ కొట్టిన గిల్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. జట్టు స్కోరు సెంచరీ మార్క్ దాటింది. ఆ తర్వాతి ఓవర్‌లో లివింగ్‌స్టోన్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన విరాట్.. సింగిల్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్నాడు. అయితే, కోహ్లీని అద్భుతమైన బంతితో క్యాచవుట్ చేసిన రషీద్ జట్టుకు కావాల్సిన బ్రేక్ అందించాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన అయ్యర్ కూడా ధాటిగా ఆడడంతో రన్‌రేట్ ఎక్కడా తగ్గలేదు. దీంతో సగం ఓవర్లు ముగిసే సరికి టీమిండియా 161/2తో పటిష్ఠంగా కనిపించింది. క్రమంగా 90ల్లోకి అడుగుపెట్టిన గిల్.. ఉడ్ బౌలింగ్‌లో ఫోర్‌తో శతకం పూర్తి చేసుకొన్నాడు. అయితే, రషీద్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ ఆడే క్రమంలో బౌల్డ్ అయ్యాడు. ఆ సమయానికి భారత్ స్కోరు 35 ఓవర్లలో 228/3. ఇక రషీద్ బౌలింగ్‌లో లెగ్ సైడ్ పడిన బంతిని ఆడే క్రమంలో అయ్యర్ అనవసరంగా వికెట్ పారేసుకోవడంతో.. చివరి 10 ఓవర్లలో భారత్ ఆశించినంత వేగంగా స్కోరు చేయలేక పోయింది. రాహుల్‌ను మహమూద్, హార్దిక్ (17)ను రషీద్ అవుట్ చేశారు. అక్షర్ పటేల్ (13), సుందర్ (14), హర్షిత్ (13) భారీ షాట్లు ఆడే క్రమంలో పెవిలియన్ చేరారు.

1 ఒకే వేదికపై మూడు ఫార్మాట్లలోనూ శతకం బాదిన తొలి భారత ఆటగాడిగా గిల్. గతంలో ఇక్కడ టెస్టులు, టీ20ల్లోనూ గిల్ సెంచరీ చేశాడు.

వేగంగా 2500 పరుగుల మార్క్ చేరుకొన్న తొలి ప్లేయర్‌గా శుభ్‌మన్. 50 ఇన్నింగ్స్‌లోనే గిల్ ఈ ఫీట్ సాధించాడు. హషీమ్ ఆమ్లా (51), ఇమాముల్ హక్ (52), వివ్ రిచర్డ్స్ (56) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

2 పరుగుల పరంగా వన్డేల్లో ఇంగ్లండ్‌పై భారత్‌కిది రెండో అతిపెద్ద (142 రన్స్) విజయం. 2008లో రాజ్‌కోట్ వేదికగా 158 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను భారత్ ఓడించింది.

స్కోరు బోర్డు

భారత్: రోహిత్ (సి) సాల్ట్ (బి) ఉడ్ 1, గిల్ (బి) రషీద్ 112, కోహ్లీ (సి) సాల్ట్ (బి) రషీద్ 52, అయ్యర్ (సి) సాల్ట్ (బి) రషీద్ 78, రాహుల్ (ఎల్బీ) మహమూద్ 40, హార్దిక్ (బి) రషీద్ 17, అక్షర్ (సి) బాంటన్ (బి) రూట్ 13, సుందర్ (సి) బ్రూక్ (బి) ఉడ్ 14, హర్షిత్ (సి) బట్లర్ (బి) అట్కిన్సన్ 13, అర్ష్‌దీప్ (రనౌట్) 2, కుల్దీప్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 50 ఓవర్లలో 356 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-6, 2-122, 3-226, 4-259, 5-289, 6-307, 7-333, 8-353, 9-353, 10-356; **బౌలింగ్:** మహమూద్ 10-0-68-1, ఉడ్ 9-1-45-2, అట్కిన్సన్ 8-0-74-1, రూట్ 5-0-47-1, రషీద్ 10-0-64-4, లివింగ్‌స్టోన్ 8-0-57-0.

ఇంగ్లండ్: సాల్ట్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 23, డకెట్ (సి) రోహిత్ (బి) అర్ష్‌దీప్ 34, బాంటన్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 38, రూట్ (బి) అక్షర్ 24, బ్రూక్ (బి) హర్షిత్ 19, బట్లర్ (బి) హర్షిత్ 6, లివింగ్‌స్టోన్ (స్టంప్డ్) రాహుల్ (బి) సుందర్ 9, అట్కిన్సన్ (బి) అక్షర్ 38, రషీద్ (బి) హార్దిక్ 0, మార్క్ ఉడ్ (సి) అయ్యర్ (బి) హార్దిక్ 9, మహమూద్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 34.2 ఓవర్లలో 214 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-60, 2-80, 3-126, 4-134, 5-154, 6-161, 7-174, 8-175, 9-193. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 5-0-33-2, హర్షిత్ రాణా 5-1-31-2, సుందర్ 5-0-43-1, అక్షర్ 6.2-1-22-2, హార్దిక్ 5-0-38-2, కుల్దీప్ 8-0-38-1.

బిజినెస్

తగ్గిన నాట్కో ఫార్మా లాభం

ఒక్కో షేరుకు 75% మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాట్కో ఫార్మా.. డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికంలో రూ.132.40 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.212.70 కోట్లు)తో పోల్చితే లాభం 37.75 శాతం తగ్గింది. ఫార్ములేషన్స్ ఎగుమతులు తగ్గటం పనితీరుపై ప్రభావం చూపించిందని కంపెనీ పేర్కొంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.795.60 కోట్ల నుంచి రూ.651.10 కోట్లకు తగ్గింది. ఈ కాలంలో ఫార్ములేషన్స్ ఎగుమతులు రూ.605.60 కోట్ల నుంచి రూ.285.80 కోట్లకు తగ్గగా ఏపీఐ వ్యాపారం రూ.46.30 కోట్ల నుంచి రూ.66.60 కోట్లకు పెరిగినట్లు పేర్కొంది. దేశీయ ఫార్ములేషన్స్ వ్యాపారం కూడా రూ.99.40 కోట్ల నుంచి రూ.96.10 కోట్లకు తగ్గాయి. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ డైరెక్టర్ల బోర్డు మూడో సారి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.1.50 (75%) మధ్యంతర డివిడెండ్‌ను అందించనున్నట్లు తెలిపింది. డివిడెండ్ చెల్లింపునకు రికార్డు తేదీగా ఈ నెల 18ని ఖరారు చేయగా.. చెల్లింపులు 28వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు నాట్కో వెల్లడించింది.

సువెన్ ఫార్మా లాభంలో 53 % వృద్ధి

డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో సువెన్ ఫార్మా ఏకీకృత ప్రాతిపదికన రూ.322.86 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.83.29 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.46.75 కోట్లు)తో పోల్చితే లాభం 53.25 శాతం వృద్ధి చెందింది. ఈ కాలంలో ఆదాయం రూ.234.16 కోట్ల నుంచి రూ.322.86 కోట్లకు పెరిగింది.

స్టాండర్డ్ గ్లాస్ ఆదాయం 143 కోట్లు

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్)..కాగా డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 142.83 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.15.89 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కాగా డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు గాను రూ.454.93 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.52.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. కాగా అనుబంధ సంస్థ ఎస్2 ఇంజనీరింగ్ యూనిట్ 5 కార్యకలాపాలు ఫిబ్రవరి నెలాఖరు నాటికి ప్రారంభం కావచ్చని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు ఎగుమతుల కోసం అమెరికాలో ఏర్పాటు చేస్తున్న కొత్త అనుబంధ సంస్థ మార్చి త్రైమాసికం ముగిసే నాటికి పూర్తి కావచ్చని తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,670 ▼	79,400 ▼	1,07,000 ▲
విజయవాడ	87,500 ▼	80,500 ▼	97,000 ▼
విశాఖపట్నం	85,040 ▼	77,950 ▼	94,530 ▲
రాజమండ్రి	86,620 ▼	79,400 ▼	97,800 ▼
ప్రొద్దుటూరు	87,750 ▼	81,260 ▼	95,700 ▼
ముంబై	84,845 ▼	77,718 ▼	94,189 ▲

భాష, నిబంధనలు సరళం

కాలం చెల్లిపోయిన నిబంధనలకు తిలోదకాలు

నేడే పార్లమెంటు ముందుకు కొత్త ఐటీ చట్టం



ఆదాయపు పన్ను (ఐటీ) చెల్లింపుదారులను గందరగోళానికి గురి చేస్తున్న అసెస్‌మెంట్ సంవత్సరం, గత సంవత్సరం వంటి పదాలు ఇక తెరమరుగు కానున్నాయి. గురువారం పార్లమెంటులో ప్రతిపాదించబోతున్న కొత్త ఐటీ బిల్లులో ఆ పదాల స్థానంలో "ట్యాక్స్ సంవత్సరం" అనే పదం జోడించారు. ఏ సంవత్సరంలో అయినా ఏప్రిల్ 1 నుంచి తదుపరి సంవత్సరం మార్చి 31 వరకు విస్తరించి ఉండే 12 నెలల కాలాన్ని ఇక నుంచి "పన్ను సంవత్సరం"గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం ఐటీ చట్టంలో అసెస్‌మెంట్ సంవత్సరం (ఏవై), గత సంవత్సరం (పీవై) అనే పదాలున్నాయి. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వచ్చిన ఆదాయాన్ని 2025-26 అసెస్‌మెంట్ సంవత్సరంలో మదింపు చేసి పన్ను విధిస్తారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఐటీ చట్టం1961లో 298 సెక్షన్లు, 14 షెడ్యూల్స్ ఉండగా ప్రతిపాదిత కొత్త బిల్లు తగు మార్పులతో సరికొత్తగా రూపొందించిన 526 సెక్షన్లు, 23 అధ్యాయాలు, 16 షెడ్యూల్స్ కలిగి ఉంటుంది. మొత్తం పేజీల సంఖ్య 622. ప్రస్తుత చట్టంతో పోల్చితే పేజీల సంఖ్య సగం కన్నా తక్కువ ఉంటుంది. ఐటి చట్టం 1961ని రూపొందించినప్పుడు దానిలో 880 పేజీలున్నాయి.

భాష సరళతరం

అందరికి అర్థమయ్యే విధంగా కొత్త బిల్లులో భాషను సరళం చేశారు. పాత చట్టంలో ఉపయోగించిన భాషలోని పలు సంక్లిష్ట పదాలు, వాక్యాలు తొలగించారు. సుదీర్ఘమైన వాక్యాలను కుదించారు. అంతగా ఉపయోగంలో లేని, అనవసరమైనవిగా భావిస్తున్న సెక్షన్లను కూడా తొలగించారు. ఇందుకు ఉదాహరణ ఫ్రింజ్ బెనిఫిట్ ట్యాక్స్. తేలిగ్గా చదువుకోవడానికి, వివరించేందుకు వీలుగా "నిబంధనలు లేదా వివరణల"ను కూడా ఈ బిల్లులో తొలగించారు. ఐటీ చట్టం 1961లో నాట్‌విత్‌స్టాండింగ్ (అయినప్పటికీ) అనే పదం విరివిగా ఉపయోగంలో ఉంది. కొత్త బిల్లులో దాని స్థానంలో "ఇర్రెస్పెక్టివ్" అనే పదం ఉపయోగించారు. టీడీఎస్, ప్రిజంప్టివ్ టాక్సేషన్, వేతనాలు, మొండి బకాయిల మినహాయింపు వంటి అంశాల్లో నిబంధనల స్థానంలో పట్టికలు ప్రవేశపెట్టారు. అలాగే కొత్త బిల్లులో పొందుపరిచిన "పన్ను చెల్లింపుదారుల చార్టర్"లో వారికి గల హక్కులు, బాధ్యతలు వివరించారు. పన్ను వివాదాలు గణనీయంగా తగ్గించడం లక్ష్యంగా ఎంప్లాయీస్ స్టాక్ ఆప్షన్లపై (ఇసాప్) పన్నులో మరింత స్పష్టత ఇచ్చారు. చట్టం సరళతరం చేయడం లక్ష్యంగా మొత్తం ఆదాయంలో భాగంగా పరిగణించని ఆదాయాన్ని షెడ్యూల్స్‌లోకి మార్చారు.

2026 ఏప్రిల్ 1 నుంచి అమలు

లోక్‌సభలో గురువారం బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం అది ఆర్థిక వ్యవహారాల స్టాండింగ్ కమిటీ పరిశీలనకు వెళ్తుంది. స్టాండింగ్ కమిటీ సమూలంగా పరిశీలించి, పార్లమెంటు ఆమోదించిన అనంతరం కొత్త బిల్లు 2026 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తుంది. గత ఆరు దశాబ్దాల కాలంలో ఐటీ చట్టం 1961కి పలు సవరణలు జరిగాయని, ఫలితంగా చట్టంలో సరళత్వం లోపించి సంక్లిష్టంగా మారిందని కొత్త ఐటీ బిల్లు ప్రతిపాదించడానికి కారణాలను వివరించే ప్రకటనలో ప్రభుత్వం తెలిపింది. ఐటీ శాఖ అధికారులు, ప్రాక్టీషనర్లు, పన్ను చెల్లింపుదారులు సైతం వీటిపై ఆందోళన ప్రకటించడంతో ఐటీ చట్టం 1961ని సమగ్రంగా సమీక్షించనున్నట్టు 2024 జూలై బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించింది. తదుపరి సీబీడీటీ ఇంటర్నల్ కమిటీని నియమించింది. చట్టంలోని వివిధ అంశాలు పరిశీలించేందుకు మొత్తం 22 స్పెషలైజ్డ్ సబ్-కమిటీలు ఏర్పాటు చేశారు. భాష సరళీకరణ, లిటిగేషన్ల తగ్గింపు, కంప్లయెన్స్ భారం సడలింపు, కాలం చెల్లిపోయిను ఉపయోగంలో లేని నిబంధనల తొలగింపు అనే నాలుగు అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. వివిధ వర్గాల నుంచి 6500 వరకు సలహాలు అందాయి.

ఆదాయపు పన్ను బిల్లు 2025 ప్రధానాంశాలు

- ఈ బిల్లులో భాషను సరళీకరించడంతో పాటు అనవసరమైన నిబంధనలు తొలగించారు. వాక్యాలు కుదించారు.
- ఈ బిల్లు కొత్తగా ఎలాంటి పన్నులు విధించదు. ఆదాయపు పన్ను చట్టం 1961లోని పన్ను విధింపు నిబంధనలన్నింటినీ ఒక చోట చేరుస్తుంది.
- 622 పేజీలు గల ఈ కొత్త బిల్లులో మొత్తం 536 సెక్షన్లు, 23 అధ్యాయాలు, 16 షెడ్యూల్సు ఉన్నాయి. గతంలోని 1961 చట్టంలో 298 సెక్షన్లు, 23 అధ్యాయాలు, 14 షెడ్యూల్స్ ఉన్నాయి.
- 2026 ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త చట్టం అమలులోకి వస్తుంది. ఒకసారి చట్టాన్ని నోటిఫై చేసిన అనంతరం నిబంధనలు పొందుపరుస్తారు.
- కొత్తగా "పన్ను సంవత్సరం" అనే కాన్సెప్ట్ ప్రవేశపెట్టారు. పన్ను చెల్లింపుదారులను గందరగోళానికి గురి చేస్తున్న "గత సంవత్సరం", "అసెస్‌మెంట్ సంవత్సరం" వంటి సంక్లిష్ట పదాలను కొత్త బిల్లులో తొలగించారు.
- "అయినప్పటికీ" (నాట్‌విత్‌స్టాండింగ్) పదాన్ని తొలగించి దాని స్థానంలో "దానితో సంబంధం లేకుండా" (ఇర్రెస్పెక్టివ్) పదం చేర్చారు.
- "వివరణలు లేదా నిబంధనలు" పక్కన పెట్టి వాటికి బదులుగా పట్టికలు, సూత్రాలను పొందుపరిచారు.
- పన్ను చెల్లింపుదారులకు హక్కులు, బాధ్యతలను నిర్దేశించే పన్ను చెల్లింపుదారుల చార్టర్‌ను ఈ బిల్లులో కొత్తగా జోడించారు.
- మార్కెట్ అనుసంధానిత డిబెంచర్ల విషయంలో పెట్టుబడి లాభాలను మదింపు చేసే ప్రత్యేక నిబంధన పొందుపరిచారు.
- వేతనాలకు సంబంధించిన మినహాయింపులన్నీ గతంలో విభిన్న సెక్షన్లు/నిబంధనలు విస్తరించి ఉండగా కొత్త బిల్లులో అవన్నీ ఒకే చోట ఉండేలా చూశారు.

5 నెలల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం జనవరి నెలలో ఐదు నెలల కనిష్ఠ స్థాయి 4.31 శాతానికి దిగి వచ్చింది. కూరగాయలు, గుడ్లు, పప్పు దినుసుల ధరల్లో తగ్గుదల ఇందుకు దోహదపడింది. గత ఏడాది ఆగస్టులో నమోదైన కనిష్ఠ స్థాయి 3.65% కాగా ఆ తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే. డిసెంబరు నెలలో ద్రవ్యోల్బణం 5.22%గా ఉంది. డిసెంబరుతో పోల్చితే జనవరిలో ఇది 0.91% తగ్గింది. కాగా జనవరిలో ఆహార వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం 6.02% ఉంది. డిసెంబరుతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 5.76 శాతం నుంచి 4.64 శాతానికి దిగి వచ్చినట్లు ఎన్‌ఎస్‌ఓ తెలిపింది. ప్రధానంగా ఆహార ద్రవ్యోల్బణం 8.65 శాతం నుంచి 6.31 శాతానికి తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో ఆహార ద్రవ్యోల్బణం 7.9 శాతం నుంచి 5.53 శాతానికి దిగిరాగా స్థూల ద్రవ్యోల్బణం 4.58 శాతం నుంచి 3.87 శాతానికి దిగి వచ్చింది.

పెర్త్‌కు రూ.13,200కే విమాన టికెట్

స్కూట్ ఎయిర్‌లైన్స్ ఆఫర్

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఆస్ట్రేలియా టూరిజం విభాగం, స్కూట్ ఎయిర్‌లైన్స్ కలిసి విశాఖ ప్రజలకు కొత్త ఆఫర్ ప్రకటించాయి. విశాఖపట్నం నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసు నడుపుతున్న స్కూట్ ఎయిర్‌లైన్స్ తాజాగా అక్కడి నుంచి పెర్త్‌కు తన సర్వీస్‌ను విస్తరించింది. టికెట్ ధర రూ.13,200లుగా నిర్ణయించింది. ప్రయాణ సమయం 8.30 గంటలు. పశ్చిమ ఆస్ట్రేలియా టూరిజం అధికారులు పర్యాటక ప్రచారంలో భాగంగా బుధవారం విశాఖపట్నం వచ్చారు. ఈ సందర్భంగా స్కూట్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి ఈ ఆఫర్‌ను ప్రకటించారు. ఈ నెల 18వ తేదీ వరకు ఆఫర్ టికెట్లు విక్రయిస్తామని తెలిపారు. ఈ టికెట్లతో ఫిబ్రవరి 28 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు, మళ్లీ మే 16 నుంచి జూన్ 14 వరకు, జూలై 2 నుంచి 20వ తేదీ వరకు ఎప్పుడైనా ప్రయాణించవచ్చని స్కూట్ ఎయిర్‌లైన్స్ జనరల్ మేనేజర్ బ్రెయిన్ తొరాప్ తెలిపారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	111
వరంగల్	100	గుంటూరు	116
కరీంనగర్	100	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	90
కర్నూలు	100	నెల్లూరు	95
విశాఖపట్నం	103	అనంతపురం	95
గోదావరి	111		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ

హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	455
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ.	72

6 రోజుల్లో రూ.18 లక్షల కోట్ల నష్టం

» మరో 122 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్

ముంబై: వాణిజ్య యుద్ధ భయాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఆరో రోజూ నష్టాలు చవిచూశాయి. బుధవారం ట్రేడింగ్ తొలి గంటలోనే సెన్సెక్స్ 905 పాయింట్లు క్షీణించి 75,388 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆర్థిక సేవలు, లోహ రంగాల షేర్లలో కొనుగోళ్లతో సూచీ మళ్లీ తేరుకుని మధ్యాహ్నం ఒక దశలో స్వల్ప లాభాల్లో ట్రేడైనప్పటికీ.. ఆయిల్, ఐటీ రంగ షేర్లలో అమ్మకాల కారణంగా తిరిగి నష్టాల్లోకి జారుకుంది. చివరికి సెన్సెక్స్ 122.52 పాయింట్ల నష్టంతో 76,171.08 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 26.55 పాయింట్లు కోల్పోయి 23,045.25 వద్ద ముగిసింది. గడిచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,412.73 పాయింట్లు (3.07 శాతం), నిఫ్టీ 694 పాయింట్లు (2.92 శాతం) క్షీణించాయి. ఆరు రోజుల్లో రూ.18 లక్షల కోట్ల మార్కెట్ సంపద తరిగిపోయింది. దాంతో బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ రూ.407.46 లక్షల కోట్లకు (4.69 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

క్లెయిమ్ చేయని ఎంఎఫ్‌ల శోధన కోసం మిత్రా


న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ.. మదుపరుల కోసం మరో సౌలభ్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. క్రియారహిత లేదా క్లెయిమ్ చేసుకోని తమ మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)ను శోధించి, రీక్లెయిమ్ చేసుకునేందుకు వీలుగా మిత్రా పేరుతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను బుధవారం ప్రవేశపెట్టింది. గతంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టి మరిచిపోయినవారు మిత్రా ద్వారా తమ పోలియోను శోధించి, ప్రస్తుత నియమావళికి అనుగుణంగా కేవైసీని అప్‌డేట్ చేసి క్లెయిమ్ చేసుకునే వీలుంటుందని సెబీ పేర్కొంది. మదుపరులకు ఈ విషయాన్ని తెలియజేయాలని ఫండ్ మార్కెట్ సంబంధిత వర్గాలందరినీ సెబీ నిర్దేశించింది.

హైదరాబాద్‌లో ఎన్‌ఫ్యాబ్రికా కార్యకలాపాలు షురూ

హైదరాబాద్‌లోని తన కొత్త కార్యాలయం, ఆర్ అండ్ డీ కేంద్రంలో కార్యకలాపాలను ప్రారంభించినట్లు అమెరికాకు చెందిన ఫ్యాబ్‌లెస్ సెమీకండక్టర్ కంపెనీ ఎన్‌ఫ్యాబ్రికా కార్పొరేషన్ బుధవారం ప్రకటించింది. భారత మార్కెట్లో ప్రవేశానికి ఎన్‌ఫ్యాబ్రికా హైదరాబాద్‌ను ఎంచుకుంది. తమ కార్యకలాపాల కోసం అత్యున్నత నిపుణులను నియమించుకోనున్నట్లు, 2025 చివరికల్లా ఉద్యోగులను నాలుగింతల స్థాయికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎన్‌ఫ్యాబ్రికా వెల్లడించింది.










అమ్మాయిల హాస్టల్ వార్డెన్‌లా అనిపించేది

చిరంజీవి



'బ్రహ్మా ఆనందం' ప్రీ రిలీజ్ వేడుకకు చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా కథాంశం తాతా-మనవళ్ల మధ్య జరిగే ఆసక్తికరమైన ప్రయాణం కావడంతో.. కార్యక్రమంలో తన తాత గారిని గుర్తుచేసుకున్నారు చిరు. "మా తాత పేరు రాధాకృష్ణ నాయుడు. ఆ మంచి బుద్ధి నాకు కొద్దిగా వచ్చింది. ఇక రామ్‌చరణ్ తాతయ్య అంటే మా నాన్నగారు చాలా అందగాడు. మా ఇంట్లో ఎవ్వరికీ ఆయన అందం రాలేదు. నిజజీవితంలో మాకు హీరో అంటే ఆయనే. ఇక క్లీంకార తాతయ్య, అంటే నా గురించి చెప్పాలంటే.. ఇంట్లో ఉన్నప్పుడు నాకు మనవరాళ్లతో ఉన్నట్లు ఉండదు. ఓ లేడీస్ హాస్టల్ వార్డెన్‌లా ఉన్నట్లు ఉంటుంది. ఎందుకంటే నా చుట్టూ ఆడపిల్లలే ఉంటారు. అందుకే ఓ అబ్బాయిని కనమని చరణ్‌కు చెప్తుంటాను. మన వారసత్వం కొనసాగాలని అలా అంటుంటా" అని సరదాగా మాట్లాడారు. ఆడపిల్లలు కూడా వారసులేగా చిరు సార్ అంటూ కొందరు నెటిజన్లు చమత్కరిస్తున్నారు.

ఇలాంటి పాత్ర కోసమే తపించా

విష్వక్ సేన్



విష్వక్ సేన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'లైలా'. రామ్‌నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రవిశేషాలను మీడియాతో పంచుకున్నారు విష్వక్ సేన్. "విభిన్న పాత్రల్లో నటించాలని ప్రతి నటుడికీ ఉంటుంది. 'భామనే సత్యభామనే', 'మేడం', 'చిత్రం భళారే విచిత్రం' 'రెమో' సినిమాలు చూసినప్పుడు నటుడిగా ఇలాంటి పాత్రలు చేయాలనిపించేది. ప్రేక్షకులు కూడా కొత్తదనాన్ని ఇష్టపడుతున్నారు. ప్రయోగాల్ని ఆదరిస్తున్నారు. దర్శకుడు ఈ సినిమా కథ చెప్పేటప్పుడు చాలా ఎంజాయ్ చేశాను. ఆయన చెప్తున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే సినిమా చేయాలని చాలా కాలంగా ఎదురుచూస్తున్నాను. ఈ కథతో కుదిరింది. థియేటర్లో ఉన్నంత సేపూ మీరు అన్ని విషయాలు మర్చిపోయి సినిమాను ఆస్వాదిస్తారు. ఒక్క క్షణం కూడా చూపు తిప్పుకోకుండా చూస్తారు. ఇందులో నేను పోషించిన 'సోనూ మోడల్', 'లైలా' రెండూ పాత్రలు వేటికవే విభిన్నం. ఇందులో సోనూ.. లైలాగా మారడానికి గల కారణం అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ లుక్ కోసం తయారవ్వడానికి దాదాపు రెండు గంటలు పట్టేది. ఇంట్లో వాళ్లు ఈ లుక్‌లో నన్ను చూసి ఆశ్చర్యపోయారు. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోయే పాత్ర దక్కింది. దర్శకుడు రామ్‌నారాయణ్ చాలా ప్రతిభావంతుడు. సినిమాను అనుకున్నదానికంటే బాగా తీశారు. నిర్మాత సాహు గారపాటి ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. లియోన్ జేమ్స్ అద్భుతమైన పాటలు ఇచ్చారు. ఈ సినిమా కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరాన్ని తప్పక ఆకట్టుకుంటుంది. నా కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా అవుతుంది. ఈ సినిమా కోసం రెండు పాటలు రాయడం మరిచిపోలేని అనుభూతి. ఇప్పటివరకూ 'లైలా' గెటప్ బాగుందని చాలా మంది ప్రశంసించారు. చిరంజీవిగారు 'నాకే కొరకాలనిపించింది' అని చెప్పడం మర్చిపోలేని ప్రశంస. ఈ సినిమాకు సీక్వెల్ తీయాలనే ఆలోచన ఉంది" అని చెప్పారు.

ఊరిలో వినోదం



వినోదం ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'బద్మాషులు'. మహేశ్, విద్యాసాగర్, మురళీధర్ గౌడ్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. శంకర్ చేగూరి దర్శకత్వంలో బీ బాలకృష్ణ, సీ శంకర్ నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. శంకర్ చేగూరి మాట్లాడుతూ 'సినిమా ఆద్యంతం నవ్వులు పంచుతుంది. కుటుంబంతో కలసి చూసేలా ఉంటుంది' అన్నారు. 'ఇది మన ఊరి కథ, ఇందులో పాత్రలు సహజంగా ఉంటాయి. సినిమా ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: తేజ కూనూరు, సినిమాటోగ్రఫీ: వినీత్ పబ్బతి

రణభూమిలో రారాజు



'ఫ్యామిలీ స్టార్' చిత్రం తర్వాత విజయ్ దేవరకొండ కథానాయకుడిగా భారీ అంచనాలతో తెరకెక్కుతున్న చిత్రం 'వీడీ 12' (వర్కింగ్ టైటిల్). గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, టీజర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి 'కింగ్‌డమ్' అనే శక్తిమంతమైన టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన టీజర్ ఆద్యంతం కళ్లు చెదిరే యాక్షన్ సీక్వెన్స్, అనిరుధ్ నేపథ్య సంగీతం, విజయ్ నటనతో సరికొత్త అనుభూతిని పంచింది. మే 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈసారి థియేటర్లలోకి

నాలుగేళ్ల క్రితం ఓటీటీలో విడుదలై ఆకట్టుకున్న 'కృష్ణ అండ్ హిజ్ లీల' చిత్రం 'ఇట్స్ కాంప్లికేటెడ్' అనే టైటిల్‌తో వెండితెరపై ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో సిద్ధు



జొన్నలగడ్డ కథానాయకుడిగా నటించగా, రవికాంత్ పెరేపు దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సంజయ్ రెడ్డి నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్, సీరత్‌కపూర్ కథానాయికలు. కరోనా మహమ్మారి వల్ల ఏర్పడిన లాక్‌డౌన్ పరిస్థితుల నేపథ్యంలో 2020లో ఓటీటీలో విడుదల చేశారు. అక్కడ మంచి ఆదరణ దక్కించుకున్న ఈ చిత్రాన్ని ప్రేమికుల రోజు సందర్భంగా ఈనెల 14న థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం చిత్రబృందం నిర్వహించిన మీడియా సమావేశంలో రానా మాట్లాడుతూ 'ఈ సినిమాకు ఇది రీ రిలీజ్ కాదు. థియేటర్లలో తొలిసారి విడుదల చేస్తున్నాం' అన్నారు. ఈ సినిమాను ప్రేక్షకులు థియేటర్లలో చూడాలనే నా కోరిక నెరవేరబోతున్నందుకు ఆనందంగా ఉందన్నారు సిద్ధు జొన్నలగడ్డ. లాక్‌డౌన్‌లో ఎవరిళ్లలో వారు కూర్చొని చూశారు, ఈ సారి థియేటర్లలో అందరితో కలసి ఎంజాయ్ చేస్తూ చూడండి అని రవికాంత్ కోరారు.

అమ్మ సెంటిమెంట్ అలరిస్తుంది



దర్శకుడు అమ్మ రాజశేఖర్ తన తనయుడు అమ్మ రాగిన్‌ను హీరోగా పరిచయం చేస్తూ తెరకెక్కించిన చిత్రం 'తల'. అంకిత నస్కర్ హీరోయిన్. రాజీవ్ కనకాల, ఇంద్రజ కీలకపాత్రలు పోషించారు. శ్రీనివాస్ గౌడ్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ 'నా విమర్శకులకు ఈ సినిమాతో సమాధానం చెబుతాను. పోరాట ఘట్టాలతో పాటు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి' అని చెప్పారు. రాగిన్ రాజు మాట్లాడుతూ 'సినిమా కోసం టీం అంతా చాలా కష్టపడ్డాం. తల్లీ కొడుకుల సెంటిమెంట్, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అన్నారు. రాగిన్ రాజ్ అనుభవమున్న నటుడిలా చక్కగా నటించాడు, ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి అని శ్రీనివాస్ గౌడ్ కోరారు.



ప్రేమ కథ



'ప్రేమించుకుందాం రా, మనసంతా నువ్వే' తదితర చిత్రాల్లో బాలనటుడిగా ప్రేక్షకులను అలరించిన ఆనంద్ వర్ధన్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'నిదురించు జహాపనా'. ప్రసన్న కుమార్ దేవరపల్లి దర్శకత్వంలో సామ్, వంశీ కృష్ణ వర్మ నిర్మించారు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా ఆనంద్ వర్ధన్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులకు కొత్త కథ చెప్పాలనే లక్ష్యంతో ఈ సినిమా చేశాం. ప్రేమకథకూ నిద్రకూ ఉన్న సంబంధం ఏమిటనేదే ఈ సినిమా కథ. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. నిద్ర చుట్టూ అల్లుకున్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం అని దర్శకుడు తెలిపారు. ఇంటిల్లిపాదిని అలరించే కంటెంట్ ఉన్న చిత్రమిదని నిర్మాత

ఆ స్టెప్పులు వివాదాస్పదమవుతాయనుకోలేదు

ఊర్వశీ రౌతేలా

ఇటీవలే విడుదలై ఘనవిజయం సాధించిన 'డాకు మహారాజ్' చిత్రంలో ఊర్వశీ రౌతేలా ఓ ప్రత్యేక గీతంలో నర్తించడంతో పాటూ కీలక పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. ఇందులో కథానాయకుడు బాలకృష్ణతో ఆమె చేసిన 'దబిడి దిబిడి' పాటలోని స్టెప్పులు వివాదాస్పదమయ్యాయి. నెటిజన్లు విమర్శలు గుప్పించారు. దీనిపై ఆమె స్పందించారు. "ఈ పాట రిహార్సల్స్ అంతా ప్రశాంతంగా జరిగాయి. అన్ని పాటల్లో కొరియోగ్రఫీ ఏ విధంగా ఉంటుందో ఈ పాటలోనూ అలానే ఉండేలా చేశాం. శేఖర్ మాస్టర్ ఈ పాటకు స్టెప్పులు నేర్పించేటప్పుడు తప్పుగా, అసభ్యకరంగా అనిపించలేదు. సాధారణ స్టెప్పులలాగే అనిపించాయి. కానీ పాట విడుదలయ్యాక సోషల్‌మీడియాలో వచ్చిన నెగిటివ్ కామెంట్స్ షాకింగ్‌గా అనిపించాయి. అస్సలు ఈ పాటలోని స్టెప్పులపై ఇంత వ్యతిరేకత వస్తుందని.. ఇంతగా వివాదాస్పదమవుతాయని అనుకోలేదు. రిహార్సల్స్ క్లిప్ విడుదల చేసినప్పుడు ఎలాంటి విమర్శలు రాలేదు" అని చెప్పారు. సోషల్‌మీడియాలో పనిగట్టుకుని చేసే కామెంట్స్‌ను నేను పట్టించుకోను. నిర్మాణాత్మక విమర్శలను ఎల్లప్పుడూ స్వాగతిస్తా" అని చెప్పారు.

సుప్రీం ఉత్తర్వులు మా ముందు ఉంచండి

» ఏజీకి హైకోర్టు ధర్మాసనం సూచన

» చంద్రబాబుపై కేసుల విచారణ.. పిల్ వ్యవహారం



అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మరికొందరిపై నమోదైన కేసుల విచారణను సీబీఐ, ఈడీలకు అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన పిల్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ధర్మాసనం స్పందిస్తూ.. ఇదే వ్యవహారంపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పీ) దాఖలైనట్లు తాము పత్రికల్లో చదివామని, సర్వోన్నత న్యాయస్థానం ఏమి ఉత్తర్వులు ఇచ్చిందని ఆరా తీసింది. అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. ఎస్ఎల్‌పీని సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు. ప్రస్తుత పిటిషనర్ కూడా ఆ ఎస్ఎల్‌పీలో జోక్యం చేసుకున్నట్లు వివరించారు. పిటిషనర్ ధర్మాసనం ముందు వాస్తవాలు చెప్పకపోవడం సరికాదన్నారు. ఎస్ఎల్‌పీలో ఇంటర్వీన్ అవుతూ పిటిషనర్ వేసిన అప్లికేషన్ వివరాలు కోర్టు ముందు ఉంచుతామన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఎస్ఎల్‌పీలో సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను తమ ముందు ఉంచాలని ఏజీకి సూచిస్తూ, విచారణను రెండునెలలకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం వేసిన కౌంటర్ పై రిప్లై వేసేందుకు పిటిషనర్‌కు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. విజయవాడకు చెందిన స్వర్ణాంధ్ర తెలుగు డైలీ ఎడిటర్ కె.బాలగంగాధర్ తిలక్ ఈ పిల్ దాఖలు చేశారు.

ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ వేసింది

» మేము ఉత్తర్వులివ్వాల్సిన అవసరం లేదు

» 'తిరుపతి తొక్కిసలాట' పిల్‌పై హైకోర్టు ధర్మాసనం

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట, భక్తుల మృతి వ్యవహారంపై విచారణ జరిపేందుకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ నియమించిన నేపథ్యంలో, ఈ వ్యవహారంపై తాము ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరంలేదని హైకోర్టు పేర్కొంది. విచారణ గడువును 30 రోజులకే పరిమితం చేయాలని, నివేదికను గవర్నర్‌కు సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. గవర్నర్‌కు నివేదిక సమర్పించేలా నిబంధన ఏదీ చట్టంలో లేదని తెలిపింది. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ చట్టం కింద కమిషన్ ఏర్పాటు చేసి, విచారణ గడువు నిర్దేశించడం పూర్తిగా ప్రభుత్వ విచక్షణాధికారమని పేర్కొంది. వ్యాజ్యాలను పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటిరవితో కూడిన ధర్మాసనం బుధవారం తీర్పు ఇచ్చింది. కర్నూలు జిల్లాకు చెందిన గుడిబండ ప్రభాకర్‌రెడ్డి ఈ పిల్‌ను దాఖలు చేశారు. వ్యాజ్యంపై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం బుధవారం నిర్ణయం వెల్లడించింది. మరోవైపు తొక్కసలాట వ్యవహారంపై జ్యుడీషియల్ విచారణ కోరుతూ విజయవాడకు చెందిన వంగవీటి నరేంద్ర తాజాగా దాఖలు చేసిన పిల్‌కు కూడా అవే ఉత్తర్వులు వర్తిస్తాయని ధర్మాసనం స్పష్టం చేసింది.

కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ పిల్‌పై విచారణ వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై విచారణను హైకోర్టు వచ్చే వారానికి వాయిదా వేసింది. బెంచ్‌ల ఏర్పాటు విషయంలో సుప్రీంకోర్టు 2000లో ఇచ్చిన తీర్పును పరిశీలించాల్సి ఉందని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. న్యాయవాది తాండవ యోగేష్ బదులిస్తూ... సుప్రీంకోర్టు తీర్పుతోపాటు రాజధాని అమరావతి విషయంలో హైకోర్టు విస్తృత ధర్మాసనం ఇచ్చిన తీర్పును పరిశీలించాలని అభ్యర్థించారు. ఈ తీర్పు ప్రకారం హైకోర్టును విభజించి మరో ప్రాంతంలో బెంచ్‌ను ఏర్పాటు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయవాదులు తాండవ యోగేష్, తురగా సాయి సూర్య ఈ పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చలేదా?

» హైకోర్టు ధర్మాసనం తీవ్ర అసంతృప్తి

» నివేదిక సమర్పించాలని ప్రకాశం ఎస్పీ, విశాఖ సీపీలకు ఆదేశం

» విచారణ 18కి వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో నిందితుడు బోస రమణను పొదిలి పోలీసులు అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చకుండా వదిలేయడం, ఎలాంటి రికార్డులూ నిర్వహించకపోవడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. ఈ వ్యవహారంపై నివేదిక సమర్పించాలని ప్రకాశం జిల్లా ఎస్పీ, విశాఖ నగర పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ వ్యవహారాన్ని డీజీపీ, సంబంధిత జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను ఈనెల 18వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన రావు, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. తన భర్త బోస రమణను ప్రకాశం జిల్లా దర్శి పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, ఆయనను కోర్టు ముందు హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ విశాఖపట్నం మద్దిలపాలెంకు చెందిన బోస లక్ష్మి గతేడాది నవంబరులో హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, విశాఖ ఎంవీపీ పీఎస్‌కు సమాచారం ఇచ్చి గతేడాది నవంబరు 6న నిందితుడు రమణను అరెస్ట్ చేసి పొదిలి తీసుకొచ్చామని, నేర ఒప్పంద వాంగ్మూలం నమోదు చేసి అదే రోజు సాయంత్రం బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు ఇచ్చి విడిచి పెట్టేశామంటూ పొదిలి ఇన్‌స్పెక్టర్ కౌంటర్ దాఖలు చేశారు. ఈ వివరణపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వ్యక్తిని అరెస్ట్ చేసిన తర్వాత మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చకుండా నోటీసులు ఇచ్చి వదిలేశామని బాధ్యతగల పోలీస్ అధికారి అఫిడవిట్ ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించింది.

నాపై కేసు కొట్టివేయండి: దేవిరెడ్డి చైతన్య రెడ్డి

అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై కడప రిమ్స్ పోలీసులు ఈ నెల 3న నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వివేకా హత్య కేసు నిందితుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దేవిరెడ్డి చైతన్య రెడ్డి మెడికల్ క్యాంప్ పేరుతో కడప సెంట్రల్ జైల్లోకి వచ్చి తనను బెదిరించారని, ప్రలోభపెట్టారని దస్తగిరి కడప రిమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

ఆరుగురు స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

హైకోర్టులో వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల తరఫున వాదనలు వినిపించేందుకు ఆరుగురు స్టాండింగ్ కౌన్సిళ్లను నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. న్యాయవాది జి.వెంగళరెడ్డిని రాయలసీమ రీజియన్ మున్సిపల్ కార్పొరేషన్ల తరఫున స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించారు. న్యాయవాది కొప్పెర కోటేశ్వరరావు ఉభయ గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని దేవాలయాలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. న్యాయవాదులు ఆర్.చంద్రారెడ్డి శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యునివర్సిటీకి, మల్లిపూడి ధనరాజు రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి కార్పొరేషన్‌కు, అన్నంరాజు వేణుగోపాల మాధవరావు రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు, శాంతిచంద్ర ఏపీఐఐసీకి స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు.

ఒంగోలులో అసంపూర్తి రోడ్లకు మోక్షం!

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

» 37వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

» 'అక్షరం అండగా..'తో సమస్యకు పరిష్కారం

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' జనవరి 28న ఒంగోలు 37వ డివిజన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి స్పందన లభిస్తోంది. అసంపూర్తిగా ఉన్న సిమెంట్ రోడ్ల పనులను బుధవారం రూ.10లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టారు. రూ.10కోట్లతో డివిజన్‌లోని సమస్యలు పరిష్కారిస్తానని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు ఇప్పటికే డివిజన్‌లో దోమల నియంత్రణకు చర్యలు తీసుకోగా, పారిశుధ్యం మెరుగునకు, ఎన్టీఆర్ పార్కులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పార్కు నుంచి మంగమూరు డొంకకు గతంలో కొద్దిదూరం వేసి వదిలేసిన సీసీ రోడ్డును పూర్తిచేసే పనులను బుధవారం ప్రారంభించారు. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' చొరవతో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఒంగోలు 37వ డివిజన్‌లో సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించిన మున్సిపల్ సిబ్బంది



నేడు

కూటమి ప్రభుత్వంలో కొత్తగా వేసిన రోడ్డు



నాడు

గోతులతో నిండివున్న రామవరప్పాడు ఫ్లైఓవర్-ముస్తాబాద రోడ్డు

ఆ నివేదికపై అనుమానమొస్తే మరో కమిటీ వేస్తాం

» సర్వేలో పాల్గొన్న అధికారులే బాధ్యులు

» భీమిలి పరిధిలో అక్రమ నిర్మాణాల సర్వే నివేదికను పరిశీలించి మా ముందుకు రండి

» పిటిషనర్లకు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమిలి పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై సర్వే చేసిన అధికారులు సమర్పించిన నివేదికను పరిశీలించి తమ ముందుకు రావాలని పిటిషనర్లను హైకోర్టు ఆదేశించింది. అధికారుల నివేదికపై తమకు అనుమానాలు కలిగితే మళ్లీ సర్వే నిర్వహించి, నివేదిక సమర్పించేందుకు మరో కమిటీ వేస్తామని స్పష్టం చేసింది. సర్వేలో పాల్గొన్న అధికారులు బాధ్యులను హెచ్చరించింది. అధికారులు సమర్పించిన నివేదికను ధర్మాసనం ముందు ఉంచాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ)ని ఆదేశించింది. బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. భీమిలి పరిధిలోని సీఆర్‌జెడ్-1 ప్రాంతంలో సముద్రానికి అతిసమీపంలో వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి శాశ్వత కాంక్రీట్ నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తియాదవ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. నిర్మాణాలను తొలగించడంతో పాటు సహజ ఆవాసాలను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇదే వ్యవహారంపై గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు మరో పిల్ వేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం.. భీమిలి తీర ప్రాంతంలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను గుర్తించేందుకు ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఏపీసీజెడ్ఎంఏ) మెంబర్ సెక్రటరీ, జీవీఎంసీ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌తో కమిటీని ఏర్పాటు చేసింది.



నిబద్ధత గల అధికారుల బృందంతో సర్వే చేయించి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశించింది. నివేదికను కోర్టు ముందు ఉంచాలని, సమర్పించడంలో విఫలమైతే తదుపరి విచారణకు కోర్టు ముందు ఆన్‌లైన్ ద్వారా హాజరు కావాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేసింది. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపించారు. ఓ పాత భవనం, కొన్ని టాయిలెట్లు మినహా అక్రమ నిర్మాణాలను కూల్చివేశామన్నారు. సీఆర్‌జెడ్ నిబంధనలు అమల్లోకి రాక ముందు పాత భవనం నిర్మించారని వివరించారు. ధర్మాసనం స్పందిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాన్ని కూల్చివేయడానికి అభ్యంతరం ఏముంది? ఆ భవనం రాజకీయ నాయకుడికి చెందినదా? అని ప్రశ్నించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎన్.జాయ్ స్పందిస్తూ... సీఆర్‌జెడ్ పరిధిలో శాశ్వత నిర్మాణాలు జరిపి రెస్టోబార్లు నడుపుతున్నారని, అధికారులు కూల్చివేసిన భవనాలకు 280 మీటర్ల దూరంలోనే ఇవి ఉన్నాయన్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా బీచ్‌లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఎస్‌జీపీ ప్రణతి స్పందిస్తూ.. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అధికారులు సర్వేను భీమిలి పరిధికే పరిమితం చేశారని వివరించారు. ఇరువైపు వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను వారం రోజులకు వాయిదా వేసింది.

స్పందన లేనప్పుడు రిజర్వ్ ధర తగ్గించడంలో తప్పేంటి?

» బెరైటీస్ టెండర్ విషయంలో పిటిషనర్‌కు హైకోర్టు ప్రశ్న

» కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి ఆదేశం

» విచారణ రెండు వారాలకు వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా, మంగంపేట బెరైటీస్ గనుల్లో సీ+డీ+డబ్ల్యూ గ్రేడ్ ఖనిజం విక్రయానికి మొదటసారి పిలిచిన టెండర్లకు ఆశించిన స్థాయిలో స్పందన లేనప్పుడు రిజర్వ్ ధర తగ్గించి తిరిగి టెండర్ నోటిఫికేషన్ ఇస్తే తప్పేముందని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య ఈ పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. 2024 డిసెంబర్‌లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో రిజర్వ్ ధరను రూ.1,680గా ఖరారు చేశారన్నారు. ఈ ఏడాది జనవరిలో ఇచ్చిన టెండర్ నోటిఫికేషన్‌లో రిజర్వ్ ధరను రూ.1188కు తగ్గించారని తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాకు రూ.290 కోట్లు నష్టం జరుగుతుందన్నారు. అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. ఏ, బీ గ్రేడ్ బైరెటీస్ ఖనిజం తవ్వగా వచ్చిన సీ+డీ+డబ్ల్యూ గ్రేడ్ ఖనిజం ఏళ్ల తరబడి నిల్వ ఉందన్నారు. ఈ ఖనిజం విక్రయానికి గతేడాది డిసెంబర్‌లో టెండర్ పిలవగా కేవలం ఒక్క బిడ్ మాత్రమే వచ్చిందని తెలిపారు. ఎక్కువ మంది బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు వీలుగా అర్హతలు, రిజర్వ్ ధరను సవరిస్తూ ఈ ఏడాది జనవరిలో టెండర్ పిలిచామన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల ఆధారంగా రిజర్వ్ ధరను తగ్గించామన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

ఎవరు తప్పు చేస్తే.. వారిపైనే చర్యలు!



ఉపాధి హామీ పథకం సిబ్బందికి ఊరట

» చేయని తప్పుకు శిక్ష పడకుండా చర్యలు

» ఎస్ఆర్‌డీఎస్ మార్గదర్శకాల్లో మార్పులకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ యోచన

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం సిబ్బందికి సంబంధించి సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్(ఎస్ఆర్‌డీఎస్) నిబంధనలను సవరించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ యోచిస్తోంది. తప్పు చేయని వారిపై చర్యలు తీసుకోకుండా.. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోనున్నారు. ఉపాధి పనుల్లో అవినీతి, నిధుల దుర్వినియోగం జరిగితే.. ఏ కేటగిరి సిబ్బందికి ఏ విధమైన జవాబుదారీతనం ఉండాలన్న దానిపై ఎస్ఆర్‌డీఎస్ మార్గదర్శకాల్లో మార్పులు చేయాలని భావిస్తున్నారు. 2008లో రూపొందించిన రూల్స్ చాలా వరకు కాలం చెల్లినవే! సోషల్ ఆడిట్ తర్వాత వీటిని పాటించడం ద్వారా.. అవినీతికి పాల్పడకపోయినా చాలా మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు! ఈ నేపథ్యంలో సిబ్బంది జాబ్‌చార్ట్‌పై మరింత స్పష్టత వచ్చేలా మార్గదర్శకాలను మార్పుచేసేందుకు జిల్లాల డ్వామా పీడీల అభిప్రాయాలను కూడా సేకరించనున్నారు. కమిషనర్ కృష్ణతేజ గురు, శుక్రవారాల్లో విజయవాడలో నిర్వహిస్తున్న సమావేశాల్లోనే డ్వామా పీడీల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముక్‌కుమార్ నిర్ణయించారు. ఎస్ఆర్‌డీఎస్ మార్గదర్శకాల్లో లోపాలను సరిదిద్ది వచ్చే ఎస్ఆర్‌డీఎస్ బోర్డు సమావేశంలో సవరణలు తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం.

బాధ్యతలు లేని ఏపీఓలు

ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి పలు బాధ్యతలు అప్పగించారు. అవినీతి జరిగితే ఏయే సిబ్బంది ఎంత మేరకు బాధ్యత వహించాలన్న దానిపై అప్పట్లో మార్గదర్శకాలు రూపొందించారు. ఉపాధి పథకంలో ఏపీఓ కీలకంగా వ్యవహరిస్తుంటారు. మండలంలో పథకం అమల్లో పీఓకు సహకరిస్తూ కీలకంగా పర్యవేక్షిస్తుంటారు. అయితే సోషల్ ఆడిట్ ద్వారా వెల్లడైన నిరూపణల్లో ఏపీఓలను బాధ్యులుగా చేసే పరిస్థితి ఎస్ఆర్‌డీఎస్ రూల్స్‌లో లేదు. ఎస్ఆర్‌డీఎస్ మార్గదర్శకాల ప్రకారం ఫీల్డ్ అసిస్టెంట్ రూ.10 వేలకు పైగా అవినీతికి పాల్పడినట్లు సోషల్ ఆడిట్ నివేదిస్తే.. వారిని వెంటనే సస్పెండ్ చేస్తారు. టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.25 వేల కంటే ఎక్కువగాను, ఏపీఓ, ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌కు రూ.50 వేలు దాటితే చర్యలు తీసుకుంటారు. చేసిన పనుల కొలతల విషయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లను మాత్రమే బాధ్యులను చేస్తారు. పని జరగకుండా టెక్నికల్ అసిస్టెంట్లు రికార్డు చేసి మస్టర్లు వేస్తే.. దానికి టెక్నికల్ అసిస్టెంట్లను, చెక్ మెజర్‌మెంట్ చేసినందుకు ఇంజనీరింగ్ కన్సల్టెంట్లను బాధ్యులను చేస్తారు. కొన్ని చోట్ల జరిగిన పనులు కనుమరుగవుతున్నందున టీఏ, ఈసీలు కారణం లేకుండా బాధితులవుతున్నారు. ఒక పొలంలో తవ్విన ఫారం పాండ్‌ను రైతు ఏడాదిలో పూడ్చేస్తే.. దానికీ సిబ్బంది బాధ్యులవుతున్నారు. ఇలా పలు కారణాలతో తప్పులు చేయని సిబ్బందిని బాధ్యులను చేస్తున్నారు.

మృతదేహం జాడ దొరకలేదు!

» రెండేళ్ల క్రితం గుర్తు తెలీని మృతదేహాన్ని పూడ్చిపెట్టిన పోలీసులు

» రీ పోస్టుమార్టం కోసం తాజాగా తవ్వకాలు

» మట్టిలో కలిసిపోయిన మృతదేహం, కవర్

» డీఎన్ఏ గుర్తించాలని కేరళ హైకోర్టు ఆదేశాలు.. కాకినాడ వచ్చిన సీబీఐ అధికారులు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేరళ హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ అధికారులు ఓ సైనికాధికారి మృతదేహాన్ని గుర్తించేందుకు బుధవారం కాకినాడ వచ్చారు. కేరళలోని పతనంతిట్ట జిల్లా కోడుమాన్‌కు చెందిన కె.శంకరన్ మిలటరీలో అరుణాచల్‌ప్రదేశ్‌లో ఎస్ఐ స్థాయి అధికారిగా పనిచేసేవారు. 2023 ఆగస్టు 22న సెలవుపై ఇంటికి వచ్చారు. మరో 37 రోజులు సెలవు పొడిగించుకునేందుకు ఆ ఏడాది అక్టోబరు 19న తిరిగి డ్యూటీ వద్దకు వెళ్లారు. అనంతరం కేరళ పయనమై.. నవంబరు 25న అసోంలో గౌహతి ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. ఈ విషయాన్ని అతడితో పాటు అతని పైఅధికారులు కూడా కుటుంబానికి తెలియజేశారు. అయితే 2023 నవంబరు 27వ తేదీన చెన్నై రైల్వేస్టేషన్ నుంచి శంకరన్ భార్య కుమారికి ఫోన్ కాల్ వచ్చింది. ఆ కాల్‌లో.. ఎవరో ఓ వ్యక్తికి చెందిన లగేజీ బ్యాగ్ చెన్నై రైల్వేస్టేషన్ సమీపంలో పడిపోయిందని చెప్పాడు. అదేరోజు రాత్రి కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వేస్టేషన్‌లో రైలు నుంచి జారిపడి శంకరన్ చనిపోయారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మూడు రోజుల పాటు కాకినాడ జీజీహెచ్ మార్చురీలో ఉంచి మృతుని వివరాల కోసం ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. అనంతరం కాకినాడలోని విజ్జపురెడ్డి శ్మశానవాటికలో మృతదేహాన్ని పూడ్చిబెట్టారు. శంకరన్ కుమారుడు శ్రీజిత్ శంకరన్ ఫిర్యాదు మేరకు సైనికాధికారి అదృశ్యం వెనుక మిస్టరీని ఛేదించాలంటూ ఈ కేసును హైకోర్టు సీబీఐకి అప్పగించింది. 2024 డిసెంబరు 5వ తేదీ నుంచి సీబీఐ విచారణ కొనసాగుతోంది. సీబీఐ నుంచి నలుగురు అధికారుల బృందం బుధవారం కాకినాడ వచ్చింది. కాకినాడ అర్బన్ ఎమ్మార్వో జితేంద్ర సమక్షంలో శంకరన్ డీఎన్ఏ కోసం తవ్వకాలు చేపట్టారు. అయితే పోలీస్ నివేదికలో మృతదేహం ఎరుపు, పసుపు రంగు కవర్‌లో చుట్టినట్లు ఉండగా.. తవ్విన ప్రాంతంలో ఆ కవర్ ఆనవాలు కానీ, మృతదేహం జాడ కానీ లభించలేదు. మృతదేహాన్ని పూడ్చిపెట్టి రెండేళ్లవడంతో మృతదేహంతోపాటు, కవర్ కూడా మట్టిలో కలిసిపోయినట్లు ఫోరెన్సిక్ వైద్యులు నిర్ధారించారు. దీంతో సీబీఐ అధికారులు అదే విషయాన్ని రికార్డు చేసుకున్నారు. త్వరలోనే కోర్టుకు నివేదిక ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.

బస్సుల్లో పైరసీ సినిమాలు ప్రదర్శిస్తే చర్యలు

» 'తండేల్' ప్రదర్శించిన అద్దెబస్సు ఒప్పందం రద్దు చేసిన ఆర్టీసీ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సినిమా పైరసీ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఏపీఎస్ఆర్టీసీ యాజమాన్యం హెచ్చరించింది. బస్సుల్లో కొత్త సినిమాల పైరసీ వీడియోలు ప్రదర్శిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆపరేషన్స్ విభాగం ఈడీ అప్పల రాజు స్పష్టం చేశారు. ఈ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అన్ని బస్ డిపోలకు బుధవారం ఆదేశాలిచ్చారు. ఇటీవల విడుదలైన 'తండేల్' సినిమాను నాలుగు రోజుల క్రితం పలాస నుంచి విజయవాడకు వస్తున్న ఆర్టీసీ అద్దెబస్సులో ప్రదర్శించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చిత్ర నిర్మాతలు ఏపీఎస్ఆర్టీసీ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఒకప్రయాణికుడు ఇచ్చిన సినిమా కాపీని బస్సులో సహాయకుడు ప్రదర్శించినట్లు విచారణలో తేలింది. దీంతో అద్దెబస్సు యజమానితో చేసుకున్న ఒప్పందాన్ని ఆర్టీసీ యాజమాన్యం రద్దు చేసుకుంది. ఇకపై ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించింది.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

» జంతువుల జనన నియంత్రణ చట్టం అమలు

» హైకోర్టు ఆదేశాలతో కమిటీ ఏర్పాటు

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీధికుక్కల నియంత్రణకు, రేబిస్ వ్యాధి నిరోధకానికి మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ చర్యలు ప్రారంభించింది. విజయవాడకు చెందిన ఓ వ్యక్తి వేసిన పిల్ ఆధారంగా హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం జంతువుల జనన నియంత్రణ చట్టం అమలుకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి చైర్‌పర్సన్‌గాను, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్, సీడీఎంఏ, భారత జంతు సంక్షేమ బోర్డు నుంచి ఇద్దరు ప్రతినిధులు, ఏపీ జంతు సంక్షేమ బోర్డు నుంచి ఇద్దరు సభ్యులు, భారతీయ వెటర్నరీ అసోసియేషన్ ఏపీ చాప్టర్ ప్రతినిధి, స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ అధ్యక్షులు, విజయవాడ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, తెనాలి, గుడివాడ మున్సిపల్ కమిషనర్లు, కనీసం రెండు పంచాయతీల ప్రతినిధులను సభ్యులుగాను, ఏపీ స్టేట్ జంతువుల సంక్షేమ బోర్డు ఆఫీసర్ ఇన్ చార్జ్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమిస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రతి మూడు నెలలకోసారి ఈ కమిటీ సమావేశమై వీధి కుక్కల నియంత్రణ, రేబిస్ వ్యాధి నివారణకు తగు చర్యలు తీసుకుంటుంది.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య: అగ్రి డైరెక్టర్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న రైతులందరికీ 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ నంబర్) ఇస్తున్నట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. గత మూడు రోజుల్లో 6.82లక్షల మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్నట్లు బుధవారం ప్రకటించారు. 2025-26 నుంచి పీఎం కిసాన్, అన్నదాత-సుఖీభవ, వడ్డీలేని పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, సూక్ష్మసేద్య పరికరాలు, ఇతర రాయితీ పథకాలు పారదర్శకంగా అందించడానికే రైతులకు యూనిక్ ఐడీ నంబర్లు ఇస్తున్నట్లు చెప్పారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతూ గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించి, ఆధార్, పట్టాదార్‌పాసుపుస్తకం, ఆధార్ అనుసంధానమైన మొబైల్ నంబరు తీసుకెళ్లి, ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకుంటే యూనిక్ ఐడీ నంబర్ పొందవచ్చన్నారు.

డిస్కమ్‌లకు వ్యవసాయ విద్యుత్తు సబ్సిడీ

» రూ.4,672.15 కోట్లు విడుదల

దక్షిణ, తూర్పు, కేంద్ర విద్యుత్తు పంపిణీ సంస్థలకు చివరి త్రైమాసిక వ్యవసాయ విద్యుత్తు సబ్సిడీ కింద రూ.4,672.15 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈమేరకు బుధవారం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వు జారీ చేశారు.

లైంగిక వేధింపుల నివారణకు విచారణ కమిటీ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాల్లో మహిళల లైగింక వేధింపుల నిరోధించడానికి ప్రభుత్వం అంతర్గత ఫిర్యాదుల కమిటీని నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైసీపీ కొల్లగొట్టిన రాష్ట్రాన్ని చంద్రబాబు చక్కదిద్దుతున్నారు



» ఈ ఏడాది కడపలో మహానాడు: ఎంపీ కలిశెట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ అధికారంలో ఉన్న గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కొల్లగొట్టారు. దాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కష్టపడుతున్నారు' అని విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో హైదరాబాద్ నగరాన్ని అద్భుత ఆర్థిక వనరుగా తీర్చిదిద్దారని, ఇప్పుడు అమరావతి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రానికి రూ.వేల కోట్ల నిధులు తీసుకొస్తున్నారన్నారు. ఎన్డీఏ కూటమిలో భాగస్వాములుగా ఉన్న జనసేన, బీజేపీ ఏపీ అభివృద్ధికి చిత్తశుద్ధితో సహకరిస్తున్నాయని అన్నారు. పవన్ కల్యాణ్, చంద్రబాబు మధ్య ఏదో జరిగిందంటూ కొంతమంది చేస్తున్న ప్రచారం సత్యదూరమని స్పష్టం చేశారు. కోటి మందికిపైగా సభ్యత్వాలు నమోదు కావడం టీడీపీ చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కార్యకర్తలకు అండగా ఉంటున్నారన్నారు. 2025లో మహానాడు పండుగను కడపలో నిర్వహిస్తున్నట్లు ఎంపీ చెప్పారు.

ఎమ్మెల్యేగా అసెంబ్లీకి రావడం నామోషీనా!:కొల్లు



అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే హోదాలో అసెంబ్లీకి రావడాన్ని జగన్ నామోషీగా భావిస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్‌కు ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. కేవలం ఎమ్మెల్యేగా మాత్రమే గెలిపించారు. అలాంటిది ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని జగన్ అనడం హాస్యాస్పదం. జగన్ ఎమ్మెల్యే హోదాలో అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చు. కానీ ఆయనకు ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి లేదు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో బర్డ్‌ఫ్లూపై స్వయంగా సీఎం ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతున్నారు. వైసీపీ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దు' అని కొల్లు అన్నారు.

జగన్‌కు హిందువులపై గౌరవం లేదు: బుచ్చి రాంప్రసాద్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): 'జగన్‌కు హిందువులపైన, హిందూ దేవుళ్లపైన గౌరవం లేదు. చొక్కాలు కూడా వేసుకోకుండా వెళ్లాల్సిన యజ్ఞశాల వద్దకు చెప్పులు వేసుకుని వెళ్లిన ఘనుడు జగన్' అని బ్రాహ్మణ సాధికారసమితి రాష్ట్ర కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'తిరుమల పవిత్రతను దెబ్బతీసిన సీఎంగా జగన్ చరిత్రలో నిలిచిపోతాడు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడిన బండారాన్ని బయటపెట్టేందుకు సుప్రీంకోర్టు ఆదేశాలతో జరుగుతున్న సీబీఐ విచారణనూ వైసీపీ రాజకీయం చేస్తోంది. జగన్ పాలనలో దేవాలయాలపై దాడులు, దొంగతనాలు నిత్యకృత్యంగా మారాయి' అన్నారు.

కేంద్ర సంప్రదింపుల కమిటీల్లోకి టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రిత్వ శాఖల సంప్రదింపుల కమిటీల్లో సభ్యులుగా రాజ్యసభలోని టీడీపీ ఎంపీలు నియమితులయ్యారు. ఇటీవల రాజ్యసభకు టీడీపీ తరఫున ఎన్నికైన సానా సతీశ్‌బాబును కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నియమించింది. బీద మస్తాన్‌రావు యాదవ్ కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు. తమకు సంప్రదింపుల కమిటీలలో సభ్యులుగా అవకాశం కల్పించినందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు... సతీశ్, మస్తాన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

వివేకా హత్య కేసులో పురోగతి కనిపిస్తోంది

» నిందితుల బెయిల్ రద్దయ్యే అవకాశం ఉంది: బీటెక్ రవి



వేంపల్లె, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ వివేకా నందరెడ్డి హత్య కేసులో పురోగతి కనిపిస్తోంది. ఆ హత్యలో భాగస్వామ్యం ఉన్న నిందితుల బెయిల్ రద్దయ్యే అవకాశం ఉంది' అని టీడీపీ పులివెందుల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. బుధవారం ఆయన పులివెందుల నియోజకవర్గం వేంపల్లె మండలం ముసల్‌రెడ్డిగారిపల్లెలో మినీ గోకులం షెడ్డును ప్రారంభించి, మీడియాతో మాట్లాడారు. 'వివేకా హత్య కేసుకు సంబంధించి అప్రూవర్‌గా మారిన దస్తగిరి వ్యవహారంపై ఎంపీ అవినాశ్‌రెడ్డి కోర్టులో కేసులో వేశారు. ఈ మేరకు కోర్టు నుంచి దస్తగిరికి, సీబీఐకి నోటీసులు వచ్చాయి. వివేకా కుమార్తె సునీత అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. వివేకా హత్య కేసులో నిందితులుగా ఉన్న వారు షరతులకు లోబడి ఉండాలి. ఇలాంటి బెదిరింపులకు దిగితే నిందితుల బెయిల్ రద్దయ్యే అవకాశం ఉంది' అని రవి స్పష్టం చేశారు.

1/70పై వైసీపీ కుట్ర

» ట్రైకార్, గిరిజన నేతలు శ్రీనివాసులు, ధారూనాయక్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, గిరిజన నాయకుడు ధారూ నాయక్ స్పష్టం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వారిద్దరూ విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీల కోసం పనిచేసే కూటమి ప్రభుత్వంపై జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని బురద చల్లుతున్నాడన్నారు. 1/70పై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా గిరిజనులు నమ్మరని స్పష్టం చేశారు. జీవో3ను సుప్రీంకోర్టు కొట్టేస్తే, పొరుగు రాష్ట్రాలు రివ్యూ పిటిషన్లు వేశాయని, అప్పుడు అధికారంలో ఉన్న జగన్ మాత్రం పట్టించుకోకుండా గిరిజనులకు అన్యాయం చేశారన్నారు. గిరిజనులకు సబ్ ప్లాన్ నిధులు అమలు చేసి సొంత కాళ్లపై నిలబెట్టిన ఘనత టీడీపీదన్నారు. గిరిజన ప్రాంతాలను గంజాయి వనంగా మార్చిన జగన్‌కు గిరిజనుల గురించి మాట్లాడే అర్హత లేదని, గిరిజనుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు.

పీఏజీ శరత్ చతుర్వేది బాధ్యతల స్వీకరణ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్(పీఏజీ)గా శరత్ చతుర్వేది బుధవారం విజయవాడలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చతుర్వేది 1994 బ్యాచ్‌కు చెందిన ఐఏఏఎస్ అధికారి. ఇప్పటి వరకు పీఏజీగా ఎస్. శాంతిప్రియ అదనపు బాధ్యతలు నిర్వహించారు. పీఏజీ కార్యాలయం అధికారులు, సిబ్బంది చతుర్వేదికి ఘనస్వాగతం పలికారు.

మార్కెటింగ్ స్థలాలను సంరక్షించాలి

» బదిలీలు, సిబ్బంది సమస్యలపై త్వరలో నిర్ణయం: మంత్రి అచ్చెన్న



అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల స్థలాలు అన్యాక్రాంతం కాకుండా, వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలి మంత్రి అచ్చెన్నాయుడు మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత, ఇతర అధికారులతో మంత్రి సమీక్ష జరిపారు. మార్కెటింగ్ శాఖకు చెందిన స్థలాల వివరాలతో పాటు అధిక విలువగల స్థలాలను సంరక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కోరారు. మార్కెట్ స్థలాలను పీపీపీ విధానంలో అద్దెకివ్వడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చే మార్గాలపై ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. గుంటూరు మిర్చి యార్డులో లైసెన్సుల విధానంపై గత సమీక్షలో తీసుకున్న నిర్ణయాలపై తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ అధికారుల బదిలీలు, సిబ్బంది సమస్యలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కాగా 2024-25 రబీ సీజన్‌లో శనగలు, కందులు, మినుములు, పెసలు, వేరుశనగ పంట ఉత్పత్తులను కనీస మద్దతు ధరలకు కొనుగోలు కోసం రాష్ట్ర స్థాయి నోడల్ ఏజెన్సీగా ఏపీ మార్క్‌ఫెడ్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



రాష్ట్ర బడ్జెట్ కూర్పుపై ఆర్థిక శాఖ అధికారులతో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్




గుంటూరులో కిమ్స్ శిఖర ఆసుపత్రిని ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రులు సత్యకుమార్, దుర్గేష్

నియోజక వర్గానికో స్పెషాలిటీ ఆస్పత్రి

» 300 పడకలతో ఏర్పాటుకు కృషి చేస్తా
» ఎక్కడ ఉన్నా గంటలోనే ఆస్పత్రికి..
» ఆ స్థాయిలో వైద్యసేవల విస్తరణ
» సంపూర్ణ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఉగాది నుంచి పీ-4 విధానం అమలు
» త్వరలో 'మన మిత్ర'లో ప్రైవేటు సేవలూ
» ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని, 300 పడకలతో మెరుగైన వైద్యం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు కాకాని రోడ్డులోని మంగళదాస్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన కిమ్స్ శిఖర ఆస్పత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. "ఎక్కడ ఉన్నా ఒక్క గంటలో ఆస్పత్రికి చేరేలా వైద్య సేవలను విస్తరిస్తాం. దీనికోసం ప్రభుత్వ భాగస్వామ్యం ఒక్కటే సరిపోదు. ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం అవసరం (పీ-4). ఈ ఉగాది నుంచి వారందరి భాగస్వామ్యంతో సంపూర్ణ పేదరిక నిర్మూలన లక్ష్యంగా పీ- 4 విధానాన్ని ప్రారంభిస్తున్నాం. లాభాలే కాదు.. సమాజం కోసం కూడా బతకాలి అనేలా అడుగులు వేస్తాం." అని సీఎం వెల్లడించారు. ప్రాధామ్యాలు తెలియని వ్యక్తులు పాలన చేస్తే ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి మంగళగిరి ఎయిమ్స్ మంచి ఉదాహరణ అని చంద్రబాబు అన్నారు. "విభజన చట్టం ద్వారా మనకు ఎయిమ్స్ ఇస్తే, దాన్ని మంగళగిరిలో పెట్టాను. అందుకోసం రూ.300 కోట్లు విలువ చేసే 183 ఎకరాల భూములు ఇచ్చాను. కేంద్రం కూడా రూ.1,618 కోట్లు ఖర్చు చేసి 960 పడకలతో ఆస్పత్రిని నిర్మించింది. అక్కడ ఓపీ పది రూపాయలే. దానికి గత ప్రభుత్వం నీరు ఇవ్వలేదు. పక్కనే కృష్ణానది ఉన్నా వారికి నీరు రాలేదు. దీంతో వారు ప్రతి రోజూ 600 ట్యాంకర్లతో నీళ్లు తెచ్చుకోవాల్సి వచ్చింది. ఆ ట్యాంకర్ల రాకపోకల తాకిడితో వాళ్లు ఓపీని కూడా ఆపుకోవాల్సి వచ్చింది. అదెలా ఉందంటే లక్ష రూపాయలు పెట్టి మంచి ఆవును కొనుక్కుని పగ్గం కట్టకుండా వదిలేసుకున్నట్లుగా ఉంది." అంటూ చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. అలాంటి దాన్ని ప్రభుత్వమని అంటారా అని నిలదీశారు. నాడు ఐటీ ప్రపంచం.. నేడు ఏఐ యుగం అని, దీనిని యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. వైద్యరంగంలో సేకరించిన సమాచార సంపదను ఏఐ ద్వారా మదింపు చేస్తే కొత్త వైద్య ప్రక్రియలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆపరేషన్లు కూడా ఏఐ గైడ్ చేసే పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలతోపాటు, వైద్యం వంటి ఇతర అత్యవసర ప్రైవేటు సేవలను కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. స్వర్ణాంధ్ర-2047ను వికసిత భారత్- 2047తో అనుసంధానం చేసి రాష్ట్రాన్ని దేశంలో ముందుండేలా చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. వైద్య ఖర్చులు తగ్గించేలా మేధావులు ఆలోచనలు చేయాలని, అవసరం లేకున్నా బెడ్లు నింపుకుని బాధితులపై భారం వేయకుండా ఆన్‌లైన్ ద్వారా వైద్యం అందించేలా చూడాలని సూచించారు. తప్పని స్థితి వస్తేనే ఆస్పత్రిలో వైద్యం అందించే విధానం వస్తేనే ప్రజలపై భారం తగ్గుతుందన్నారు. కాగా, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.....గత ప్రభుత్వం పెట్టిన రూ.6,500 కోట్ల వైద్య బకాయిలను ఒకవైపు తీర్చుతూ, మరోవైపు ఆరోగ్య సేవలను విస్తరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, కందుల లక్ష్మీ దుర్గేశ్, కిమ్స్ ఎండీ బొల్లినేని భాస్కరరావు, లోక్‌సభ టీడీపీ ఫ్లోర్‌లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



సంక్షేమం-అభివృద్ధికి సమప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరానికి రూ.2.94 లక్షల కోట్లతో నవంబర్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ నెల 24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో 28వ తేదీన అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వ విధ్వంసకర విధానాల వల్ల ఆర్థిక ఆరోగ్య సూచీలో రాష్ట్రం అట్టడుగు స్థాయిలో ఉంది. వైసీపీ ప్రభుత్వం భవిష్యత్ ఆదాయాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు తీసుకురావడం, మూలధన వ్యయంపై నిధులు ఖర్చు చేయకపోవడం వల్ల రాష్ట్రంలో ఆర్థిక ప్రతికూల పరిస్థితులు తలెత్తాయి. కానీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇసుకను ఉచితంగా అందించడం కోసం ఆదాయాన్ని కూడా వదులుకుంది. అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే పింఛన్లు పెంచారు. పింఛన్లపై సగటున నెలకు రూ.2,720 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. వీటితో పాటు దీపం 2, అన్నా క్యాంటీన్ పథకాలను అమలుచేస్తున్నారు. తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, ఉచిత బస్సు పథకాలను ఈ ఏడాది ప్రారంభిస్తున్నారు. దీంతో బడ్జెట్‌లో అటు పథకాలకు, ఇటు అభివృద్ధి కార్యక్రమాలకు సమప్రాధాన్యం కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల నేపథ్యంలో ప్రత్యేకసాయం అందించాలని 16వ ఆర్థిక సంఘాన్ని ఇప్పటికే సీఎం చంద్రబాబు కోరారు.



మంత్రి లోకేశ్‌తో సీఫీ చైర్మన్ రాజు వేగేశ్న

పెట్టుబడులకు పూర్వవైభవం

(మొదటి పేజీ తరువాయి)

ఎక్స్ వేదికగా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు పూర్వవైభవం వచ్చిందనడానికి హెచ్‌సీసీబీ పెట్టుబడుల కొనసాగింపే నిదర్శనమని చెప్పారు. పారిశ్రామిక హబ్‌గా రాష్ట్రం మారుతోందనడానికి, వ్యాపార కార్యకలాపాలకు అనుకూలంగా ఉందనడానికి కోకాకోలా పెట్టుబడులే ఓ ఉదాహరణ అని చెప్పారు. అభివృద్ధి విషయంలో, ఉద్యోగాల కల్పనలో, సామాజిక అభివృద్ధిలో వారి నిబద్ధతను స్వాగతిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి దోహదం చేసే వారి వ్యాపారానికి మద్దతు కొనసాగుతుందని తెలిపారు.

పెట్టుబడులకు సిఫీ ఆసక్తి

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సిఫీ టెక్నాలజీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజు వేగేశ్నకు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఉండవల్లి నివాసంలో లోకేశ్‌ను రాజు వేగేశ్న కలిశారు. విశాఖపట్నంలో మెగా డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. కంపెనీ విస్తరణపై లోకేశ్ ఆరా తీశారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ప్రభుత్వం అందిస్తోన్న సేవలు, నూతనంగా తీసుకువచ్చిన ఐటీ విధానాలను గురించి లోకేశ్ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిఫీ సీఎండీ ఆసక్తిని చూపారు. భవిష్యత్తు ప్రణాళికలను రాజు వేగేశ్న వివరించారు. ఆర్థికాభివృద్ధి బోర్డుతో చర్చించి తదుపరి వాణిజ్య ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన్ను లోకేశ్ కోరారు. అనంతరం రాజు వేగేశ్న మాట్లాడుతూ.. దేశంలో టాప్ 500 కంపెనీల్లో సిఫీ ఒకటి అన్నారు. దేశంలోని పలు నగరాలు, అనేక కంపెనీలు, బ్యాంకులతో సహా ఉత్తర అమెరికా, ఇంగ్లండ్, సింగపూర్‌లోని వివిధ కంపెనీలకు తమ కంపెనీ డేటా సేవలు అందిస్తుందని వివరించారు.

17న కుంభమేళాకు లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ నెల 17న మహా కుంభమేళాలో పాల్గొనేందుకు కుటుంబసమేతంగా ప్రయాగ్‌రాజ్ వెళ్లనున్నారు. అక్కడి నుంచి వారాణసీ చేరుకుని కాశీ విశ్వేశ్వరుని సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.

కలిసి నడవకపోతే కఠిన చర్యలు

మదనపల్లె ఎమ్మెల్యే, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిపై టీడీపీ అధిష్ఠానం సీరియస్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గం టీడీపీ నాయకుల నడుమ విభేదాలు భగ్గుమన్నాయి. నాయకులు రోడెక్కడంపై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబును తక్షణం పార్టీ కేంద్ర కార్యాలయానికి రప్పించారు. వారితో పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ దీపక్ రెడ్డి చర్చలు జరిపారు. ఇద్దరు నేతలు పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటూ పార్టీని రోడ్డున పడేస్తుండటంపై ప్రశ్నించారు. దీనికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పందిస్తూ... 'శ్రీరాం చినబాబు నాపై బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఎమ్మెల్యేనన్న కనీస గౌరవం ఇవ్వడం లేదు' అని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తనపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని శ్రీరాం చినబాబు పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. విభేదాలను పరిష్కరించి, పరిస్థితిని చక్కదిద్దాలని అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రాజును పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఇద్దరు నేతల వాదనలు విన్న పార్టీ పెద్దలు.. 'త్వరలో మదనపల్లె నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేయండి. నియోజకవర్గంలో సీనియర్ నాయకులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లండి' అని ఎమ్మెల్యేకు సూచించారు. ఎమ్మెల్యేపై బహిరంగంగా ఎలాంటి విమర్శలు చేయవద్దని శ్రీరాం చినబాబుకు సూచించారు. ఇద్దరూ కలిసి పని చేసుకోవాలని, మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వారం రోజుల్లో తిరుపతికి సీబీఐ చీఫ్

» టీటీడీ పూర్వ పాలకవర్గాన్ని ప్రశ్నించే వీలు
» అప్పటి కీలక అధికారులపైనా విచారణ!
» కమీషన్లు, పర్సెంటేజీలకు ఆశ పడ్డారా?
» అప్పటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి లొంగారా?
» లోతుగా ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్న సిట్
» నెయ్యి పరిమాణంలోనూ తేడాయే..



తిరుపతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ వారం రోజుల్లో తిరుపతికి వచ్చే అవకాశాలున్నాయి. తిరుపతిలోని సిట్ అధికారులతో బుధవారం సీబీఐ చీఫ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసు పురోగతిపై ఆరా తీశారు. ఈ సమీక్ష సందర్భంగా... ఏఆర్ డెయిరీ నుంచి నెయ్యి సరఫరాకు సంబంధించిన నిర్ణయాలు తీసుకున్న టీటీడీ మునుపటి ముఖ్యులను ప్రశ్నించే అంశం ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. సీబీఐ డైరెక్టర్ తాజా సమీక్ష, కొద్ది రోజుల్లో ఆయనే స్వయంగా తిరుపతికి వచ్చే అవకాశాలున్న దృష్ట్యా కల్తీ నెయ్యి సరఫరా కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయని ప్రచారం జరుగుతోంది. టీటీడీకి సంబంధించిన మునుపటి కీలక అధికారిని అదుపులోకి తీసుకుని విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి సేకరణకు సంబంధించిన టెండరు నిబంధనలను ఎందుకు సడలించాల్సి వచ్చింది? తక్కువ ధరకు కోట్ చేసిన నెయ్యిని ఎలా కొనుగోలు చేశారు? బహిరంగ మార్కెట్‌లో నెయ్యి ధర ఎక్కువ ఉండగా తక్కువకు సరఫరా చేయడం ఎలా సాధ్యం? తక్కువకు సరఫరా అంటే నాణ్యతలో రాజీ పడినట్టే కదా? అన్న అంశాలపై ప్రశ్నించాలని సిట్ భావిస్తున్నట్టు సమాచారం. కోట్లాది మంది భక్తులు అత్యంత పవిత్రంగా భావించే శ్రీవారి ప్రసాదాలకు వాడే నెయ్యి నాణ్యమైనదిగా ఉండాలని, అలాంటప్పుడు తక్కువ ధరకు సరఫరా చేసే నెయ్యి నాణ్యంగా ఉంటుందని అప్పటి టీటీడీ బాధ్యులు ఎలా భావించారు? దీనిపై ఎలా నిర్ణయాలు తీసుకున్నారనే ప్రశ్నలు సిట్ అధికారులను వేధిస్తున్నాయి. దీని వెనుక పర్సెంటేజీలు, కమీషన్లు వంటి ఆర్థిక లబ్ధి గానీ లేదంటే అప్పటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనైనా గానీ ఇలాంటి నిర్ణయాలు తీసుకుని ఉండాలని సిట్ అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. ఈ సందేహాల నివృత్తి కోసమూ, ఇప్పటికే అరెస్టయిన డెయిరీల ప్రతినిధులు తమకు తాముగానే ఈ వ్యవహారం నడిపారా లేక తెర వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అన్నది తేల్చుకునేందుకు సిట్ అధికారులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ముందుగా టీటీడీలోని అప్పటి కీలక అధికారిని, ఆపై పాలకమండలి ముఖ్యులను విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు సిట్ అధికారుల దర్యాప్తులో కొత్తగా మరో అంశం వెలుగు చూసినట్టు సమాచారం. ఏఆర్ డెయిరీ నుంచి టీటీడీకి సరఫరా చేసిన ఎనిమిది ట్యాంకర్లలో నాలుగింటిని అనుమతించి, మిగిలిన నాలుగింటిని తిరస్కరించిన సంగతి తెలిసిందే. అయితే ఆ ట్యాంకర్లలో సరఫరా చేసిన నెయ్యి పరిమాణంలో కూడా తేడాలున్నట్టు సిట్ గుర్తించింది. ట్యాంకరుకు కనీసం 2వేల నుంచి 3వేల కిలోల చొప్పున తేడా ఉన్నట్టు సమాచారం. టీటీడీకి అందజేసిన ట్రిప్ షీట్లలో ఎక్కువ పరిమాణం నమోదు చేశారని, అదే డెయిరీలోని లాగ్ షీట్లలో తక్కువ పరిమాణం నమోదు చేశారని తెలిసింది.

కస్టడీ పిటిషన్‌పై నేడు విచారణ

టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో అరెస్టయి రిమాండులో ఉన్న నలుగురు నిందితుల కస్టడీ కోసం సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం తిరుపతి రెండో ఏడీఎం కోర్టులో విచారణ జరగనుంది. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న నేరారోపణతో ఏఆర్, వైష్ణవి, భోలేబాబా డెయిరీలకు చెందిన నలుగురు కీలక వ్యక్తులను సిట్ గత ఆదివారం రాత్రి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అదే రోజు అర్ధరాత్రి స్థానిక రెండో ఏడీఎం కోర్టు నిందితులు నలుగురికీ 11 రోజుల పాటు రిమాండ్ విధించడంతో తిరుపతి సబ్ జైలుకు తరలించారు. మరుసటి రోజు సోమవారం సిట్ అధికారులు నిందితులు రాజశేఖరన్, పొమిల్ జైన్, విపిన్ జైన్, అపూర్వ వినయ్‌కాంత్ చావడాలను విచారణ నిమిత్తం కస్టడీకి తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై రెండో ఏడీఎం కోర్టు గురువారం విచారణ చేపట్టనుంది.

ఐదేళ్లలో అర్హులందరికీ గృహాలు

» గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 2,378 కోట్ల హౌసింగ్ నిధులు మురిగిపోయాయి
» పాత తప్పిదాలను సరిదిద్దుతాం
» గృహ నిర్మాణ మంత్రి పార్థసారథి



అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఐదేళ్లలో అర్హత ఉన్న ప్రతి పేదవానికీ శాశ్వత గృహ వసతి కల్పించాలనే దృఢ నిశ్చయంతో తమ ప్రభుత్వం ఉందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకపోవడం వల్ల దాదాపు రూ.2,378 కోట్ల కేంద్రం నిధులు మురిగిపోయాయని తెలిపారు. గృహ నిర్మాణ నిధులు దాదాపు రూ. 3,598 కోట్లను మళ్లించి నిరుపేదలకు ఎంతగానో అన్యాయం చేసిన ఘనత గత ప్రభుత్వానిదే అని మంత్రి విమర్శించారు. నిరుపేదలందరికీ శాశ్వత గృహ వసతి, కల్పించడంలో విఫలమైన గత ప్రభుత్వం.. కూటమి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి మండిపడ్డారు. అమరావతి సచివాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు గృహ నిర్మాణాలపై కేంద్రం రూ.20,726 కోట్లు రాష్ట్రానికి కేటాయిస్తే, ఆ నిధులను సక్రమంగా వినియోగించుకోకపోవడమే కాకుండా ఇళ్లను సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల దాదాపు రూ.2378 కోట్ల కేంద్ర నిధులు మురిగిపోయాయన్నారు. పీఎంఏవై గ్రామీణ్ కేంద్ర పోర్టల్ నుంచి 1,39,243 మంది లబ్ధిదారులను తొలగించి వారికి అన్యాయం చేశారన్నారు. ఈ విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని అంతా వక్రీకరిస్తూ తమ ప్రభుత్వంపై బురద జల్లే విధంగా ప్రవర్తించడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే ఐదేళ్లలో అర్హత ఉన్న ప్రతి పేదవానికీ శాశ్వత గృహ వసతి కల్పిస్తామని మంత్రి తెలిపారు.

నగ్నంగా నిలబెట్టి.. మర్మాంగాలకు డంబెల్స్ వేలాడదీసి..

» ర్యాగింగ్ పేరుతో ముగ్గురు జూనియర్లకు సీనియర్ల నరకం
» కేరళలోని కొట్టాయం ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో ఘటన

కొట్టాయం, ఫిబ్రవరి 12: కేరళలోని ఓ నర్సింగ్ కాలేజీలో సీనియర్లు ర్యాగింగ్ పేరుతో జూనియర్లను నగ్నంగా నిలబెట్టి.. వారి మర్మాంగాలకు కసరత్తుల కోసం ఉపయోగించే డంబెల్స్ వేలడదీశారు. ఆపై మర్మాంగాలకు కంపాస్‌లోని పదునైన పరికరాలను గుచ్చి తీవ్రంగా గాయపర్చారు. ఒకట్రెండ్రోజులు కాదు.. ఏకంగా మూడునెలల పాటు వారి దమనకాండ కొనసాగింది. కొట్టాయం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఈ దారుణం జరిగింది. మూడో సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు, మొదటి సంవత్సరం చదువుతున్న ముగ్గురిని ఈ విధంగా చిత్రహింసలకు గురిచేశారు. రక్తమోడుతున్న గాయాలపై బాధితులు లోషన్ పూసుకుంటే, ఇది తెలిసి ఆ ముగ్గురు సీనియర్లు మరింత రెచ్చిపోయారు. ఆ లోషన్‌ను బలవంతంగా బాధితుల నోట్లో పిండి పైశాచికానందం పొందారు. బాధితుల పట్ల తమ దుశ్చేష్టలన్నీ వీడియో తీశారు. ఎవరికైనా చెప్తే అకడమిక్ కెరీర్‌ను నాశనం చేస్తామని బెదిరించారు. అయితే, వారి రాక్షస చర్యలు ఎలా బయటపడ్డాయంటే.. సదరు ఐదుగురు సీనియర్లు మద్యానికి బానిసలు! జూనియర్ విద్యార్థుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసేవారు. వారి చిత్రహింసలు భరించలేక.. ఓ విద్యార్థి తన గోడునంతా ఫోన్లో తండ్రితో చెప్పుకొన్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయాలంటూ కుమారుడికి ఆయన చేసిన సూచనే ర్యాగింగ్ భూతాన్ని బయటపెట్టింది.

'అయోధ్య' ప్రధాన అర్చకుడు సత్యేంద్ర దాస్ కన్నుమూత



లక్నో, ఫిబ్రవరి 12: అయోధ్య రామ మందిరం ప్రధాన అర్చకుడు సత్యేంద్ర దాస్ (85) బుధవారం కన్నుమూశారు. లక్నోలోని సంజయ్‌గాంధీ మెడికల్ పీజీ ఆస్పత్రిలో బ్రెయిన్ స్ట్రోక్‌కు చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించిందని, ఈనెల 3 నుంచి న్యూరాలజీ వార్డులోని హై డిపెన్డెన్సీ యూనిట్‌లో ఆయనకు చికిత్స అందించామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సత్యేంద్ర దాస్ పార్థివదేహాన్ని అయోధ్యలోని ఆయన ఆశ్రమం సత్యధామ్ గోపాల్ మందిర్‌కు తరలించారు. సత్యేంద్ర దాస్ బంధువుల రాకకోసం ఎదురు చూస్తున్నామని, గురువారం మధ్యాహ్నం సరయూ నది తీరంలో అంత్యక్రియలు పూర్తి చేస్తామని తదుపరి ప్రధాన అర్చకుడు ప్రదీప్ దాస్ తెలిపారు. సత్యేంద్ర దాస్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. ఆయన జీవితం రాముడి సేవకే అంకితం చేశారని చెప్పారు.

విశాఖకు మళ్లీ క్రూయిజర్



- జూన్-జూలైలో మూడు ట్రిప్పులు
- వెల్లడించిన కార్డెలియా సంస్థ

విశాఖపట్నం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో పర్యాటకుల కోసం క్రూయిజ్‌లను నడిపే కార్డెలియా సంస్థ చెన్నై-విశాఖపట్నం-పాండిచ్చేరి-చెన్నైల మధ్య మరోసారి క్రూయిజ్ నడపడానికి ముందుకొచ్చింది. ఈ ఏడాది జూన్ 30 నుంచి జూలై 19వ తేదీ మధ్యలో మూడు ట్రిప్పులు నడుపుతామని ప్రకటించింది. మూడేళ్ల క్రితం అంటే 2022 జూన్‌లో ఇదే సంస్థ ఇప్పుడు ప్రకటించిన మార్గంలోనే 'ఎంప్రెస్ క్రూయిజ్ నౌక' ను నడిపింది. అప్పుడు ఒక్కో ట్రిప్పులో 1,200 మంది వరకు ప్రయాణించారు. అప్పటికి విశాఖపట్నం పోర్టులో క్రూయిజ్ టెర్మినల్ పూర్తికాకపోవడంతో ఆ పక్కనే ఉన్న అదానీ బెర్తు వద్ద పర్యాటకులు దిగే ఏర్పాట్లు చేశారు. ఆ నౌక సామర్థ్యం 2,100 మంది కాగా 85 శాతం ఆక్యుపెన్సీతో నడిచింది. మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు పోర్టులో అధునాతన టెర్మినల్ అందుబాటులో ఉన్నందున క్రూయిజ్‌ను నడపాలని కార్డెలియో ప్రతినిధులను ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అధ్యక్షుడు విజయమోహన్ కోరగా... మూడు ట్రిప్పులు నడపడానికి అంగీకరించింది. క్రూయిజ్ నౌక జూన్ 30న చెన్నైలో బయలుదేరి జూలై 2న విశాఖపట్నం వస్తుంది. అదేరోజు తిరిగి ఇక్కడ నుంచి బయలుదేరి 4వ తేదీన పుదుచ్చేరి చేరుతుంది. అదేరోజు అక్కడి నుంచి బయలుదేరి 5వ తేదీన చెన్నై వెళుతుంది. దీంతో ఒక ట్రిప్పు పూర్తవుతుంది. ఆ తరువాత జూలై 7వ తేదీన మరో ట్రిప్పు ప్రారంభమై అదే మార్గంలో 12వ తేదీన చెన్నైలో ముగుస్తుంది. మూడో ట్రిప్పు జూలై 14న చెన్నైలో మొదలై తిరిగి 19వ తేదీన ముగుస్తుంది. ఒక్కో ట్రిప్పులో చెన్నైలో ఎక్కి తిరిగి చెన్నైలో దిగితే క్రూయిజ్ ఐదు రాత్రులు సముద్రంలో ఉంటుంది.

అప్పుడు టికెట్ ధర రాత్రికి రూ.9,300

క్రూయిజ్‌ను మూడేళ్ల క్రితం నడిపినప్పుడు ఇదే సంస్థ ఒక రాత్రి ప్రయాణానికి పెద్దలకు రూ.9,300 చొప్పున విశాఖ నుంచి చెన్నై వెళ్లడానికి మూడు రాత్రులకు గాను రూ.27,900 తీసుకుంది. అయితే చెన్నై నుంచి విశాఖపట్నం వచ్చినవారు రెండు రాత్రులకు రూ.18,600 చెల్లించారు. షెడ్యూల్ ప్రకటించిన వెంటనే టికెట్లు బుక్ చేసుకున్న వారికి ఒక రాత్రికి రూ.8 వేలు వసూలు చేశారు. ఆ తర్వాత ఒక రాత్రికి రూ.13 వేల వరకు పెంచారు. క్రూయిజ్‌లో అల్పాహారం, భోజనం ఉచితం. మద్యం, వై-ఫైలకు అదనపు చార్జీలు వసూలు చేస్తారు.

ఇంకా ధరలు నిర్ణయించాల్సి ఉంది

కార్డెలియో సంస్థ చెన్నై నుంచి విశాఖపట్నం-పుదుచ్చేరి మీదుగా మరోసారి చెన్నైకి క్రూయిజ్ నడపడానికి షెడ్యూల్ ప్రకటించింది. అయితే టికెట్ రేట్లను ఇంకా ఇవ్వలేదు. త్వరలోనే ఖరారు చేసే అవకాశం ఉంది. ఎక్కువ మంది ప్రయాణించేలా కాస్త తక్కువ రేట్లు పెట్టాలని సూచించాం.

- కె.విజయమోహన్, అధ్యక్షుడు, ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్

శ్రీకాకుళంలో జీబీఎస్ కలకలం!

- బాలుడి మృతిపై అనుమానం
- గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో
- నిర్ధారణకు రావాల్సి ఉందని వెల్లడి
- విద్యార్థులు, గ్రామస్థులకు వైద్య పరీక్షలు



సంతబొమ్మాళి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలసలో గులియన్ బారీ సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి కలకలం రేగింది. ఇటీవల గ్రామంలో వాతాడ యువంత్ అనే పదేళ్ల బాలుడు ఈ వ్యాధితో మృతి చెందాడని ప్రచారం జరుగుతుండడంతో గ్రామస్థులు భయాందోళనలు చెందుతున్నారు. మహారాష్ట్రలో ఈ వ్యాధితో చాలామంది మృతి చెందగా, ఇటీవల తెలంగాణలో కూడా వ్యాధి లక్షణాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో కాపుగోదాయవలసలో ఈ వ్యాధి సోకి బాలుడు మృతి చెందాడన్న అనుమానంతో జిల్లా వైద్యాధికారి బాలమురళీకృష్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది బుధవారం గ్రామాన్ని సందర్శించింది. బాలుడి తల్లి రోజా నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జనవరి 29వ తేదీన యువంత్‌కు పుట్టినరోజు వేడుక నిర్వహించామని, ఆ మరుసటి రోజు నీరసంగా ఉందంటూ లేవలేకపోవడంతో ప్రైవేటు వైద్యుడికి చూపించామని బాలుడి తల్లి తెలిపారు. డాక్టర్ సలహా మేరకు శ్రీకాకుళంలోని పలు ఆసుపత్రుల్లో చూపించిన తర్వాత విశాఖకు తరలించామన్నారు. అక్కడ వైద్యులు పరిశీలించి గులియన్ బారీ సిండ్రోమ్ అని చెప్పారని తెలిపారు. అక్కడి నుంచి రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించామని, అక్కడ బ్రెయిన్‌డెడ్‌తో మృతి చెందాడని చెప్పారు. బాలుడి నేత్రాలు, ఇతర అవయవాలను దానం చేశామని రోజా తెలిపారు. అంతకుముందు ఏవైనా వ్యాధి లక్షణాలు కనిపించాయా? అని వైద్యులు అడిగి తెలుసుకున్నారు బాలుడికి నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలను పరిశీలించారు. అనంతరం వైద్య బృందం గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న, గొంతునొప్పి లక్షణాలు ఉన్న వారి వివరాలు సేకరించారు. పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

నిర్ధారణ కావాల్సి ఉంది

'బాలుడు యువంత్ జీబీఎస్‌తో మృతి చెందాడన్న దానిపై పూర్తి స్థాయిలో నిర్ధారణకు రావాల్సి ఉంది. నివేదికల్లో ఒక దాంట్లో మాత్రమే ఈ వ్యాధి సోకినట్లు ఉంది. ఇటువంటి వ్యాధి మూడు లక్షల మందిలో ఒకరికి సోకుతుంది. గ్రామంలో పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం' అని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి బాలమురళీకృష్ణ తెలిపారు.

అర్థమవుతోందా.. సీఎం సార్!?

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలల్లోనూ విద్యార్థులకు అవగాహన కల్పించాలని... ప్రజాభిప్రాయాలూ తెలుసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. డాక్యుమెంట్‌లో ఉన్న 10 సూత్రాలను అంశాల వారీగా గ్రామస్థాయిలో ప్రజల్లో చర్చకు పెట్టాలని ప్రజాప్రతినిధులను పలుమార్లు ఆదేశించారు. ఒకరికి చెప్పాలంటే... వీళ్లకు అర్థం కావాలి కదా! అందుకే... 230 పేజీల విజన్ డాక్యుమెంట్‌ను అర్థం చేసుకునేందుకు అధికారులు ప్రయత్నించారు. కానీ... ఆ ప్రయత్నంలో విఫలమయ్యారు. ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థలు కేపీఎంజీ, బీసీజీ (బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్) రూపొందించిన ఈ డాక్యుమెంట్ ప్రపంచ స్థాయి ఇంగ్లిష్ భాషతో అధికారులను, ప్రజాప్రతినిధులను హడలగొడుతోంది. ప్రతి పేజీలో అర్థం కాని పదజాలంతో కన్సల్టెంట్లు తమ భాషా పరిజ్ఞానం చాటుకున్నారు. సామాన్యుల విషయం అటుంచితే... ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులకు కూడా అర్థం కాని పరిస్థితి.

2020లో ఇలా...: చంద్రబాబు అప్పట్లో విజన్-2020 విడుదల చేశారు. అది కూడా ప్రపంచ బ్యాంకు 'భాష'లో ఉన్నప్పటికీ ప్రజలకు కొంత దగ్గరైంది. ఇప్పుడు 'స్వర్ణాంధ్ర-2047' దీనికి పూర్తి భిన్నంగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

రాసినోళ్లకే ఎరుక: సాధారణంగా ప్రభుత్వం తాను ప్రచారం చేయదలుచుకున్న అంశాలను సరళంగా, పంచ్ లైన్లతో,ప్రాసలతో తయారుచేయిస్తుంది.కానీ స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్‌లో ఉన్న భాషను అర్థం చేసుకోలేక అధికారులు,ప్రజాప్రతినిధులు తంటాలు పడుతున్నారు. మీడియాకైనా అర్థమయ్యేలా వివరించి ఉంటే అసలు ఉద్దేశం ప్రజలకు చేరేది. దానిపై వ్యక్తమయ్యే భిన్నాభిప్రాయాలు ప్రభుత్వానికి తెలిసేవి. ఇప్పుడు ఆ అవకాశమే లేకుండా పోయింది. విజన్ డాక్యుమెంట్‌లో వ్యవసాయం గురించి రాసుకొచ్చారు. కానీ, ఆ రంగం అభివృద్ధికి ప్రభుత్వం ఏం చేయాలనుకుంటోందో రైతులకు అర్థంకాదు. ఎనర్జీ రంగంలో చేపట్టాల్సిన ప్రాజెక్టుల గురించి రాసేందుకు వాడిన భాష ఇనుప గుగ్గిళ్లలా జీర్ణం కానే కాదు!

బాబోయ్ చికెన్ వద్దు!

(మొదటి పేజీ తరువాయి)

అమ్ముతున్నారు. బర్డ్ ఫ్లూ వచ్చిన ప్రాంతాల్లో చికెన్, గుడ్లు తినవద్దని అధికారులు ప్రచారం చేయడంతో దీని ప్రభావం ఇతర ప్రాంతాలపైనా పడింది. చాలా పట్టణాలు, గ్రామాల్లో అమ్మకాలు జరగడం లేదు. గుడ్లు, చికెన్ విక్రయాలు ఆపేయాలని యజమానులకు అధికారులు నోటీసులు పంపించడంతో వారు షాపులకు తాళాలు వేస్తున్నారు. పూర్తిగా వ్యాపారాలు నిలిపివేయడంతో షాపుల్లో పనిచేసే వారికి ఉపాధి లేకుండా పోయింది. వ్యాపారాలు సాగనపుడు రోజువారీ ఖర్చులన్నీ భారమవుతాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఈ ప్రభావం కనీసం రెండు నెలలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.



పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరులో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయిన కోళ్ల ఫారం

పౌల్ట్రీలపై భారం..

కోళ్ల మృత్యువాత పడిన తర్వాత.. వ్యాక్సిన్, శానిటేషన్ కోసం ప్రతి పౌల్ట్రీలోనూ రూ.10 లక్షల వరకు ఖర్చు పెట్టారు. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే గుడ్లు పెట్టే కోళ్లు 1.15 కోట్ల వరకు ఉండేవి. వ్యాధుల వల్ల దాదాపు 40 లక్షల వరకు మృత్యువాత పడ్డాయి. పైగా ఇప్పుడు గుడ్డు ధరలు తగ్గిపోవడంతో పౌల్ట్రీలు మూసేయాలని రైతులు నిర్ణయించారు. గుడ్లు పెట్టే ఫారం కోడిని రూ.10లకే విక్రయిస్తున్నారు. రాష్ట్రంలో ప్రతిరోజూ 2.50 కోట్ల మేర గుడ్లు ఉత్పత్తి అవుతుంటాయి. ప్రస్తుతం 1.60 కోట్లు మాత్రమే ఉత్పత్తి అవుతున్నట్టు రైతులు చెబుతున్నారు. అయినప్పటికీ ధరలు పతనమయ్యాయి. మరోవైపు తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారం, పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరు పరిధిలో పది కిలోమీటర్ల మేర ప్రకటించిన అలెర్ట్ జోన్‌లో దాదాపు 80 లక్షల వరకు కోళ్లు ఉన్నాయి. వాటి అమ్మకాలనూ నిలిపివేశారు. ఇక్కడ మధ్యాహ్న భోజన పథకం, అంగన్ వాడీ కేంద్రాలకు గుడ్ల సరఫరాను నిలిపివేశారు. ఉన్నట్టుండి షాపులు మూసేయడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని తణుకులో చికెన్ వ్యాపారి చిలుకూరి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

బర్డ్‌ఫ్లూపై ఆందోళన వద్దు: మంత్రి అచ్చెన్న

అమరావతి: బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని, బాగా ఉడికించిన కోడిగుడ్లు, చికెన్ తినొచ్చని పశుసంవర్థక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. బుధవారం రాత్రి ఉండవల్లిలోని సీఎం నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఏలూరు జిల్లా బాదంపూడిలో 2.2 లక్షలు, పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరులో 2.5లక్షలు, కానూరులో 65వేలు, ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో 7వేల కోళ్లు చనిపోయినట్లు సమాచారం వచ్చింది. వెంటనే ఆ కోళ్ల నమూనాలను పరీక్షించగా బర్డ్ ఫ్లూ వైరస్ బయటపడింది. దీంతో గుడ్లు, చికెన్ తినకూడదన్న ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి ఈ వ్యాధి పూర్తిగా నాశనమౌతుంది. కోడి మాంసం, గుడ్లు బాగా ఉడికించి, తింటే ఇబ్బంది లేదు. 70 డిగ్రీలపైన వేడి ఉంటే.. వ్యాధి ప్రభావం ఉండదు' అని అచ్చెన్న చెప్పారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో అప్రమత్తమైన పశుసంవర్థక శాఖ రాష్ట్రవ్యాప్తంగా 721 రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయిన ప్రాంతంలో కిలో మీటర్ పరిధిలో అలెర్ట్ జోన్‌గా ప్రకటించారు.

చికెన్, గుడ్లు ఉడికించి తినొచ్చు: ప్రభుత్వం

అలెర్ట్ జోన్ మినహా మిగతా ప్రాంతాల్లో బాగా ఉడకబెట్టిన కోడి గుడ్లు, చికెన్ నిర్భయంగా తినొచ్చని పశుసంవర్థక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు ఓ ప్రకటనలో చెప్పారు. కోళ్ల పెంపకందారులు, ప్రజలకు ఆయన కొన్ని సూచనలు చేశారు. 'కోళ్ల షెడ్ల ప్రవేశ మార్గంలో ఫుట్‌బాత్‌లు ఏర్పాటు చేసుకోవాలి. దీనికి 0.01శాతం పొటాషియం పర్మాంగనేట్ వాడాలి. కోళ్ల షెడ్ల పరిసరాల్లో 2శాతం సోడియం హైపోక్లోరైట్ లేదా బ్లీచింగ్ పౌడర్ లేదా సున్నం చల్లాలి. పౌల్ట్రీల్లో పనిచేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ఏదైనా కోడి చనిపోతే పూడ్చిపెట్టాలి. ఇతర జీవ భద్రతా చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.

బాదంపూడిలో బర్డ్‌ఫ్లూ..

ఉంగుటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం బాదంపూడిలోని శ్రీ వేంకట మణికంఠ పౌల్ట్రీ ఫారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్టు పరీక్షల్లో నిర్ధారణ అయింది. దీంతో పది కిలోమీటర్ల పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. బాదంపూడి పౌల్ట్రీ నుంచి కిలోమీటరు పరిధిని రెడ్ జోన్ గాను, పది కి.మీ. పరిధిని సర్వేలెన్స్ జోన్‌గా ప్రకటించారు.

సునీల్ కుమార్‌పై ఏసీబీకి లేఖ రాస్తా

- న్యాయవాది కాని తులసిబాబుకు నగదు చెల్లింపుపై విచారణ కోరతా
- ఖాళీగా కూర్చోబెట్టి జీతం ఇస్తున్నారు
- రూ.కోట్లలో అవినీతికి పాల్పడ్డ సునీల్‌ను ఎందుకు సస్పెండ్ చేయడం లేదు?: రఘురామ
- కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు కోర్టుకు డిప్యూటీ స్పీకర్



కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు జిల్లా కోర్టుకు హాజరైన రఘురామకృష్ణరాజు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది కాని వ్యక్తికి భారీగా నగదు చెల్లించిన వ్యవహారంలో సీఐడీ అదనపు మాజీ డీజీ పీవీ సునీల్ కుమార్‌పై న్యాయ విచారణ కోరుతూ ఏసీబీకి లేఖ రాయనున్నట్టు డిప్యూటీ సీఎం రఘురామకృష్ణరాజు వెల్లడించారు. కస్టోడియల్ టార్చర్ కేసులో వాంగ్మూలం ఇచ్చేందుకు బుధవారం ఆయన గుంటూరులోని ఐదో జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు వచ్చారు. న్యాయమూర్తి కె.లత 164 సీఆర్‌పీసీ కింద ఆయన వాంగ్మూలం నమోదు చేశారు. అనంతరం రఘురామ మీడియాతో మాట్లాడారు. "తులసిబాబు హైకోర్టులో, విజయ్‌పాల్ కింది కోర్టులో దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ విచారణకు వచ్చిన సందర్భంలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. సునీల్‌కుమార్, తులసిబాబుకు మధ్య ఉన్న అనుబంధం బయటపడింది. సునీల్ కుమార్ ప్రోద్బలంతో సీఐడీ కేసుల్లో న్యాయ సలహాదారుగా 2021 మేలో తులసిబాబును నియమించారు. అప్పటికి తులసిబాబు న్యాయవాది కాదు. నాపై కస్టోడియల్ టార్చర్ జరిగిన తర్వాత, 2021 అక్టోబరులో గానీ ఆయన బార్ అసోసియేషన్‌లో ఎన్‌రోల్ చేయించుకోలేదు. హైకోర్టులో ట్రయల్ నడపడం కోసమే తులసిబాబును తీసుకున్నామని ఆయన నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కానీ, సీఐడీ కేసుల్లో హైకోర్టులో ట్రయల్ జరగదు. కింది కోర్టుల్లో అంటే జిల్లా కోర్టులోగాని, ట్రయల్ కోర్టుల్లో మాత్రమే జరుగుతుంది. అయినా తులసిబాబుకు గత జగన్ ప్రభుత్వం కోటి రూపాయలు చెల్లించింది" అని వివరించారు. న్యాయవాది కాని వ్యక్తిని న్యాయ సలహాదారుగా పెట్టుకోవడం తప్పని, ఇది అవినీతి కిందకే వస్తుందని రఘురామ తెలిపారు. దీనిపై విచారణ జరపాలని ఏసీబీకి లేఖ రాయబోతున్నానని తెలిపారు. సునీల్‌కుమార్ అవినీతిపై ఏసీబీ విచారణ కూడా మొదలైందని 'ఆంధ్రజ్యోతి'లో చదివానని, అయినా ఆయనను ఎందుకు సస్పెండ్ చేయడం లేదో తెలియడం లేదన్నారు. "సునీల్‌కుమార్‌కు ఎటువంటి బాధ్యతలు ఇవ్వకుండా ఖాళీగా కూర్చోబెట్టి జీతం ఇస్తున్నారు. ఆయన దుబాయ్, అమెరికాల్లో తిరుగుతూ తన వ్యాపారాలు చక్కబెట్టుకుంటున్నారు. కనీసం కార్యాలయానికి వచ్చి సంతకం చేయమన్నా చేయడం లేదు. అయినా ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది." అని పేర్కొన్నారు. ఐపీఎస్ అధికారి అయి ఉండి సునీల్‌కుమార్ అసోసియేషన్ పెట్టడం పెద్ద తప్పు అని రఘురామ అన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా సభ పెడతానని సర్వీసులో ఉన్న ఒక అధికారిగా సునీల్ కుమార్ ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు.

జగన్ చెప్పేవన్నీ అబద్ధాలే..

జగన్ చెప్పేవన్నీ అబద్ధాలేనని, ఆయన సభా సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు విమర్శించారు. "సభలో 10 శాతం కంటే తక్కువగా సభ్యులు ఉంటే ప్రతిపక్ష హోదా ఇవ్వడం కుదరదు. ఈ విషయంలో స్పీకర్‌కు కోర్టు సమన్లు ఇచ్చిందని జగన్ అబద్ధం చెప్పారు. కోర్టు స్పీకర్‌కు సమన్లు ఇవ్వలేదు. జగన్ బడ్జెట్ సమావేశాలకు రావాలి" అని రఘురామ వ్యాఖ్యానించారు. జగన్ వెంట్రుక పీకుతామో లేదో గానీ ఆయన పదవి ఉంటుందో పోతుందో చూద్దామంటూ.. ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన వ్యాఖ్యానించారు.

విజయ్ పాల్‌కు బెయిలు

ఒంగోలు క్రైం, గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్‌కు గురి చేసిన కేసులో నాలుగో నిందితుడైన నాటి సీఐడీ అదనపు ఎస్పీ ఆర్ విజయ్‌పాల్‌కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం రెండో జిల్లా అదనపు సెషన్స్ జడ్జి నాగరాజా షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. రూ.50 వేల పూచీకత్తుతో, ఇద్దరు షూరిటీ ఇవ్వాలని ఆదేశించారు. అంతేగాక ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య సంబంధిత కేసు విచారణ అధికారి ఎదుట హాజరు కావాలని షరతు విధించారు. విచారణ అధికారికి సహకరించాలని ఆదేశించారు. అంతేగాక కేసులో సాక్షులను ప్రభావితం చేయడం గానీ, వారిని బెదిరించడం గాని చేయరాదని స్పష్టం చేశారు. కోర్టు అనుమతి లేకుండా కేసు తేలే వరకు దేశం విడిచి వెళ్లరాదని కూడా షరతు విధించారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నిందితులకు ముందస్తు బెయిల్

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో సుమారు 45 మందికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి పార్థసారథి బుధవారం ఉత్తర్వులిచ్చారు.

మరోసారి పోలీసు కస్టడీకి తులసిబాబు

రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో 6వ నిందితుడుగా ఉన్న కామేపల్లి తులసిబాబును మరోసారి పోలీసులు కస్టడీలోకి తీసుకోనున్నారు. ఈమేరకు న్యాయమూర్తి ఒక రోజు అనుమతి ఇచ్చారు. గురువారం తులసిబాబును పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారించి శుక్రవారం తిరిగి న్యాయమూర్తి ఎదుట హాజరు పరచనున్నారు.



ఆనర్స్ డిగ్రీపై రివర్స్!

- డిగ్రీ నాలుగో ఏడాదిపై విద్యార్థులు, కాలేజీల అనాసక్తి
- వైసీపీ ప్రభుత్వ హయాంలో హడావుడిగా అమల్లోకి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీపై రాష్ట్ర విద్యార్థుల్లో ఎక్కడా ఆసక్తి కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్షన్నర మంది విద్యార్థులు డిగ్రీ చదువుతుంటే వారిలో పట్టుమని వెయ్యి మంది కూడా నాలుగో ఏడాది డిగ్రీలో కొనసాగట్లేదు. పూర్వపు విధానంలోనే మూడేళ్ల డిగ్రీ పూర్తికాగానే సర్టిఫికెట్ తీసుకుని బయటికొచ్చేస్తున్నారు. ప్రైవేటు డిగ్రీ కాలేజీలు అసలు నాలుగేళ్ల డిగ్రీ కోర్సులనే అందించడం లేదు. ప్రభుత్వ కాలేజీల్లో కొన్ని చోట్ల కోర్సులు ఉన్నా విద్యార్థులు చదివేందుకు ముందుకు రావట్లేదు. డిగ్రీ అంటే కచ్చితంగా మూడేళ్లు చదవాలి. అయితే, జాతీయ విద్యా విధానం-2020లో నాలుగేళ్ల డిగ్రీ విధానం తెరపైకి వచ్చింది. నాలుగేళ్లలో ఎప్పుడైనా బయటికి వచ్చేలా కొత్త డిగ్రీ విధానం తీసుకొచ్చారు. డిగ్రీ ఒక్క ఏడాది మాత్రమే చదివితే దాన్ని సర్టిఫికెట్ కోర్సుగా భావిస్తారు. రెండేళ్లు చదివి బయటికొస్తే దానిని డిప్లొమా కోర్సు అంటారు. మూడేళ్లు పూర్తిచేస్తే డిగ్రీ సర్టిఫికెట్ వస్తుంది. నాలుగో ఏడాది కూడా కోర్సులో కొనసాగి పూర్తిచేస్తే విద్యార్థికి ఆనర్స్ డిగ్రీ దక్కుతుంది. దీనివల్ల పీజీలో నేరుగా రెండో సంవత్సరంలో చేరొచ్చు. అలాగే నాలుగేళ్ల ఆనర్స్‌తో పాటు రీసెర్చ్ ఎంపిక చేసుకుని డిగ్రీ చదివితే ఆ విద్యార్థులు అనంతరం పీహెచ్‌డీకి వెళ్లే వెసులుబాటు ఉంది.

హడావుడిగా అమలు

జాతీయ విద్యా విధానంలో ఆనర్స్ డిగ్రీ ఐచ్ఛికం అయినప్పటికీ అప్పటి వైసీపీ ప్రభుత్వం హడావుడిగా అమల్లోకి తీసుకొచ్చింది. దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించకుండా నాలుగేళ్ల డిగ్రీ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనిపై ప్రైవేట్ కాలేజీలన్నీ అనాసక్తి ప్రదర్శించాయి. 160 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 14 కాలేజీలే ఆనర్స్ డిగ్రీని అందిస్తున్నాయి. ఆ కాలేజీల్లోనూ చాలా తక్కువ మంది విద్యార్థులే నాలుగో సంవత్సరంలో కొనసాగుతున్నారు. మూడేళ్ల డిగ్రీ ఓ కాలేజీలో పూర్తిచేసి, నాలుగో సంవత్సరం కోసం ఆనర్స్ అందించే కాలేజీలో విద్యార్థులు చేరే అవకాశం ఉన్నా విద్యార్థులెవరూ ముందుకు రావట్లేదు. ఇక ఇప్పటి వరకూ డిగ్రీలో మూడు సబ్జెక్టులు ఉండగా 2023-24 నుంచి సింగిల్ సబ్జెక్టు విధానాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ విధానంలో విద్యార్థి ఏదైనా ఒక్క సబ్జెక్టును మేజర్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవాలి. మొదటి సెమిస్టర్ అనంతరం మరో సబ్జెక్టును మైనర్‌గా ఎంచుకోవాలి. అంటే మూడు సబ్జెక్టుల స్థానంలో రెండు సబ్జెక్టులు వచ్చాయి. వీటిలోనూ మైనర్ సబ్జెక్టుకు ప్రాధాన్యం ఉండదు. దీనివల్ల అనేక కాలేజీల్లో పలు సబ్జెక్టులు తొలగించారు. అదే మూడు సబ్జెక్టుల కాంబినేషన్ విధానం ఉంటే విద్యార్థులు దేనిపై అయినా పీజీ చేయొచ్చు. ఇప్పుడు సింగిల్ మేజర్ విధానంలో మేజర్, మైనర్ సబ్జెక్టులపైనే పీజీ చేయాలి.

రంజాన్ మాసంలో గంట ముందే ఇళ్లకు!

- ముస్లిం ఉద్యోగులకు ప్రభుత్వం అనుమతి



అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి రోజూ ముస్లిం ఉద్యోగులు గంట ముందే ఇళ్లకు వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, గ్రామ, వార్డు సచివాలయాలతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించే ముస్లిం ఉద్యోగులందరినీ గంట ముందుగానే విధులు ముగించుకుని వెళ్లేందుకు అనుమతిస్తారని పేర్కొన్నారు. మార్చి 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ మేరకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ మేరకు మార్గదర్శకాలను అమలు చేయాలంటూ అన్ని ప్రభుత్వ విభాగాధిపతులకు, జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి ఫరూక్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వేర్వేరు ప్రకటనల్లో కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో జల వనరుల శాఖ శిక్షణా సంస్థ

- తాత్కాలికంగా ఆ శాఖ సముదాయంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జల వనరుల శాఖ శిక్షణా సంస్థ (డబ్ల్యూఆర్‌టీఐ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రం నుంచి జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (అడ్వాన్స్) కింద రూ.500 కోట్ల నిధులు వచ్చే వరకూ ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడకుండా విజయవాడలో తాత్కాలికంగా జల వనరుల శాఖ కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేయాలని భావిస్తోంది. రాష్ట్ర విభజన జరిగాక ఏపీలో జల వనరుల శాఖ ఇంజనీరింగ్ సిబ్బందికి అధ్యయన వేదిక లేకుండా పోయింది. అలాగే కొత్తగా ఇంజనీరింగ్ అధికారులుగా చేరే వారికి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఇన్‌స్టిట్యూట్ లేకుండా పోయింది. గత టీడీపీ ప్రభుత్వంలో విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ సమీపంలో బోట్ యార్డులో శిక్షణా సంస్థను ఏర్పాటు చేయాలని భావించారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ బోట్ యార్డు భూమిని వైసీపీ కార్యాలయానికి కేటాయించారు. అప్పటి ఈఎన్‌సీ నారాయణరెడ్డి ఇందుకు వ్యతిరేకించినా రెవెన్యూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక శిక్షణా సంస్థను ప్రాజెక్టు కన్సల్టేషన్ సంస్థగా కూడా సద్వినియోగం చేసుకోవాలనే యోచనలో రాష్ట్ర జల వనరుల శాఖ ఉంది.

ఎన్ఆర్ఈడీఏపీ వీసీ-ఎండీగా కమలాకరబాబు

- జెన్కో ఎండీ నుంచి తక్షణమే బాధ్యతల స్వీకరణ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఎన్ఆర్ఈడీఏపీ) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎం.కమలాకరబాబును నియమించారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. బుధవారం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వు జారీ చేశారు. ప్రస్తుతం ఆ బాధ్యతలు నిర్వహిస్తున్న ఏపీజెన్కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధరబాబు నుంచి తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్ఆర్ఈడీఏపీ వీసీ అండ్ ఎండీగా కమలాకరబాబు బాధ్యతలు స్వీకరించారు. సంప్రదాయేతర ఇంధనోత్పత్తి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ఎన్ఆర్ఈడీఏపీకి పూర్తిస్థాయిలో వీసీ అండ్ ఎండీని నియమించాలని సీఎం నిర్ణయించారు. కాగా ఏపీపీసీసీ స్పెషల్ ఆఫీసర్ బాధ్యతల నుంచి కమలాకరబాబును తప్పిస్తూ మరో ఉత్తర్వు జారీ చేశారు.

ఘనంగా మాఘపౌర్ణమి



ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం వద్ద పుణ్యస్నానాలకు తరలివచ్చిన భక్తులు

- జనసంద్రంగా సాగర తీరం

విశాఖపట్నం, అనకాపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా సాగర తీరాలు జనసంద్రంగా మారాయి. విశాఖ ఆర్కే బీచ్, భీమిలి, అనకాపల్లి జిల్లాలోని పరవాడ నుంచి పాయకరావుపేట వరకూ అన్ని మండలాల్లో సముద్ర తీరాల్లో పుణ్యస్నానాలకు బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం సముద్ర తీరంలో పుణ్యస్నానాలకు ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు కాకినాడ జిల్లా నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. హోం మంత్రి వంగలపూడి అనిత రేవుపోలవరం తీరంలో పుణ్యస్నాన మాచరించారు. అచ్యుతాపురం మండలం పూడిమడక, రాంబిల్లి మండలం వాడపాలెం, పాయకరావుపేట మండలం పాల్మన్‌పేట, రత్నయ్యపేట, వెంకటనగరం, గజపతినగరం సముద్ర తీర ప్రదేశాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.